www.andhrajyothy.com
పేజీలు: 14
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 135

గురువారం | 29-8-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 1.38 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆర్ద్ర సా. 4.39 తదుపరి పునర్వసు; వర్జ్యం: తె. 5.17 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.12-11.01, మ. 3.09-3.58; అమృతఘడియలు: ఉ. 6.19-7.58; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.27

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆ పోలీసు అధికారులకు చార్జిమెమోలు

ఎమ్మెల్యేగారి భార్యగారి బర్త్‌డే చేసిన వారికి రిటర్న్ గిఫ్ట్

వేడుకలు నిర్వహించిన ఇద్దరు సీఐలను విచారించిన ఎస్పీ

వారితో పాటు ఐదుగురు ఎస్‌ఐలకూ మెమోలు జారీ

'ఆంధ్రజ్యోతి' ఫొటో కథనంతో ఉన్నతాధికారుల చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగారి భార్యగారి బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించిన చిలకలూరిపేట పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురించిన ఫొటో కథనం రాజకీయ, పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. ఎలాంటి అధికారిక హోదాలేని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు సతీమణి

మిగతా 2వ పేజీలో...

ఏపీకి పారిశ్రామిక మణిహారం

కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నగరాలకు కేంద్రం ఓకే

మూడేళ్లలో శరవేగంగా పూర్తి

కొప్పర్తిలో 54 వేలు, ఓర్వకల్లులో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు

పారిశ్రామిక పురోగతికి దోహదం

10 రాష్ట్రాల్లో 12 పారిశ్రామిక నగరాలు

మారనున్న దేశ పారిశ్రామిక రంగం

కేంద్ర మంత్రులు పీయూష్, వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏపీలో పారిశ్రామిక స్మార్ట్ సిటీ (స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ)ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కడప జిల్లాలోని కొప్పర్తి, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా సుమారు లక్ష మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అదేవిధంగా రాష్ట్రం పారిశ్రామికంగా మరింత అభివృద్ధిపథంలో దూసుకుపోనుంది. ఇక, తెలంగాణలోని జహీరాబాద్‌లోనూ పారిశ్రామిక స్మార్ట్ సిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుమతించింది. వీటితో పాటు దేశవ్యాప్తంగా మొత్తం 10 రాష్ట్రాల్లో ఇదే తరహాలో 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలను

మిగతా 12వ పేజీలో...

కొప్పర్తి పారిశ్రామిక స్మార్ట్ సిటీ..
నిర్మాణం: 2,596 ఎకరాల్లో
వ్యయం: రూ.2,137 కోట్లు
రానున్న పెట్టుబడులు: రూ.8,860 కోట్లు
ఉద్యోగ, ఉపాధి కల్పన: 54,500 మందికి

ఓర్వకల్లు పారిశ్రామిక స్మార్ట్ సిటీ
నిర్మాణం: 2,621 ఎకరాల్లో
వ్యయం: రూ.2,786 కోట్లు
రానున్న పెట్టుబడులు: రూ.12 వేల కోట్లు
ఉద్యోగ, ఉపాధి కల్పన: 45,071 మందికి

పోలవరానికి కేంద్ర నిధులు

మోదీ సర్కారు ఆమోదముద్ర

టీడీపీ హయాంలోనే 74% ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి

జగన్ పాలనలో పనులు పడక

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

12

ఆ ఐపీఎస్‌ల పనులు వింటుంటే అసహ్యమేస్తోంది

కామ పార్టీల గురించి మాట్లాడాల్సి వస్తోంది

నాటి పాలకులకు బాధ కలిగించలేదా?

వారిని అదుపు చేయాలనిపించలేదా?

ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా?

ఇలాంటివాళ్లు ప్రజాస్వామ్యానికి అక్కర్లేదు: సీఎం

11

వైసీపీ స్థాయికి మనం దిగజారొద్దు


కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు

నేను ప్రభుత్వ స్థాయి పెంచుతుంటే


కొందరు బుల్‌డోజర్లతో కూలుస్తున్నారు

ఒకరిద్దరి తప్పులతో మొత్తానికే చెడ్డపేరు

టీడీపీ ఎమ్మెల్యేల శైలిపై సీఎం సీరియస్

పోలవరానికి 12,127 కోట్లు

పోలవరం ప్రాజెక్టును నాశనం చేసిన వారిపై విచారణల గురించి మేం ఆలోచించడం లేదు. ముందు ఆ ప్రాజెక్టు ఎలా పూర్తి చేయాలన్నదానిపైనే దృష్టి పెట్టాం.
- ముఖ్యమంత్రి చంద్రబాబు



కేంద్ర కేబినెట్ ఆమోదం

మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు: సీఎం

ఇక కొత్త డయాఫ్రం వాల్ సహా 2027 మార్చిలోగా తొలిదశ పనులు పూర్తి

మేఘా-బావర్ కలిసి వాల్ పూర్తిచేసేలా ఒప్పందం

పాత టెండర్ల ధరలకే పనులు చేయించే ఆలోచన

చప్పట్లతో సీఎంకు, కేంద్రానికి మంత్రుల ధన్యవాదాలు

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు తొలి దశకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇక కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం సహా మిగిలిన హెడ్‌వర్క్స్ పనులు 2027 మార్చినాటికి పూర్తవుతాయని ప్రకటించారు. ఇందుకుగాను ప్రధానికి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. పోలవరం తొలిదశ పనులకు నిధులు మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నందున హెడ్ వర్క్స్ పనుల కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బుధవారం రాష్ట్ర మంత్రివర్గ

మిగతా 11వ పేజీలో...

సెబ్ రద్దుకు కేబినెట్ ఓకే

రివర్స్ టెండరింగ్‌కూ గుడ్‌బై

పోలవరం ఎడమ కాలువ పనులకు ఆమోదం

పాత ఉచిత ఇసుక విధానానికి గ్రీన్‌సిగ్నల్

ఒక రోజు ముందే పింఛన్ల పండగ

1న ఆదివారం కావడంతో ఈసారి 31నే పంపిణీ

11

జగన్‌కు బిగ్ షాక్!

వైసీపీకి మోపిదేవి గుడ్‌బై

ఎమ్మెల్సీ పోతుల సునీత కూడా

రాజ్యసభ సభ్యత్వానికి మోపిదేవి వెంకటరమణ నేడు రాజీనామా

త్వరలో తెలుగుదేశం పార్టీలోకి

అదే దారిలో మరో ఎంపీ మస్తాన్‌రావు

అయోధ్య రామిరెడ్డి, బోస్, బాబూరావూ వైసీపీని వీడతారని ప్రచారం

మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య కూడా..

పార్టీలో ఉంటే భవిష్యత్ ఉండదనే!

ఇక వైసీపీలో మిగిలే ఎంపీలు వైవీ, సాయిరెడ్డి, నత్వానీ, నిరంజన్‌రెడ్డే?

మండలి సభ్యత్వానికీ సునీత రాజీనామా

అమరావతి/బాపట్ల/న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆ పార్టీ నేతలు భారీ షాకిచ్చారు. ఆయనకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు.. చేనేత వర్గానికి చెందిన ఎమ్మెల్సీ పోతుల సునీత వైసీపీకి గుడ్‌బై చెప్పారు. మోపిదేవి దారిలోనే వైసీపీకి చెందిన ఇంకో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు కూడా పదవికి, పార్టీకి రాజీనామా చేయనున్నట్లు

మిగతా 12వ పేజీలో...


మోపిదేవి


పోతుల సునీత

చిత్రహింసలు పెట్టారు

ముంబై నటి కాదంబరి, ఆమె తల్లి ఆశా ఆవేదన

కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఏపీ అధికారులు

కన్నీటి పర్యంతమవుతూ వివరాల వెల్లడి.. తొలిసారి బయటికి వచ్చిన నటి



"కొందరు పోలీసు అధికారులు తమ అధికారాన్ని ఉపయోగించి నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా వేధించారు. వాళ్ల వేధింపుల నుంచి నేను ఇప్పటికీ కోలుకోలేకపోతున్నాను. సరిగా నిద్ర కూడా పట్టని పరిస్థితి. ఓ క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వ్యక్తి ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా నన్ను, నా కుటుంబాన్ని దారుణంగా వేధించారు"
- కాదంబరి జెత్వానీ, నటి, వైద్యురాలు

మూడు రోజులు వీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో నిర్బంధం

అత్యంత కర్కశంగా వ్యవహరించారు

బాబునే అరెస్టు చేశాం.. మీరెంత అని బెదిరించారు

నెలసరిలో న్యాప్‌కిన్స్ కూడా అనుమతించలేదు

బెజవాడలో వేధింపులు జీవితాంతం మర్చిపోలేం

తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నారు: ఆశా

కుక్కల విద్యాసాగర్ అసభ్య చిత్రాలతో వేధించారు

వృద్ధులైన తల్లిదండ్రులనూ అన్యాయంగా తీసుకొచ్చారు

కనీసం ఫోన్ కాల్ కూడా చేసుకోనివ్వలేదు: కాదంబరి

(విజయవాడ/అమరావతి - ఆంధ్రజ్యోతి)

'చంద్రబాబునే అరెస్టు చేశాం! ఇక మీరెంత! మాతో పెట్టుకుంటే అంతే!'... ముంబై నటిని 'వైసీపీ' పోలీసులు బెదిరించిన తీరిది! ఆమె పేరు... కాదంబరి జెత్వానీ! నటి మాత్రమే కాదు... వైద్యురాలు కూడా! వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ పెట్టిన తప్పుడు కేసులో ఆమెను, ఆమె తల్లిదండ్రులనూ అరెస్టు చేసి నరకం చూపించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం

మిగతా 2వ పేజీలో...


తిరుమలకు బయల్దేరుతున్న నందిని నెయ్యి ట్యాంకర్

తిరుమలకు మళ్లీ 'నందిని నెయ్యి'

కేజీ రూ.470కి కొనుగోలుకు టెండరు ఖరారు

ఇప్పటికే తిరుమలకు చేరుకున్న 2 ట్యాంకర్లు

పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిన అధికారులు

శ్రీవారి లడ్డూకు పూర్వవైభవం తెచ్చే యత్నాలు

2

'వైపీఎస్'లపై ఎఫ్ఐఆర్‌లు?

ఏడుగురు ఐపీఎస్‌లపై కేసుల కత్తి

ఇప్పటికే ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు

రఘురామ కేసులో పీవీ సునీల్, పీఎస్ఆర్‌పై

ముంబై నటి ఫిర్యాదు చేస్తే రాణా, గున్నీపైనా?


అన్నురాజన్, ఫక్కీరప్పపై కేసు పెట్టాలంటున్న సీబీఐ

కాకాణి కేసులో విజయారావుపై విచారణ

వైసీపీకి వంతపాడినందుకు చిక్కుల్లో ఐపీఎస్‌లు

వైఎస్ హయాంలో ఐఏఎస్‌లకు ఇదే పరిస్థితి


పీవీ సునీల్


పీఎస్ఆర్


కాంతిరాణా టాటా


విశాల్ గున్నీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కొందరు అధికారులు ఐపీఎస్‌లమనే విషయాన్ని మరిచిపోయారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలు చెప్పినట్టల్లా చేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు అందడమే ఆలస్యం ప్రతిపక్ష నేతలతో పాటు సామాన్యులపైనా విరుచుకుపడ్డారు. చివరకు సీబీఐ అధికారులను కూడా వదిలిపెట్టలేదు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లు ఐపీసీని పూర్తిగా పక్కన బెట్టేసి వైసీపీ కోడ్‌ను అమలు చేశారు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవన్నట్టు జగన్ సర్కారు పోయి టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చింది. గత పాపాలు పాములై ఇప్పుడు వెంటాడుతుండటంతో వైసీపీకి వంతపాడిన అధికారులు దిక్కుతోచక బిక్కు బిక్కు మంటున్నారు. ఈ జాబితాలో పీవీ సునీల్ కుమార్, పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, కేకేఎస్ అన్నురాజన్, ఫక్కీరప్ప కాగినెల్లి, సీహెచ్ విజయా రావు పేర్లు ఉన్నట్లు పోలీసు ఉన్నతస్థాయి వర్గాలలో వినిపిస్తున్నాయి. గతంలో చేసిన తప్పులకు కేసుల కత్తి వెంటాడుతోంది. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు గతంలో నరసాపురం ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి సీఎం జగన్ పాలనపై కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి అర్ధరాత్రి మంగళగిరిలోని సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చి లాఠీలతో చితకబాదారు. అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన

మిగతా 12వ పేజీలో...

ఎంత ఉదారత 'బాబూ'!

పులివెందుల బిల్లులన్నీ క్లియర్

గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసినవారికి ఇప్పటికీ పెండింగ్

బకాయిలు రూ.లక్షన్నర కోట్లకు పైనే

బాధితుల్లో చాలామంది టీడీపీవారే

కానీ పులివెందులతో పాటు కడప కాంట్రాక్టర్లకు 100 కోట్లు చెల్లింపు

ఎవరు చెబితే ఆ బిల్లులు చెల్లించారు?

జగన్ కళ్లలో ఆనందం కోసమేనా?

ఆర్థిక శాఖ తీరుపై సర్వత్రా విస్మయం


పులివెందుల వెళ్లిన జగన్‌ను బిల్లుల కోసం నిలదీస్తున్న పార్టీ నేతలు(ఫైల్)

జగన్ పులివెందులకు వెళ్లినపుడు.. వివిధ రకాల పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఆయన్ను గట్టిగా ప్రశ్నించారు. ఆగ్రహంతో నిలదీసినంత పనిచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఎందుకో? ఏమో? కానీ వారందరికీ బిల్లులు క్లియర్ చేసింది. ఎప్పుడో గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసిన వారి బిల్లులకు మాత్రం ఇప్పటికీ దిక్కులేదు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు జగన్ సర్కారు బిల్లులు చెల్లించకుండా వేధించింది. గత ఐదేళ్లు కాంట్రాక్టర్లు కాళ్లరిగేలా తిరిగినా జగన్ ప్రభుత్వం కక్షసాధింపు వైఖరితో వారికి చుక్కలు చూపించింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా వారికి ఇప్పటికీ బిల్లులు

మిగతా 12వ పేజీలో...



భారీగా పెరిగిన

విద్యార్థుల ఆత్మహత్యలు

జనాభా పెరుగుదల రేటునూ దాటేసిన వైనం

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో అత్యధికం

యువకుల్లో కంటే యువతుల్లోనే ఎక్కువ

ఒత్తిడి తదితర కారణాలు.. కౌన్సెలింగ్‌తో నివారణ

2


ఐఎన్ఎస్ అరిఘాత్

శత్రువుల పీచమణిచే అణుజలాంతర్గామి..

ఐఎన్ఎస్ అరిఘాత్ రెడీ!

సెప్టెంబరులో ప్రధాని చేతులమీదుగా జాతికి అంకితం

ఏర్పాట్ల పరిశీలనకు నేడు విశాఖకు రక్షణ మంత్రి

2



శ్రీశైలం డ్యామ్ నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలం జలాశయానికి పెరిగిన వరద

» ఆరు గేట్లు ఎత్తి సాగర్‌కు నీటి విడుదల

శ్రీశైలం, ఆగస్టు 28: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో డ్యాం అధికారులు 6 గేట్లను 10 అడుగులమేర ఎత్తి దిగువన నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం జూరాల నుంచి 2,85,409 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 962 క్యూసెక్కులు మొత్తం 2,86,371 క్యూసెక్కుల వరద వస్తోంది. రాత్రి 9 గంటల సమయానికి జలాశయానికి 2,71,344 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 885.00 అడుగులుగా నమోదైంది. అంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,826 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు, జలాశయం 6 క్రస్టుగేట్ల ద్వారా 1,68,174 క్యూసెక్కులు... మొత్తం 2,36,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అమెరికాలో సిక్కోలు విద్యార్థి మృతి

» సరస్సు వద్ద ఫొటోలు దిగుతూ జారిపడి దుర్మరణం

ఇచ్ఛాపురం, ఆగస్టు 28: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన రూపక్ రెడ్డి(26) ఎంఎస్ చేయడానికి 10నెలల క్రితం అమెరికా వెళ్లారు. బర్గ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎంఎస్ చేస్తున్న ఆయన మంగళవారం ఐదుగురు స్నేహితులతో కలసి సరస్సులో బోటింగ్‌కు వెళ్లారు. సరస్సు మధ్యలో ఉన్న రాయిపైకి ఎక్కి ఫొటోలు దిగుతుండగా రూపక్‌రెడ్డితోపాటు స్నేహితుడు రాజీవ్ సరస్సులోకి జారిపడిపోయారు. మిగతా స్నేహితులు రాజీవ్‌ను కాపాడినా, రూపక్ రెడ్డిని రక్షించలేకపోయారు. రూపక్ రెడ్డి తండ్రి పి.కవిరాజ్‌రెడ్డి ఉపాధ్యాయుడు. తల్లి ధనవతి గృహిణి. రూపక్ రెడ్డి మరణవార్త తెలుసుకుని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.



ప్రమాదానికి ముందు బోటింగ్ చేస్తున్న రూపక్ రెడ్డి

ఆ పోలీసు అధికారులకు చార్జిమెమోలు

(మొదటి పేజీ తరువాయి)

వెంకట కుమారి జన్మదిన వేడుకల్లో యూనిఫాంతో పాల్గొని ఆమెతో కేక్ కట్ చేయించిన పోలీసు అధికారులపై చర్యలకు రంగం సిద్ధమైంది. సదరు అధికారులను బుధవారం నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయానికి పిలిపించిన ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా విచారణ జరిపారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ సీహెచ్ రమేశ్, రూరల్ సీఐ సుబ్బనాయుడును విచారించి వివరాలు సేకరించారు. ఇద్దరు సీఐలతో పాటు ఐదుగురు ఎస్ఐలకూ ఎస్పీ చార్జిమెమోలు జారీ చేశారు. 'ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేల ప్రవర్తనతో ఇన్నాళ్లూ నిర్మించుకున్న మంచిపేరు దెబ్బతింటోంది. వారు చేస్తున్న పొరపాట్లను ప్రస్తావిస్తూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీనివల్ల అందరికీ చెడ్డపేరు వస్తోంది' అంటూ కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో కలకలం రేగింది. మొదటినుంచీ ఎమ్మెల్యే పుల్లారావు సతీమణి వెంకట కుమారి వ్యవహార శైలిని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ కార్యక్రమాలు, అధికారుల బదిలీల్లో కూడా ఆమె మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో అధికారులకు నియోజకవర్గంలో పోస్టింగుల్లో వెంకట కుమారి కీలకంగా వ్యవహరిస్తున్నారని, అక్రమ వ్యాపారులకు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలున్నాయి.

ప్రతిజిల్లాలో సైబర్ స్టేషన్లు

» గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

» త్వరలో టోల్‌ఫ్రీ నంబర్ 1972: డీజీపీ



విశాఖపట్నం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలతో పాటు పోలీస్‌శాఖకు సవాల్‌గా మారుతున్న సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి జిల్లాలోనూ సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు డీజీపీ ద్వారకాతిరుమలరావు తెలిపారు. విశాఖ నగరంతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోలీసుల పనితీరు, గంజాయి, డ్రగ్స్ నియంత్రణ, సైబర్‌క్రైమ్ కేసుల పెరుగుదల, పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, డీఐజీ, ఐజీ స్థాయి అధికారులతో విశాఖలో బుధవారం ఆయన సమీక్షించారు. అనంతరం మీడియాతో డీజీపీ మాట్లాడుతూ.. సైబర్‌క్రైమ్ నియంత్రణకు సబ్ డివిజన్ స్థాయిలో ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీనికోసం ఇప్పటికే ఐదుగురు మంత్రులతో సబ్‌కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ కోసమే ప్రత్యేకంగా పనిచేసేలా యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్(ఏఎన్‌టీఎఫ్)కు రూపకల్పన చేశామన్నారు. దీనికి ఇన్‌చార్జిగా ఐజీ స్థాయి అధికారి ఆకే రవికృష్ణను నియమించామన్నారు. ఎక్కడైనా గంజాయి సమాచారాన్ని పోలీసులకు చేరవేసేందుకు వీలుగా టోల్‌ఫ్రీ నంబర్ 1972 అందుబాటులోకి తెస్తామన్నారు. మదనపల్లె ఫైళ్ల దహనం కేసు దర్యాప్తులో ఉందని డీజీపీ చెప్పారు. ఈ ఫైళ్లను దహనం చేసినవారెవరో తెలిసిందని, అయితే, వారి వెనుక ఉన్నవారెవరనేది గుర్తించే పనిలో ఉన్నామన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా తనిఖీలు నిర్వహించగా కొన్ని ఫైళ్లు కార్యాలయంలో కాకుండా అధికారుల ఇళ్లలో లభించాయని చెప్పారు. పోలీస్ సంక్షేమానికి సంబంధించి కేంద్రం ఇచ్చే గ్రాంటుకు రాష్ట్రప్రభుత్వ వాటాను సమకూర్చకపోవడంతో గత మూడేళ్లుగా నిధుల విడుదల నిలిచిపోయిందని డీజీపీ తెలిపారు. దీంతో కిందిస్థాయి సిబ్బందిలో అసంతృప్తి పెరిగిపోయిందన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే రూ.64.2 కోట్లు విడుదల చేశారని తెలిపారు.

నటి కేసుపై సీపీతో మాట్లాడా: డీజీపీ


ముంబై నటి కేసు ఉదంతాన్ని పత్రికల్లో చూసి, వెంటనే విజయవాడ పోలీసు కమిషనర్(సీపీ)తో మాట్లాడినట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. కేసు దర్యాప్తులో అక్రమాలు జరిగినట్టు తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేయడం సరికాదని, ఎవరు చట్టాన్ని అతిక్రమించినాసరే పార్టీలకు అతీతంగా పోలీసులు నిబంధనల ప్రకారం నడుచుకుంటారని తెలిపారు. మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసు దర్యాప్తులో అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు.

భారీగా పెరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు!

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఏటా భారీగా పెరిగిపోతున్నాయని తాజా నివేదిక ఒకటి ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యల వార్షిక పెరుగుదల రేటు దేశంలోని జనాభా పెరుగుదల రేటును కూడా దాటేసిందని తెలిపింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) సమాచారం ఆధారంగా ఐసీ3 స్వచ్ఛంద సంస్థ ఈ నివేదికను రూపొందించింది. 'స్టూడెంట్స్ సూసైడ్స్: యాన్ ఎపిడెమిక్ స్వీపింగ్ ఇండియా' పేరిట రూపొందించిన ఈ నివేదికను బుధవారం యాన్యువల్ ఐసీ3 కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్‌పో-2024లో విడుదల చేశారు. దేశంలో ఆత్మహత్యల సంఖ్య ఏటా రెండు శాతం పెరిగిపోతుండగా, విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య 4 శాతం పెరిగిపోతోందని తెలిపింది. గత రెండు దశాబ్దాల్లోనే విద్యార్థుల వార్షిక ఆత్మహత్యల రేటు 4 శాతానికి పెరిగిందని వెల్లడించింది. గత దశాబ్ద కాలంలో పురుష విద్యార్థుల ఆత్మహత్యలు 50 శాతం, మహిళా విద్యార్థుల ఆత్మహత్యలు 61 శాతం పెరిగిపోయాయని పేర్కొంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో విద్యార్థుల ఆత్మహత్యలు అత్యధికంగా జరుగుతున్నాయని, దేశంలో మూడో వంతు ఆత్మహత్యలు ఈ మూడు రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయని తెలిపింది. కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన కోటా ప్రాంతం ఉన్న రాజస్థాన్‌లో విద్యార్థులు అత్యధిక ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో విద్యార్థుల ఆత్మహత్యల్లో ఆ రాష్ట్రం 10వ స్థానంలో నిలిచిందని పేర్కొంది.

దేశానికి పారిశ్రామిక నగరహారం

బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదించిన పారిశ్రామిక నగరాలు



ఈశాన్య రాష్ట్రాల్లో జలవిద్యుత్తు

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిలో భాగంగా జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. రూ.4,136 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 15 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

రూ.6,456 కోట్లతో రైల్వే పనులు

న్యూఢిల్లీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఒడిసా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో రెండు కొత్త రైల్వే లైన్లతోపాటు.. మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.6,456 కోట్లు కేటాయించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 300 కిలోమీటర్ల మేర అదనపు రైల్వేలైన్లు అందుబాటులోకి వస్తాయని, మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల్లో భాగంగా 14 కొత్త రైల్వే స్టేషన్లు నిర్మిస్తారని రైల్వే శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయం వల్ల 1,300 గ్రామాల్లోని 11 లక్షల మందికి రైల్వే సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. కాగా, దేశంలోని మరో 234 నగరాలకు ఎఫ్ఎం రేడియో సేవలను విస్తరించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇందుకోసం 730 ఎఫ్ఎం చానళ్లను వేలం వేయనుంది. దీనికి అంచనా రిజర్వ్ ధర రూ.784.87 కోట్లుగా ఉంటుందని కేంద్రం భావిస్తోంది.

ఏఐఎఫ్‌కు లక్ష కోట్లు

వ్యవసాయ మౌలిక వసతుల నిధి(ఏఐఎఫ్)కి రూ. లక్ష కోట్ల నిధులు అందజేసేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నిర్ణయంతో దేశంలో వ్యవసాయ ఆధారిత వసతులు మెరుగుపడతాయన్నారు. ఈ నిధిని ప్రధాని నరేంద్ర మోదీ 2020లోనే ప్రారంభించినట్లు గుర్తుచేశారు. దీని ద్వారా 6,623 గోదాములు, 688 కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేశామని, ఈ చర్యల వల్ల దేశంలో వ్యవసాయోత్పత్తుల నిల్వ సామర్థ్యం మరో 500 లక్షల టన్నులు పెరిగిందని చెప్పారు. ఇప్పటి వరకు రూ.47,575 కోట్ల విలువైన 74,508 ప్రాజెక్టులు మంజూరయ్యాయని, ఫలితంగా.. వ్యవసాయ రంగంలో రూ.78,596 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయన్నారు. ఏఐఎఫ్ ద్వారా ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 8.19 లక్షల మందికి ఉపాధి లభించిందని పేర్కొన్నారు.

ఈడీ కేసుల్లోనూ బెయిల్ వర్తింపు

» కస్టడీలో నిందితుల నేరాంగీకారాన్ని సాక్ష్యంగా పరిగణించలేం: సుప్రీంకోర్టు

» సీఎం సోరెన్ సహాయకుడికి బెయిల్

న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసుల్లోనూ బెయిల్ నియమం వర్తిస్తుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. 'మనీలాండరింగ్ కేసులకూ 'బెయిల్ నియమం.. జైలు మినహాయింపు' అనే సాధారణ న్యాయ సూత్రం వర్తిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ అనేది ఎప్పటికీ నియమమే. దాన్ని కోల్పోవాల్సి వస్తే అది చట్టబద్ధంగానే జరగాలి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద బెయిల్ కోసం విధించిన కఠిన షరతులు ఈ నిబంధనను అధిగమిస్తాయి. ఈడీ కస్టడీలో ఉన్నప్పుడు నిందితుడి నేరాంగీకారం అనేది సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 25 మేరకు అసలు సాక్ష్యంగా పరిగణించలేం' అని పేర్కొంది. అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సహాయకుడు ప్రేమ్‌ప్రకాశ్ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈమేరకు స్పందించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఆప్ నేత మనీశ్ సిసోడియాపై నమోదైన మనీలాండరింగ్ కేసులో ఆగస్టు 9న ఇచ్చిన తీర్పును జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ప్రస్తావించింది. బెయిల్ అనేది నియమమని.. జైలు మినహాయింపు అని తాము చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం నిందితుడికి విధించిన బెయిల్ షరతులు అతడి స్వేచ్ఛను హరించాలనే కొత్త సిద్ధాంతాన్ని లిఖించలేవని పేర్కొంది. ప్రేమ్ ప్రకాశ్ ప్రాథమికంగా నేరం చేసినట్లు గానీ, బయటికొస్తే సాక్షులను ప్రభావితం చేయగలడని చెప్పడానికి గానీ ఆధారాలులేవని తెలిపింది. అందుకే అతడికి రూ.5 లక్షల విలువైన బాండ్, ఇద్దరి పూచీకత్తుతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. మార్చి 22న ఝార్ఖండ్ హైకోర్టు బెయిల్‌ను తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు కొట్టేసింది.

జన్ ధన్ యోజన సాధికారతకు చిహ్నం

» 53 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు

» వాటిలో 2.3 లక్షల కోట్ల నిల్వ: ప్రధాని

» పథకానికి బుధవారంతో పదేళ్లు పూర్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: ప్రధాని మోదీ 2014లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కార్యక్రమం బుధవారానికి సరిగ్గా పదేళ్లు పూర్తిచేసుకుంది. దీనిపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. గౌరవం, సాధికారతకు ఈ కార్యక్రమం చిహ్నమని, కోట్లాది మంది దేశ ఆర్థికాభివృద్ధిలో పాలుపంచుకునేందుకు ఇది అవకాశం కల్పించిందని తెలిపారు. 'ఈ పథకం కింద కొత్తగా 53 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఆ ఖాతాల్లో రూ.2.3 లక్షల కోట్లకుపైగా డిపాజిట్లు ఉన్నాయి" అని వెల్లడించారు. జన్‌ధన్ యోజన కింద తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా ప్రజలకు వేర్వేరు ప్రభుత్వ పథకాల కింద రూ.39లక్షల కోట్ల నగదు బదిలీ జరిగిందన్నారు. "మహిళల సాధికారతకు ఈ స్కీం గేమ్‌చేంజర్‌గా మారింది. 30 కోట్ల మంది మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకొచ్చాం" అని చెప్పారు. జన్ ధన్ యోజన లేకుంటే ముద్ర యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి సామాజిక భద్రత పథకాలు విజయవంతమయ్యేవి కావని వ్యాఖ్యానించారు. ఈ పథకం అవసరమా అని హేళన చేసినవారే ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల అవసరమేంటని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. 'ప్రజల సమష్టి సంకల్పాన్ని వారు తక్కువ అంచనా వేశారు. భారత డిజిటల్ చెల్లింపులు విజయవంతం కావడాన్ని ప్రపంచమంతా గుర్తిస్తోంది. డిజిటల్ చెల్లింపుల్లో 40% భారత్‌లోనే జరుగుతున్నాయి" అన్నారు.



సెప్టెంబరులో అమెరికాకు మోదీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల ముంగిట, సెప్టెంబరు మూడో వారంలో మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. 22న న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులతో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రసంగించనున్నారు. నవంబరు 5న అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరుగనుంది. కాగా.. 2019 సెప్టెంబరు 22న హూస్టన్‌లో 'హౌడీ మోదీ' కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. ఆ సభకు నాటి అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యారు.

చిత్రహింసలు పెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించాయి. దీంతో... పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. 'అప్పుడు ఏం జరిగింది? ఇందులో కుక్కల విద్యాసాగర్ పాత్ర ఏమిటి? ఎవరి ఆదేశాల మేరకు అప్పటి పోలీసు కమిషనర్ కాంతి రాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీ అత్యుత్సాహం ప్రదర్శించారు?' వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో నేరుగా ముంబై నటి కాదంబరితోపాటు ఆమె కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం...

అంతర్జాతీయ స్మగ్లర్లు, ఉగ్రవాదుల తరహాలో తమను ఏపీ పోలీసులు అరెస్టు చేసి విమానంలో తీసుకొచ్చారని జెత్వానీ కుటుంబ సభ్యులు వాపోయారు. విశాల్ గున్నీ నేతృత్వంలో జెత్వానీని, ఆమె తల్లిదండ్రులను ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన విజయవాడకు తీసుకొచ్చారు. మూడు రోజులపాటు వారిని ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో ఉంచారు. తీవ్రంగా హింసించారు. ఫిబ్రవరి 6వ తేదీన కాదంబరిని రిమాండుకు పంపించారు. "ఏపీలో ఎంత పెద్దవారైనా వైసీపీ నేతలతో పెట్టుకుంటే జైలుకు వెళ్లాల్సిందే. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిస్థితి చూశారా" అని ఆమె తల్లి ఆశా జెత్వానీని హెచ్చరించారు. రాజీపడాలని, భవిష్యత్తులో ఇటువైపు రావొద్దని, అలాగైతేనే జైలు నుంచి కాదంబరి బయటికి వస్తుందని ఆమె కుటుంబ సభ్యుల్ని బెదిరించారు. రిమాండ్ ఖైదీగా ఉన్న ఆమెను చూసేందుకు ములాఖత్‌లు ఇవ్వకుండా జైలు అధికారులపై విజయవాడ పోలీసులు ఒత్తిడి చేశారు. తన కుమార్తెకు నెలసరి వచ్చినప్పుడు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపేందుకూ అంగీకరించలేదని ఆశా జెత్వానీ కన్నీటి పర్యంతమయ్యారు. సాటి మనుషులపట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారని అనుకోలేదని రోదించారు. ఇక్కడ ఏకంగా ప్రభుత్వ పెద్దలు, ఐపీఎస్ అధికారులు బెదిరిస్తుండటంతో తమ సన్నిహితులెవరూ సహాయం చేసేందుకు ముందుకు రాలేదన్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం ఎలా బయటికి వచ్చిందో తమకు తెలియదని, తనను హింసించిన వైసీపీ నాయకుడు విద్యాసాగర్‌తోపాటు పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆశా జెత్వానీ విన్నవించుకొంటున్నారు. త్వరలో నేరుగా విజయవాడకు వచ్చి హోంశాఖ మంత్రితోపాటు డీజీపీని కూడా కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాలని జెత్వానీ కుటుంబ సభ్యులు భావిస్తున్నట్లు తెలిసింది.

మనశ్శాంతి కరువై...

కాదంబరి బుధవారం ఓ చానల్‌లో మాట్లాడారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో తనకు 2015లో పరిచయం ఏర్పడిందని, అదే ఏడాది అతను తనకు పెళ్లి ప్రతిపాదన చేశాడని ఆమె తెలిపారు. కానీ... ఆయన నేపథ్యం తెలిసి తాను ఆ ప్రతిపాదన తిరస్కరించానని జెత్వానీ తెలిపారు. "విద్యాసాగర్‌కు పెళ్లయిన 14 నెలలకే భార్య వదిలేసి వెళ్లి పోయారు. ఆయనకు చాలా మంది అమ్మాయిలతో సంబంధాలు ఉన్నాయని గుర్తించి అతన్ని దూరం పెట్టాను. అప్పటి నుంచి నగ్న వీడియో కాల్స్‌తో, అసభ్యకర సందేశాలతో నన్ను వేధించసాగాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో విద్యాసాగర్ నాపై దొంగ కేసు పెట్టాడు" అని వాపోయారు. ఆంధ్రాలో కేవలం ట్రైలర్ మాత్రమే చూపించారని, మిగిలిన రాష్ట్రాల్లోనూ దొంగ కేసులు పెట్టి వేధిస్తామని తనను బెదిరించారని తెలిపారు. ముంబైలో కేసు (సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసు) విత్‌డ్రా చేసుకుంటే ఇక్కడ తనపై కేసు తీసివేస్తామని చెప్పారని... కానీ ఇప్పటికీ కేసు విత్ డ్రా చేసుకోలేదని జెత్వానీ ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా యూఏఈలో వ్యాపారం చేసుకుంటున్న తన సోదరుడిపై కూడా కేసు నమోదు చేశారని తెలిపారు.

> "మేం నిస్సహాయులుగా మిగిలిపోయాం. కనీసం ప్రాణాలతోనైనా ఉండాలనే ఉద్దేశంతో విజయవాడ పోలీసులు అడిగినట్లుగా తెల్లకాగితాలపై సంతకాలు పెట్టాం. దీంతో వాళ్లే మార్చి 15న మాకు బెయిలు ఇప్పించారు. ఈ విషయాల గురించి ఎవ్వరితోనూ మాట్లాడకూడదని హెచ్చరించారు. మీడియాతో మాట్లాడినా, భవిష్యత్తులో కోర్టుకు వెళ్లినా... జీవితాంతం జైల్లోనే మగ్గేలా చేస్తామని మేం సంతకాలు చేసిన తెల్లకాగితాలు చూపిస్తూ హెచ్చరించారు"
> -ఆశా జెత్వానీ (కాదంబరి తల్లి)

ఫోర్జరీ డాక్యుమెంట్‌పై...

వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ 2024 ఫిబ్రవరి 2న ఇబ్రహీంపట్నంలో కేసు నమోదు చేశారు. అది కూడా ఓ ఫోర్జరీ డాక్యుమెంట్‌ను చూపించి ఈ కేసు పెట్టారు. జెత్వాని ముంబైలో ఇప్పుడు నివాసం ఉంటున్న ఫ్లాట్‌ను 2020లో కొనుగోలు చేశారు. అయితే 2018లో కొనుగోలుకు సంబంధించిన అగ్రిమెంట్ జరిగింది. అగ్రిమెంట్ మాత్రమే జరిగిన ఫ్లాట్‌లో ఆమె ఉంటున్నట్టు చూపడం గమనార్హం. ఆ ఫోర్జరీ డాక్యుమెంట్‌ను ఆధారంగా చేసుకుని కేసు నమోదు చేయడం, ఆ మరుసటి రోజే అంటే, ఫిబ్రవరి 3న ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ ఆధ్వర్యంలో ఏసీపీలు రమణమూర్తి, హనుమంతరావు, సీఐ ముత్యాల సత్యనారాయణ, ఎస్సై షరీఫ్ ముంబై వెళ్లి కాదంబరిని, ఆమె కుటుంబ సభ్యులను విజయవాడకు తీసుకొచ్చారు. మూడు రోజులు ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ అతిథిగృహంలో పెట్టి చిత్రహింసలకు గురి చేశారు. కాదంబరిపై భౌతికంగా దాడులు చేశారు. ఫిబ్రవరి 6న ఆమెను, ఆమె తల్లిదండ్రులను రిమాండుకు పంపించారు.

ఫోర్జరీ డాక్యుమెంట్ ఆధారంగా పెట్టిన దొంగ కేసులో కాదంబరి కుటుంబంపై 10ఏళ్ల శిక్ష పడే సెక్షన్లు నమోదు చేయడం గమనార్హం. సుమారు 40 రోజులపాటు వారు జైలులోనే ఉండే పరిస్థితి కల్పించారు. వారికి సంబంధించిన 18 బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారు. అందులో 80 లక్షల రూపాయలు ఉన్నాయి. కాదంబరి తండ్రి మర్చంట్ నేవీలో పనిచేయగా, ఆమె తల్లి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేశారు. ఈ కేసులో పోలీసులు ఎంత అడ్డగోలుగా వ్యవహరించారో తెలియాలంటే అప్పటి సీపీ కాంతి రాణాతోపాటు ఈ కేసులో పాల్గొన్న అప్పటి సీఐ ముత్యాల సత్యనారాయణ తదితరుల ఫోన్ కాల్స్ డేటా, వాట్సాప్ చాట్‌ను పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆమె తరపు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

కుక్కల విద్యాసాగర్ ఎక్కడ?

జెత్వాని కేసు సంచలనంగా మారినా ఈ కేసులో సూత్రధారి, ఫిర్యాదుదారు అయిన కుక్కల విద్యాసాగర్ ఎక్కడున్నారో తెలియడంలేదు. విద్యాసాగర్‌కు, సజ్జన్ జిందాల్‌కు పరిచయం ఏమిటి? జిందాల్‌ను రక్షించేందుకే విద్యాసాగర్ ఈ దొంగ కేసు పెట్టారా? అప్పటి వైసీపీ పెద్దల ప్రమేయం ఎంత వరకు ఉంది? తదితర ప్రశ్నలకు సమాధానం తెలియాల్సి ఉంది. ముంబై నటి కాదంబరి జెత్వానీ అంశంపై పోలీసు ఉన్నతాధికారులు అంతర్గత విచారణ ప్రారంభించారు. విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ప్రస్తుతం ఉన్న ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్‌ను కేసు గురించి ఆరా తీశారు. ఈ కేసు సీడీ (కేస్ డైరీ) ఫైల్‌ను సీపీ పరిశీలించినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం విజయవాడ పోలీసు కమిషనరేట్‌కు వచ్చారు. సీపీతో సుమారుగా అరగంటపాటు భేటీ అయ్యారు. ముంబై నటి కేసుపై ఇద్దరూ చర్చించారని తెలుస్తోంది. ఈ కేసు వెనుక అప్పటి సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, పోలీసు అధికారుల పాత్ర ఉందని బలంగా ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఈ విషయం సంచలనం సృష్టించడంతో ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదికతోపాటు ముంబై నటి నేరుగా వచ్చి ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కాంతి రాణా, విశాల్ గున్నీ, ఇతర పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశముంది.

దారుణమైన కేసు!

"న్యాయవాదిగా నా పాతికేళ్ల సర్వీసులో ఇంతటి దారుణమైన కేసు చూడలేదు. తప్పుడు డాక్యుమెంట్లతో ఫోర్జరీ సంతకాలతో అగ్రిమెంట్లు సృష్టించి కాదంబరి జెత్వానీపై తప్పుడు కేసు పెట్టారు. సినిమా స్టోరీని తలపించేలా కథనాలు అల్లి... పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశమున్న సెక్షన్లు జోడించారు. తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేసినట్లు ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన ఐపీఎస్ అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు కఠిన చర్యలు తీసుకోవాలి. తప్పుడు కేసును రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ కూడా దాఖలు చేశాం. ఆమె నుంచి సీజ్ చేసిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, 18 బ్యాంకు ఖాతాలకు విముక్తి కలిగించాలని కూడా కోరాం. ముంబైలో జెత్వానీకి చెందిన 6 కోట్ల ఖరీదైన ఇంటి పత్రాలను కూడా సీజ్ చేశారు. వీటన్నింటి నుంచి బాధితులకు ఉపశమనం కల్పించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశాం"

- నర్రా శ్రీనివాస్ (కాదంబరి తరపు న్యాయవాది)

లోకం తీరు



తిరుమలకు మళ్లీ 'నందిని నెయ్యి'

తిరుమల/బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులు ఎంతో ప్రీతితో స్వీకరించే లడ్డూ ప్రసాదానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు టీటీడీ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. దీన్ని మరింత రుచికరంగా అందించడం కోసం పూర్వం లడ్డూల తయారీకి వాడిన నందిని నెయ్యిని తిరిగి వినియోగించాలని నిర్ణయించింది. టీటీడీ అధికారులు ఇటీవల కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్)తో సంప్రదింపులు జరిపారు. 2024-25కి గాను కేజీ రూ.470 చొప్పున టీటీడీకి 350 టన్నుల నెయ్యిని సరఫరా చేసేందుకు టెండరు ఖరారైంది. ఈ మేరకు రెండు ట్యాంకర్లలో 20వేల కేజీల నెయ్యి మూడు రోజుల క్రితం తిరుమలకు చేరుకుంది. ఈ నెయ్యి నమూనాలను పరీక్ష కోసం టీటీడీ ల్యాబ్‌కు పంపింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీటీడీ ఈవోగా శ్యామలరావును సీఎం చంద్రబాబు నియమించారు. లడ్డూప్రసాదం నాణ్యత పెంచడంపై ఈవో ప్రత్యేక దృష్టి సారించారు. లడ్డూ నాణ్యత, సువాసన లేకపోవడానికి ప్రధాన కారణం నెయ్యిలో నాణ్యత లేకపోవడమేనని గుర్తించారు. దీంతో నందిని నెయ్యి సరఫరాపై ఆ సంస్థతో సంప్రదింపులు జరిపారు. ప్రస్తుతం లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీకి టీటీడీ రోజుకు 10వేల కేజీల నెయ్యి వినియోగిస్తోంది. ఈ స్థాయిలో సరఫరా చేసే సామర్థ్యం నందిని బ్రాండ్‌కు ఉందని టీటీడీ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం యూపీకి చెందిన ఆల్ఫా అనే సంస్థ కూడా ఇదే ధరకు టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోంది. ఇక, తిరుమల శ్రీవారి ప్రసాదం తయారీ కోసం నందిని నెయ్యిని తీసుకువెళుతున్న ట్యాంకరుకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం 2024-25 సంవత్సరానికి గాను తిరుమల ఆలయానికి 350 టన్నుల నెయ్యి సరఫరా చేసేందుకు టెండరు ఖరారైంది. నందిని ఉత్పత్తుల నుంచి తిరుమలకు కొన్నేళ్లుగా అగ్ మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యిని సరఫరా చేసేవా రు. తర్వాత టెండర్ల ధరలో తేడాలతో పాటు గత టీటీడీ బోర్డు నిర్ణయాల కారణంగా సరఫరాను నిలిపివేశారు.

అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ రెడీ!

» నేడు విశాఖకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పూర్తి అణుసామర్థ్యంతో బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ కలిగిన జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ భారత నౌకాదళంలో చేరేందుకు సిద్ధమైంది. ఐఎన్ఎస్ అరిహంత్ డిజైన్, స్ఫూర్తితో నిర్మిస్తున్న ఈ న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను భారత నౌకాదళం చేపట్టింది. పదిహేనేళ్ల క్రితం భారత్ సొంతంగా అణు జలాంతర్గాముల నిర్మాణాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. విశాఖలోని నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో అత్యంత రహస్యంగా వీటిని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో మొదటిదైన ఐఎన్ఎస్ అరిహంత్ అధికారికంగా 2018 నుంచి నేవీకి సేవలందిస్తోంది. ఈ సిరీస్‌లో రెండోది అర్ధిమాన్. దీని పేరును అరిఘాత్‌గా మార్చారు. ప్రస్తుతం దీని నిర్మాణం కూడా పూర్తయింది. ఇప్పటికే అనేకసార్లు సముద్రంలో పరీక్షలు నిర్వహించి కమిషనింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబరులో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఐఎన్ఎస్ అరిఘాత్‌ను జాతికి అంకితమివ్వాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం విశాఖపట్నం వస్తున్నారని సమాచారం. ఆయన ఢిల్లీలో ఉదయం 10 గంటలకు బయల్దేరి 12.20 గంటలకు విశాఖలోని నేవీ ఎయిర్‌పోర్టు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడి నుంచి నేవల్ బేస్‌కు వెళ్లి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఇక్కడ నుంచి బయల్దేరి కేరళలోని తిరువనంతపురానికి వెళ్తారు. ఆయన ఏ కార్యక్రమాల్లో పాల్గొంటారనే విషయాలు నేవీ వర్గాలు వెల్లడించలేదు.

అరిఘాత్ ప్రత్యేకతలు

అరిహంత్ క్లాస్ న్యూక్లియర్ సబ్‌మెరైన్లలో అరిఘాత్ రెండోది. అరిహంత్‌లాగే ఇందులో అరిఘాత్‌లో కూడా 750 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించగలిగే కె-15 క్షిపణులు ఉంటాయి. కాకపోతే దీనికి మరిన్ని క్షిపణులను తీసుకువెళ్లే సామర్థ్యాన్ని జోడించారు. దీని పొడవు 111.6 మీటర్లు. వెడల్పు 11 మీటర్లు. డ్రాఫ్ట్ (లోతు) 9.5 మీటర్లు. సముద్ర ఉపరితలంపై గంటకు 12 నుంచి 15 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. అదే సముద్రం లోపల అయితే గంటకు 24 నాటికల్ మైళ్ల వేగంతో వెళుతుంది. ఇందులో ఉపయోగించే క్షిపణులను డీఆర్‌డీవో రూపొందించింది.

డీఎంకే ఎంపీకి 908 కోట్ల ఫైన్!

» ఫెమా కింద ఈడీ చర్యలు



చెన్నై, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఎంపీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) షాకిచ్చింది. అధికార డీఎంకేకు చెందిన ఈ లోక్‌సభ సభ్యుడికి రూ.908 కోట్ల భారీ జరిమానా విధించింది. కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుతం అరక్కోణం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్.జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులకు రూ.908 కోట్ల జరిమానా విధిస్తున్నట్లు ఈడీ బుధవారం ప్రకటించింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా) నిబంధనలకు విరుద్ధంగా 2017లో సింగపూర్ కంపెనీలో రూ.42 కోట్ల షేర్లను కలిగివుండడం, శ్రీలంకకు చెందిన సంస్థల్లో పెట్టుబడులు తదితరాలకు సంబంధించి జగద్రక్షకన్ కుటుంబీకులపై వచ్చిన ఫిర్యాదులమేరకు ఈ చర్యలకు ఉపక్రమించింది.



హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.గోపాలకృష్ణారావులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఇద్దరు ప్రమాణం

జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ గోపాలకృష్ణారావుతో ప్రమాణ స్వీకారం చేయించిన సీజే

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు బుధవారం ప్రమాణం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వారితో ప్రమాణం చేయించారు. అంతకుముందు వారి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా ఉన్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావును శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం ఈ నెల 13న కేంద్రానికి సిఫారసు చేసింది. వీరి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో సీజే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ రాకేష్‌కుమార్, జస్టిస్ ఎం.గంగారావుతో పాటు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, హైకోర్టు రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని అదనపు ఈవోకు అందజేస్తున్న దాతలు

టీటీడీకి ఆర్ఎస్ బ్రదర్స్ రూ.3.70 కోట్ల విరాళం

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): టీటీడీకి బుధవారం రూ.3.70 కోట్ల భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ ఎండీలు పొట్టి వెంకటేశ్వర్లు, రాజమౌళి, ప్రసాద రావు, మాలతి లక్ష్మీకుమారి ఈ విరాళపు చెక్కులను శ్రీవారి ఆలయంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

అక్టోబరు 3 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 28 : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో దసరా మహోత్సవాలు అక్టోబర్ 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు ఈవో రామరావు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3వ తేదీన బాలా త్రిపుర సుందరీ దేవి, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరీ దేవి, 7న మహాచండీ, 8న మహాలక్ష్మి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధని, 12న రాజరాజేశ్వరిదేవిగా కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 9వ తేదీన మూలా నక్షత్రం రోజు సరస్వతీ దేవి అలంకారం సందర్భంగా అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

సురక్షిత తాగునీటి పథకాలను పూర్తి చేయండి: సీఎస్‌లకు ప్రధాని ఆదేశం

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ సురక్షితమయిన తాగునీరు అందించేందుకు నిర్దేశించిన పథకాలు, ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రధాని మోదీ ఆదేశించారు. తాగునీరు, జల్ జీవన్ మిషన్, పారిశుద్ధ్యం, జాతీయ రహదార్లు, గ్యాస్ పైపులైన్ల నిర్మాణం, రైల్వే ప్రాజెక్టులు, అమృత్-2.0 వంటి ప్రగతి అంశాలపై బుధవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ప్రధాని వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణ ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తి చేయాలని, పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టులు, నూతన పైపులైన్ నిర్మాణ ప్రాజెక్టులను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాని సీఎస్‌లను ఆదేశించారు. అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ 2.0(అమృత్ 2.0) కింద పట్టణాల్లోని ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్రాజెక్టులు, తాగునీటి వనరుల చుట్టూ పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేపట్టాలి

- సీఎఫ్‌డీ జనరల్ సెక్రటరీ నిమ్మగడ్డ

అమరావతి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితాల తనిఖీ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఫోరం జనరల్ సెక్రటరీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి, ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిమ్మగడ్డ రమేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2026లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో ఓటర్ల జాబితాలను ప్రచురించాలని, గతంలో ఓటర్ల జాబితాల తయారీ లోపభూయిష్టంగా జరిగింది.. అలాంటి వాటిని పరిశీలించి, ఇప్పుడైనా సరిజేయాలని సీఈవోను కోరినట్టు చెప్పారు.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఉత్తరకోస్తాలో రేపు, ఎల్లుండి భారీ వర్షాలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక

విశాఖపట్నం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య బంగాళాఖాతం పరిసరాల్లో బుధవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఉత్తర, దానికి అనుకుని మధ్య బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత రెండు రోజుల్లో అది పశ్చిమ వాయువ్యంగా పయనించి దక్షిణ ఒడిశా, ఉత్తరకోస్తా వైపు రానుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ ప్రభావంతో ఉత్తరకోస్తాలో అనేకచోట్ల, రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో పలుచోట్ల వర్షాలు, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈనెల 30, 31 తేదీల్లో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు పలుచోట్ల భారీవర్షాలు కురుస్తాయని, వచ్చే నెల ఒకటో తేదీ వరకు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వచ్చే నెల ఒకటో తేదీ వరకూ ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, కోస్తాలో అనేకచోట్ల బుధవారం ఎండ తీవ్రత , ఉక్కపోత కొనసాగాయి. అటు ఉపరితల ఆవర్తనం, ఇటు ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొని ఉత్తరకోస్తాలో పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. జంగమహేశ్వరపురంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రైతుల నుంచి కొనుగోలు చేస్తే.. సెస్ తొలగిస్తాం!

- పత్తి అంతా సీసీఐ సేకరించేలా కేంద్రానికి లేఖ
- మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత

అమరావతి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండించిన పత్తి అంతా సీసీఐ కొనుగోలు చేసేలా కేంద్రానికి లేఖ రాస్తామని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జౌళి, చేనేత శాఖ మంత్రి సవిత చెప్పారు. రాష్ట్రంలో రైతుల నుంచి పత్తి మొత్తం కొనుగోలు చేస్తే.. స్పిన్నింగ్, జిన్నింగ్ వ్యాపారులకు మార్కెట్ సెస్ తొలగిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం అమరావతి సచివాలయంలో పత్తి కొనుగోళ్లు, పత్తి మిల్లుల సమస్యలపై సీసీఐ, మిల్లర్లు, జౌళి, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత సమీక్ష నిర్వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దేశంలో 7% స్పిన్నింగ్, జిన్నింగ్ సామర్థ్యం ఉన్న ఏపీలో 50% పత్తి దిగుబడి, కొనుగోళ్లు తగ్గడం ఆవేదనకు గురి చేస్తోందని, పత్తి కొనుగోలుపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి రైతులకు మేలు జరిగే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పటిష్టంగా చేపట్టి, దిగుబడి అంచనాల్లో హెచ్చుతగ్గులు సరిచేయాలన్నారు. విదేశాల్లో మన కంటే రెండింతల దిగుబడి వచ్చే మేలు రకాల పత్తిని పండిస్తున్నారని, మన రైతులు కూడా అలాంటి రకాలు సాగు చేసేందుకు మేలు రకం విత్తనాల లభ్యత ఉండేలా పత్తి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీకి జ్వరమొచ్చింది

- వందలాది మంది విద్యార్థులకు జ్వరాలు
- ఇప్పటికే అనారోగ్యంతో 300 మంది ఇంటిబాట
- మూడు రోజులుగా 200 మందికి ఆస్పత్రిలో వైద్యసేవలు
- స్పందించిన మంత్రి లోకేశ్.. పరిస్థితి చక్కదిద్దాలని ఆదేశాలు



ట్రిపుల్ ఐటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

నూజివీడు, ఆగస్టు 28: ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్ ఐటీకి జ్వరమొచ్చింది. ఈ క్యాంపస్‌లోనే నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దాదాపు వారం రోజులుగా క్యాంపస్‌లోని విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నా అధికారులు మాత్రం వీటిని సాధారణ జ్వరాలేనని పట్టించుకోలేదు. దీంతో బుధవారం పెద్దసంఖ్యలో విద్యార్థులు జ్వరాలు, వాంతులు, కడుపు నొప్పి బారిన పడ్డారు. ఇప్పటికే దాదాపు 300 మంది అనారోగ్యానికి గురైన విద్యార్థులు ఇంటిబాట పట్టారు. మూడు రోజులుగా దాదాపు 200 మందికి పైగా విద్యార్థులు క్యాంపస్‌లోని ఆస్పత్రిలో ఓపీ రోగులుగా వైద్యసేవలు పొందుతున్నారు. ఇన్ పేషెంట్లుగా 15 మంది వరకు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది బుధవారం నూజివీడు క్యాంపస్‌ను సందర్శించి అక్కడి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం విషయంలోనూ తక్షణ చర్యలు చేపట్టాలని, ట్రిపుల్ ఐటీ ఏవో బి.లక్ష్మణరావుకు సూచించారు. క్యాంపస్‌లోని మెస్‌ల్లో విద్యార్థులకు అందుతున్న భోజనం నాసిరకంగా ఉంటుందనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. క్యాంపస్‌లో నిర్వహిస్తున్న దుకాణాల్లో విద్యార్థులకు బయట నుంచి అనేక రకాల ఆహార పదార్థాలు అందుతున్నాయని, మద్యం కూడా లోపలకు వస్తోందని చానాళ్లుగా ప్రచారం జరుగుతున్నా క్యాంపస్ అధికారులు దృష్టి పెట్టలేదనే ఆరోపణ ఉంది. క్యాంపస్ డైరెక్టర్ పూర్తికాలం ఇక్కడ ఉండటం లేదని, ఓడీ పేరుతో నెలలో ఎక్కువ రోజులు బయటే గడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారనే సమాచారం అందుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. విద్యార్థులకు తక్షణమే వైద్య సదుపాయం అందించి, అక్కడ పరిస్థితిని చక్కదిద్దాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

మెస్‌లో నాణ్యత లేని భోజనం అన్నా క్యాంటీన్ భోజనమే బెటర్

- మంత్రి పార్థసారథికి ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఫిర్యాదు



విద్యార్థులకు మెస్‌ల నుంచి ఇస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, ఆగస్టు 28: నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్‌లలో భోజనం కన్నా అన్న క్యాంటీన్ భోజనం ఎన్నో రెట్లు రుచికరం, ఆరోగ్యకరమని ఇక్కడి విద్యార్థులు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి పార్థసారథికి మొరపెట్టుకున్నారు. విద్యార్థులు అనారోగ్యంపాలైన విషయం బయటకు రావడంతో బుధవారం రాత్రి మంత్రి పార్థసారథి ట్రిపుల్ ఐటీని సందర్శించి మెస్‌లను, ట్రిపుల్ ఐటీ ప్రాంగణాన్ని, ఆసుపత్రిని, వంట గదిని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మంత్రి ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. తమకు మెస్‌ల్లో అందిస్తున్న భోజనం నాణ్యత లేదని, కూరలు వాసన వస్తున్నాయని, వాటిని తిన్న తాము అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోయారు. పారిశుధ్యం లోపించిందని క్యాంపస్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. మెస్‌లో నిల్వచేసిన సరుకుల్లో పురుగుపట్టిన వాటిని విద్యార్థులు, మంత్రి దృష్టికి తెచ్చారు. వాటితోనే తమకు వండి పెడుతున్నారని ఆరోపించారు. ట్రిపుల్ ఐటీపై ఇక నుంచి ప్రత్యేక దృష్టి సారించి ఇబ్బంది లేకుండా చూస్తానని మంత్రి విద్యార్థులకు హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ట్రిపుల్ ఐటీని తనిఖీచేసి పరిస్థితిని పరిశీలించారని, వారి నివేదికను అనుసరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తప్పవు

- కూటమి అధికారంలోకి వచ్చాక అందరికీ మాట్లాడే స్వేచ్ఛ
- మీడియా, ప్రజాప్రతినిధులకు, పులివెందుల ఎమ్మెల్యేకు కూడా
- ఆరోగ్యశ్రీని మరింత మెరుగ్గా అమలు చేస్తాం
- హైడ్రా తెలంగాణ వ్యవహారం... అమరావతిలో అక్రమణలపై అధికారులే చర్యలు తీసుకుంటారు: మంత్రి లోకేశ్



మంగళగిరి సిటీ, ఆగస్టు 28: చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులపై చర్యలు తప్పవని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ఉత్తర వీధి ముఖద్వారాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అందరికీ మాట్లాడే స్వేచ్ఛ లభించింది. మీడియా, ప్రజాప్రతినిధులకు, పులివెందుల ఎమ్మెల్యేకు కూడా స్వేచ్ఛ వచ్చింది. ఇసుక విధానాన్ని మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యశ్రీని రద్దు చేస్తారంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఆరోగ్యశ్రీని, కేంద్రం చేపడుతున్న వైద్య కార్యక్రమాలతో అనుసంధానం చేసి మరింత బలోపేతం చేస్తాం. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలను సమీక్షించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం. వినాయక విగ్రహాల ఏర్పాటుకు గతంలో ఆరేడు గురి వద్దకు వెళ్లి అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. పందిళ్ల అనుమతుల కోసం 2014-19 మధ్య అవలంభించిన సింగిల్ విండో విధానాన్ని పునరుద్ధరిస్తాం. మంగళగిరిలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ల విస్తరణపై కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని తదుపరి చర్యలు చేపడతాం. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విజబుల్, ఇన్‌విజబుల్ పోలిసింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాం. మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు అందిస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం. హైడ్రా తెలంగాణకు సంబంధించిన అంశం. రాజధాని అమరావతిలో ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే అధికారులే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారు' అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

ప్రజాదర్బార్‌కు 1వరకు సెలవు

తాడేపల్లి, ఆగస్టు 28: మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమం ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించడం లేదని, తదుపరి తేదీలు ఒక రోజు ముందుగా తెలియజేస్తామని లోకేశ్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బలూచ్ హెచ్చరిక!

పాకిస్థాన్‌లో వేర్పాటువాద సంస్థ బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌వో)కు చెందిన సాయుధులు ఇటీవల మరోమారు తమ ప్రతాపం చూపారు. బలూచిస్థాన్ ప్రావిన్సులోని పలుప్రాంతాల్లో పోలీసుస్టేషన్లు, రైల్వేస్టేషన్లు, వాహనాలపై వారు కాల్పులు జరిపారు. పంజాబ్‌నుంచి వస్తున్న ఓ బస్సును ఆపి పాతికమందిని కాల్చివేయడంతో ఆరంభమైన ఈ మారణకాండ కొన్ని గంటలపాటు నిరవధికంగా సాగింది. 2006లో పాకిస్థాన్ సైన్యం కాల్చిచంపిన బలూచిస్థాన్ నాయకుడు నవాబ్ అక్బర్‌ఖాన్ బుగ్టీ వర్ధంతి సందర్భంగా ఆ వేర్పాటువాద సంస్థ ఈ హననానికి పాల్పడింది. ప్రత్యేక బలూచిస్థాన్ దేశం కోసం దశాబ్దాలుగా పోరాటం జరుగుతున్న ఈ ప్రాంతంలో వేర్పాటువాదులు అడపాదడపా హింసకు దిగడం అనాదిగా ఉన్నదే. అయితే, ఒకేమారు అనేక ప్రాంతాల్లో వేర్వేరు లక్ష్యాలపై ఇంతటి విస్తృతస్థాయిలో దాడులు జరగడం, మరణాలు అధికంగా ఉండటం గతంలో లేనిది.

లారీల దహనం, రోడ్లు రైల్వేలైన్ల పేల్చివేత, పోలీసులు, పంజాబ్ వలస కార్మికులు లక్ష్యంగా సాగిన ఈ హత్యాకాండలో ఓ వందమంది మరణించారని అంచనా. పంజాబ్ ప్రావిన్సు సరిహద్దులకు చేరువగా వేర్పాటువాదులు ఈ ఘోరానికి పాల్పడటం పాక్ పాలకులకు ఓ హెచ్చరిక. బీఎల్‌వో తన సాయుధ, సాంకేతిక సామర్థ్యాన్ని బాగా బలోపేతం చేసుకున్నదని పాక్ విశ్లేషకుల అభిప్రాయం. దీనికితోడు, ఇంటలిజెన్స్ వైఫల్యం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బుగ్టీ వర్ధంతి సందర్భంగా ఏటా బీఎల్‌వో దాడులు జరుపుతూ ఉంటుంది. ఇంతటి స్థాయిలో కాకున్నా, ఈ మారు కూడా ఆ సంస్థ విరుచుకుపడుతుందన్న స్పృహ ప్రభుత్వ విభాగాలకు ఉండాలి. వందలమంది పోలీసులు, సైనికబలగాలు ఉన్నప్పటికీ, ఈ వేర్పాటువాద సంస్థ ఎంతో సునాయాసంగా, సమన్వయంతో గంటలపాటు దాడులు కొనసాగించగలగడం పాలకుల వైఫల్యమే.

కొద్దివారాలుగా బలూచిస్థాన్‌లో భారీ ప్రదర్శనలు, ఉద్యమాలు ఉధృతంగా జరుగుతున్నాయి. వనరుల దోపిడీ, మానవహక్కుల ఉల్లంఘనలు, అపహరింతలు, ఊచకోతలు, మౌలికసదుపాయాల కొరత ఇత్యాది అంశాలపై ఓడరేవుపట్టణమైన గ్వదార్‌లో బీవైసీ సంస్థ సమావేశానికి పిలుపునిస్తే అక్కడకు చేరేలోగానే నిరసనకారులమీద సైన్యం కాల్పులు జరిపింది. బలూచ్ ప్రజల నినాదాలు చేసినా, నిరసనలు నిర్వహించినా పోలీసులు విరుచుకుపడతారు. అరెస్టుచేయడం, చిత్రహింసలు పెట్టిచంపివేయడం, మాయంచేయడం వంటి విధానాలతో వందలమంది బలూచ్ నాయకులు కనిపించకుండాపోయారు. తమకు తలనొప్పిగా ఉన్న బలూచిస్థాన్ వనరులను యథేచ్ఛగా దోచుకోవడానికి దానిని చైనాకు అప్పగించింది పాక్ ప్రభుత్వం. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్)లో భాగంగా అక్కడ భారీ తవ్వకాలు, ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోంది. కానీ, వీటివల్ల స్థానికులకు వీసమెత్తు ప్రయోజనం లేకపోగా, స్థానికేతరుల ఆక్రమణలు అధికమైనాయి. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నవారిపై పోలీసు అణచివేత హెచ్చుతున్న కొద్దీ, ఉగ్రవాదసంస్థలు బలపడుతున్నాయి.

సైనికబలంతో, ఊచకోతలూ అణచివేతలతో బలూచ్ ప్రజలను నియంత్రించలేమని పాక్‌పాలకులకు అర్థంకావాలి. వారి స్వాతంత్ర్య కాంక్షకు చారిత్రక కారణాలున్నాయని, తాము చేసిన, చేస్తున్న ద్రోహాలు వారిని మరింత రెచ్చగొడుతున్నాయని గ్రహించాలి. బలూచ్ వేర్పాటువాద శక్తులకు ప్రజల అండదండలు దండిగా ఉండటానికి, యువతరం సాయుధులు కావడానికీ పాక్‌పాలకులు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలు కారణం. అత్యంత అరుదైన, విలువైన ఖనిజ సంపద దండిగా ఉన్న ఈ ప్రాంతాన్ని దోచుకోవడమే తప్ప, ప్రజాశ్రేయస్సును పట్టించుకున్నది లేదు. దారిద్ర్యం, ఉపాధిలేమి, దుర్భర జీవితాలు స్థానికులను తిరుగుబాటువైపు నడిపిస్తున్నాయి. పాక్ పాలకులు బలూచిస్థాన్‌ను శత్రువుగా చూశారు, ఈ ప్రాంతం నాయకులు, గత ముఖ్యమంత్రుల సలహాలను పెడచెవినపెట్టారు, తమ నిలకడలేని విధానాలతో దానిని మరింత భ్రష్టుపట్టించారు. పాక్‌పాలకుల వైఖరిలో మార్పురావాలి. వేర్పాటువాదుల విధ్వంసానికి ప్రతిగా హింసకు పాల్పడటం, ఉగ్రవాదాన్ని నిర్మూలించేపేరిట ప్రజలను మరింత అణచివేయడమనే విషవలయం నుంచి బయటపడాలి. బలూచ్ ప్రజల వాదనలను, బాధలను వినాలి. వారి సంక్షేమం కోసం విశేషమైన కృషి జరగాలి.

సంపదను పెంచితే, పేదరికమూ పెరుగుతుంది!

'సంపద పెంచటం ఎలా?' అనే పేరుతో, జయప్రకాష్ నారాయణ్ (జెపి) రాసిన వ్యాసంలో (ఆగస్టు 18) ఆయన సూచించిన మార్గాలన్నీ, పేదరికాన్ని పెంచేవేగానీ, తగ్గించేవి ఎలా కావో చెప్పడానికే ఈ వ్యాసం. నిజానికి, జెపి చేసిన సూచనలు కొత్తవేమీ కాదు. 1991లో, పీవీ నరసింహారావు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూచించిన సంస్కరణలే, ఇప్పుడు ఈయన చెపుతున్నవి. పీవీని సంస్కరణల పితామహుడు అంటారు గానీ, అంతకంటే పది సంవత్సరాల ముందే, బ్రిటన్‌లో సంస్కరణలను ప్రవేశపెట్టిన మాత మార్గరేట్ థాచర్. అదే సమయంలో అమెరికాలో ప్రవేశపెట్టిన పిత రొనాల్డ్ రీగన్.

'పెట్టుబడి' అనేది ఏ నిబంధనలనూ పాటించదు. దానికి నిర్నిబంధ స్వేచ్ఛ కావాలి. ఆ స్వేచ్ఛ కోసం ఉద్దేశించినవే 'ఆర్థిక సంస్కరణలు'. ఇప్పుడు జెపి గారు చేసిన కొన్ని సూచనలను చూద్దాం.

(1) భూమికి సంబంధించీ, కార్మికులకు సంబంధించీ వున్న 'చట్టాల సంకెళ్లను తొలగించాలి' అని ఒక సూచన. దీని అర్థం, చిన్న చిన్న భూముల యజమానుల భూముల్ని గానీ, గిరిజన ప్రాంతాల్లోని భూముల్ని గానీ, ఎటువంటి ఆటంకాలూ (సంకెళ్ళు) లేకుండా, వారి సమ్మతి లేకుండానే, స్వాధీనం చేసుకుని, పెద్ద పెద్ద కంపెనీలు చవగ్గా కొనుక్కోవడానికి వీలునిచ్చేలా చట్టాల్ని సవరించాలి అని! అలాగే, కార్మికులు, జీతాల పెంపుకోసమో, పనిగంటల తగ్గింపు కోసమో, ఉద్యోగ భద్రత కోసమో, మెరుగైన పని పరిస్థితులకోసమో, సమ్మెలు చెయ్యడానికి వీలునివ్వని విధంగా కార్మిక చట్టాల్ని సవరించాలి అని!

(2) 'ఉత్పాదకతనీ, సంపాదనా సామర్థ్యాన్నీ పెంచేందుకు విద్యారంగంలో మార్పులు' తేవాలి అని ఇంకో సూచన. ఆర్థిక సంస్కర్తల దృష్టిలో, ఉత్పాదకత అంటే, వీలైనంత తక్కువ సమయంలో, అతి తక్కువ మందితో, ఎక్కువ ఉత్పత్తికి వీలునిచ్చే టెక్నాలజీని వాడడం. దానివల్ల, ఆ టెక్నాలజీని వాడే పరిశ్రమల యజమానులకు లాభాలు పెరుగుతాయి గానీ, లక్షల సంఖ్యలో నిరుద్యోగ జనాభా తయారవుతారు.



> నిజానికి, సరుకుల రూపంలోనూ, 'సేవల' రూపంలోనూ వుండే దేశ సంపదని సృష్టించేది శ్రామిక జనాలే గానీ, శతకోటీశ్వరులో, కోటీశ్వరులో కాదు. వీళ్ళ చేతుల్లో, సంపద సృష్టికి కావలిసిన ఉత్పత్తి సాధనాలు స్వంత ఆస్తిగా వున్నాయి కాబట్టి, శ్రామికులు సృష్టించిన సంపదకి యజమానులు వీళ్ళే అయ్యారు. పేదరికానికేమో శ్రామిక జనాలు యజమానులు! ఎంత తలకిందులుగా వుంది ప్రపంచం! దీన్ని తిన్నగా తిప్పినప్పుడే పేదరికం అనేది ఈ భూమండలం నించీ మాయమవుతుంది. అంతేగానీ, సంపదని పెంచుకుంటూ పోవడం వల్ల కాదు.

(3) 'ఇళ్ల నిర్మాణం, వాణిజ్యం, పరిశ్రమలు వంటివి ప్రైవేటు రంగం చూసుకోవాలి' అని మరో సూచన. ప్రైవేటు రంగం అంటే, అది నూటికి నూరుపాళ్ళూ లాభాల కోసమే వెంపర్లాడే రంగం. పని గంటలూ, పని వేగమూ, పనిలో వెసులుబాటూ, ప్రమాదాల నివారణకు ఏర్పాట్లూ, జీతాలూ, ఉద్యోగ భద్రతా వంటి విషయాలలో కార్మికుల పట్ల పరమ నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించే ఘనచరిత్ర గలది, ఈ ప్రైవేటు రంగం! ఐక్యరాజ్యసమితి వంటి మర్యాదస్తుల కూటమికి చెందిన ప్రపంచ కార్మిక సంస్థా, ఇంకా అనేక దేశాలలోని కార్మిక సంఘాలూ వెలువరించిన నివేదికలు చూస్తే ప్రైవేటు రంగం బండారం తెలిసిపోతుంది.

(4) కాంట్రాక్ట్ వ్యవసాయాన్నీ, ఇతర పద్ధతులనూ ప్రోత్సహించటం ద్వారా 'వ్యవసాయాన్ని ఆధునీకరించాల'ని జెపి ఇంకో సూచన. కాంట్రాక్ట్ వ్యవసాయం ఉద్దేశం, భారీ పెట్టుబడులతో నడిచే కంపెనీలతో అసమాన షరతులతో ఒప్పందాలు చేసుకుని, ఆ కంపెనీల దయాదాక్షిణ్యాల మీద రైతులు ఆధారపడేలా చెయ్యడం. జెపి సూచించినట్టు, 'వ్యవసాయాన్ని ఆధునికీకరించడం' అంటే, యంత్రాల వినియోగం తప్పనిసరి చెయ్యడం. దానివల్ల వ్యవసాయం మీద ఆధారపడిన కార్మికులకు పనులు లేకుండా పోతాయి. కాంట్రాక్టు వ్యవసాయం వల్ల మేలు కంటే నష్టాలే ఎక్కువని తేల్చిన సర్వేల కోసం, వ్యవసాయ ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన పత్రికల్నీ, పుస్తకాల్నీ, పర్యావరణవేత్తల రచనలనూ చూడవచ్చును. ఈనాటి రచనల్లోనే కాదు, 150 ఏళ్ళనాటి వ్యవసాయ శాస్త్రవేత్తల, మార్క్సు వంటి సామాజిక శాస్త్రవేత్తల రచనల్లోనూ చూడవచ్చును. ఉదాహరణకి, శ్రామికుల పట్ల సానుభూతితోనూ, 'నేల' పట్ల ప్రేమతోనూ, 1867 నాటి 'కాపిటల్'లో మార్క్సు ఇలా అంటాడు: "పెట్టుబడిదారీ వ్యవసాయంలో సమస్త ప్రగతీ, ఒక రకమైన కళలో ప్రగతే! అది శ్రామికుణ్ణే కాక, భూసారాన్ని కూడా దోచుకునే కళలో ప్రగతి; భూసారాన్ని ఒక నిర్ణీత కాలం పాటు పెంచడంలో సాధించే సమస్త ప్రగతీ, ఆ సారానికి గల శాశ్వత మూలాధారాలను నాశనం చేయటంలో ప్రగతే. ఒక దేశం, ఉదాహరణకు అమెరికా లాగా, వ్యవసాయం ఆధునిక పరిశ్రమల పునాదిపై అభివృద్ధి చెందటం ప్రారంభించిన కొద్దీ, ఈ విధ్వంసన క్రమం మరింత త్వరితగతితో సాగుతుంది. కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి, సమస్త సంపదకూ మూలాధారాలను, అంటే, నేలనీ, శ్రామికుల్నీ పీల్చిపిప్పి చేయడం ద్వారా మాత్రమే, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధిపరుస్తుంది."

(5) జెపి తన వ్యాసంలోనే ఒక చోట, 'ఇప్పటికీ చాలామంది జీవనప్రమాణాలని నిర్ణయించటంలో తలసరి ఆదాయం అత్యంత కీలకమైనది' అన్నారు. కానీ తలసరి ఆదాయం అనే కొలత ఎంత మోసపూరితమైనదో ఆయన గ్రహించినట్టు లేదు. దేశంలో కొత్తగా తయారైన సంపదని, దేశ జనాభాతో భాగిస్తే వచ్చేదే తలసరి ఆదాయం. ఉదాహరణకి, కిందటేడాది లెక్కల ప్రకారం, భారతదేశంలో ప్రజలకి తలసరి ఆదాయం ఏడాదికి 1 లక్షా, 72 వేలు. దీని ప్రకారం, ఒక కార్పొరేట్ వ్యవసాయ పరిశ్రమ యజమాని ఆదాయమూ, అదే పరిశ్రమలో పనిచేసే వ్యవసాయ కార్మికుడి ఆదాయమూ ఒకటే అన్నమాట! ఎంత వింత!

(6) "అధిక ఆర్థిక అభివృద్ధి" ద్వారానే పేదరికం తొలగుతుందని జెపి భావన! 1991 తర్వాత, దిగువనున్న 50 శాతం జనాభా ఆదాయం 4 రెట్లు పెరిగిందంటున్నారు ఆయన! కానీ, శతకోటీశ్వర్ల గురించిన వివరాలిచ్చే నివేదికల ప్రకారం, దేశ సంపదలో 60 శాతం, 5 శాతం మంది కోటీశ్వరుల చేతిలో వుందనీ, అడుగునున్న 50 శాతం జనాభా చేతిలో, 3 శాతం సంపద మాత్రమే వుందనీ చెపుతున్నాయి. నిజానికి, సరుకుల రూపంలోనూ, 'సేవల' రూపంలోనూ వుండే దేశ సంపదని సృష్టించేది శ్రామిక జనాలే గానీ, శతకోటీశ్వరులో, కోటీశ్వరులో కాదు. వీళ్ళ చేతుల్లో, సంపద సృష్టికి కావలిసిన ఉత్పత్తి సాధనాలు స్వంత ఆస్తిగా వున్నాయి కాబట్టి, శ్రామికులు సృష్టించిన సంపదకి యజమానులు వీళ్ళే అయ్యారు. పేదరికానికేమో శ్రామిక జనాలు యజమానులు! ఎంత తలకిందులుగా వుంది ప్రపంచం! దీన్ని తిన్నగా తిప్పినప్పుడే పేదరికం అనేది ఈ భూమండలం నించీ మాయమవుతుంది. అంతేగానీ, సంపదని పెంచుకుంటూ పోవడం వల్ల కాదు.

దీన్నిబట్టి అర్థం చేసుకోవలిసింది ఏమిటంటే, ఉత్పత్తి సాధనాలు, ఏ శ్రమా చెయ్యని యజమానుల చేతుల్లో వున్నంత కాలమూ, సంపదని ఎంత పెంచితే, పేదరికమూ అంత పెరుగుతుంది!

• నౌరోజీ

కూలుస్తున్నారు సరే, ఏ విలువను నిలబెడతారు?



■ కె. శ్రీనివాస్

సందర్భం

మహారణ్యం కూడా నిశ్శబ్దంగా, అదృశ్యంగా ఎదుగుతుంది, కానీ, కూలిపోయేటప్పుడు ఒంటరి చెట్టు కూడా పెద్ద చప్పుడు చేస్తుంది... ఎవరిదో ఏనాటిదో ఒక సుభాషితం ఇది. దీని ఉదాత్త అర్థమేదైనా, నిర్మాణం మితభాషి అని, విధ్వంసంలో ఒక హడావిడి ఉన్నదని మాత్రం తెలుస్తోంది.

కూలడమైనా, కూల్చడమైనా ఒక ఘటన.
కనిపించే, వినిపించే ఒక చర్య
కూల్చివేత ఒక దృశ్యం.

రాజకీయాలకు దృశ్యాలు చాలా అవసరం. ఈ సత్యం యోగి ఆదిత్యనాథ్‌కు తెలుసు. బుల్‌డోజర్‌ను చక్రాలు తొడిగిన 'తక్షణ' న్యాయదేవతగా ఆయన ముస్తాబు చేశాడు. దానికింద నలిగినవాళ్లకు అది రాకాసి పార కావచ్చును కానీ, ప్రేక్షక మాత్రులకు మాత్రం అది పనిచేస్తూ కనిపించే ప్రభుత్వం. జనం తరఫున తానే లించింగ్ చేసే అధికారిక యంత్రం.

దశాబ్దం కిందట కేసీఆర్ కూడా ఎన్ కన్వెన్షన్ దగ్గర హడావిడి చేశారు. అయ్యప్ప సొసైటీ ఆక్రమణల గురించీ మాట్లాడారు! హైడ్రా కాదు కదా అమీబా కూడా ఆయన ఏర్పాటు చేయలేదు! తడిసిపోయిన టపాకాయ లాగా ఆ ఘట్టం పెద్దగా పేలలేదు! దృశ్యాల అవసరం ఆయనకు లేకపోయిందేమో?

బీజేపీ నుంచి కూడా నేర్చుకోగలిగిన చాకచక్యం ఉన్న రేవంత్‌రెడ్డికి, ఈ దృశ్య రహస్యం తెలిసిపోయింది. యోగికి తట్టిందో లేదో కానీ, కూల్చివేతల వెనుక అదనంగా గీతా రహస్యం కూడా రేవంత్‌కు తెలిసివచ్చింది. బుల్‌డోజర్‌కు భగవద్గీత కూడా తోడైతే, 'దేశం కోసం ధర్మం కోసం' చాలా చేయొచ్చు! ఏకంగా కూల్చివేతలకు ఒక సంస్థనే పెట్టొచ్చు, దానికో చట్టమూ చేయవచ్చు!

లోకంలో అక్రమంగా కట్టినవి అనేకం కూల్చవలసినవి ఉంటాయి. తలెగరేసి నిలబడవలసినవి అనేకం కూలిపోతూ ఉంటాయి. ఎవరు ఏ పార్టీకి, ఏ నాయకుడికి జైజైలు కొట్టినా, నియమాలు, చట్టాలు అందరికీ ఒకేలాగ వర్తించవని, అట్లా వర్తించకుండా చూడడానికే ప్రభుత్వాలు, వ్యవస్థలు, నిపుణులు, ప్రతిభావంతులు పనిచేస్తూ ఉంటారని అందరికీ తెలుసు. చిన్న చిన్న తప్పులకు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గేవారు, పూచీకత్తు కట్టలేక బెయిళ్లు పొందలేనివాళ్లు వేలాదిమంది ఉంటారు. పెద్ద పెద్ద తప్పులుచేసి దర్జాగా బయటిప్రపంచంలో తిరిగేవాళ్లు, పరాయిదేశానికి రెక్కలు తొడుక్కున్నవాళ్లు వార్తల్లో పెద్ద మనుషులుగా కనిపిస్తారు. ఇదంతా సహజమని, ఈ అంతస్థుల న్యాయం, బలవంతుడి ధర్మం అచంచలమైనవని అనిపిస్తున్నప్పుడు, ఎప్పుడైనా ఒక్కసారి సంపన్నుడి జేబుకు కన్నం, పెత్తందారుకు బెత్తపు దెబ్బ తగిలినప్పుడు, పేదలకు ఉచితంగా ఒక చక్కిలిగిలి, ఒక ఊరట దక్కుతాయి. అధికారం తమ తరఫునే పనిచేస్తున్నదన్న తృప్తి ప్రాప్తిస్తుంది. ఆ న్యాయం తమ కళ్లెదుటే దృశ్యమానం అయినప్పుడు, ఆ సంతోషమే వేరు!

'హైడ్రా' సాహసదాడుల ద్వారా రేవంత్‌రెడ్డి ప్రజలకు ఆమందానందాన్ని కలిగించబోయారు! కొంతవరకు విజయం సాధించారు కూడా! డబ్బూ హోదా బాగా ఉన్న సంఘబలిష్ఠుల తప్పు రట్టయిందని, వారిని కూడా చట్టం గట్టిగా కొట్టిందని చూసి, విని, తెలుసుకుని, ఒంటి కాలిమీద అయినా ఇంకా న్యాయం మిగిలుందని జనానికి నమ్మకం కలిగింది. ఆ ఉత్సాహంలో తబ్బిబ్బు అయిపోయి, ఈ దశ చిరకాలం కొనసాగుతుందని వారమో నెలో రెన్నెల్లో ఆశల్లో తేలియాడే అవకాశం దొరికింది. కలగవలసిన వారికి భయమూ కలిగింది! ఒక్కోసారి, ఇటువంటి మెరుపుకలలు లేకపోతే, ఈ లోకంలో బతకడం కష్టం!

ఈ కూల్చివేతల వల్ల, రెండు మూడు అదనపు ఫలితాలు కూడా దక్కినయి. ఒకటి, రేవంత్‌రెడ్డికి కొంత ఊరట దొరికింది. ప్రజల దృష్టి మరల్చడానికే ఈ 'హైడ్రా' అధ్యాయం అవతరించిందని ప్రతిపక్షాలు అంటున్నాయి కానీ, అందుకోసమే ఇదంతా అంటే సరికాదు. దాని వల్ల ఈ ఫలితం కూడా సమకూరింది అనడం నిజానికి దగ్గరగా ఉంటుంది. ఒక్కసారిగా, రుణమాఫీలు, రుణబంధులు, ఇతర ఎన్నికల వాగ్దానాలు వెనక్కుపోయాయి. తెలంగాణతల్లి వర్సెస్ రాజీవ్‌గాంధీ వివాదం పక్కకు వెళ్లింది. రేవంత్‌రెడ్డి పాలనలో సతమతమవుతున్నారు, తన ముద్ర చూపించలేకపోతున్నారు, అసలు ఇంకా పట్టే సంపాదించలేదు అని విమర్శించేవారంతా మౌనం వహించారు. కఠినమైన, సాహసమైన, న్యాయంగా కనిపించే నిర్ణయాలు తీసుకోగల సమర్థుడు అన్న ఇమేజ్‌కు ఉన్నట్టుండి ఆస్కారం ఏర్పడింది.

మరొక ముఖ్యమైన ఫలితం, ఒకనాడు చెరువుల పట్టణంగా వర్ధిల్లిన హైదరాబాద్‌ను ఎట్లా కబ్జాకోరులు నంజుకుని తిన్నారో వివరాలన్నీ బయటకు రాసాగాయి. జనంలో ఈ ఆక్రమణల మీద ఆసక్తి పెరిగింది. ఈ సమాచారపు వెల్లువ వల్ల, ఇకనైనా ఆక్రమణలను నిరోధించి, ఉన్న మేరకైనా నగరాన్ని కాపాడుకోవాలన్న స్పృహ పెరుగుతోంది. ఆక్రమణలకు మూలకారకులెవరు అన్న చర్చ జరిగి, పలుకుబడి ప్రయోగించే రాజకీయ నేతలు, నియమాల మెడలు వంచిన అధికారగణం పాత్ర గురించిన ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. పురానా బాబులు ఆక్రమించారు నిజమే, కానీ, వారికి అనుమతుల తివాచీలు పరిచిందెవరు? వారెందుకు శిక్ష తప్పించుకోవాలి? వంటి సూటిప్రశ్నలు న్యాయస్థానాలు కూడా సంధిస్తున్నాయి.

కాళ్ల కింద కాసింత నేల కోసం చెరువుల అంచున, నాలాల పక్కన గుడిసెలు వేసుకునే వారిని, పడావులో ఉండే ప్రభుత్వ భూములలో తలదాచుకునేవారిని అత్యుత్సాహంతో ఈడ్చిపారేసినప్పుడు, ఈ సభ్యసమాజం ఇంతగా కలవరపడదేమి? వారిని అధికార యంత్రాంగం ఏనాడూ కనికరించిన పాపాన పోదు కదా? ఈ మహానగరాన్ని వరదలో కుంభవృష్టిలో ముంచెత్తినప్పుడు, గోడలు కూలి, కాలువల్లో కొట్టుకుపోయీ ఆ అభాగ్యులే చనిపోతారు కానీ, లారీల కొద్దీ మన్నుకుమ్మరించి మట్టాన్ని పెంచుకుని నిర్మించుకున్న కబ్జా భవంతులన్నీ క్షేమంగానే ఉంటాయి. చెరువుల దారులను పేదలెప్పుడూ మూసివేయరు. మహాభవనాలే కరకట్టలై పల్లపు జీవితాలకు గండికొడతాయి!

ఈ హడావిడి ఎక్కువ కాలం ఉండదని, నిజంగా సత్సంకల్పంతో మొదలైనా, ఒత్తిడుల బరువుతో ఇది కుంగిపోతుందని బహుశా అందరికీ తెలుసు. అస్మదీయులకైనా నోటీసులు, కూల్చివేతలు తప్పవని ముఖ్యమంత్రి చెప్పడం బాగుంది కానీ, అన్ని అక్రమాల మూలాలు చివరకు అధికారపీఠాల పెరళ్ల దగ్గరే ముగిసి, చర్యలు క్రమంగా మగతలోకి జారుకుంటాయని కూడా తెలుసు. కానీ, ఈ వేడి ఉన్నప్పుడే, సాధ్యమైనన్ని ఎక్కువ సత్యాలు మాట్లాడుకోవాలి, అక్రమార్కులను విమర్శల బోనెక్కించాలి. మాటలకు చేతలకు నడుమ ఉండే ద్వంద్వత్వాన్ని సాధ్యమైనంతగా ఇరుకున పెట్టాలి. అందుకే, ఈ తేనెతుట్టెను కదిలించినందుకు రేవంత్‌రెడ్డిని అభినందించాలి.

రేవంత్‌రెడ్డి ఇమేజ్‌ను 'హైడ్రా' ఎంత వరకు మరమ్మత్తు చేయగలదు అంటే చెప్పడం కష్టం. కూల్చివేతల సారథిగా పోలీసు అధికారి రంగనాథ్‌కు హైడ్రా కీర్తిలో చాలా వాటా వెడుతుంది. చర్యలు ఆగిపోయినప్పుడు ఆ అప్రదిష్ట మాత్రం రేవంత్‌రెడ్డికే దక్కుతుంది. ప్రస్తుతం 'హైడ్రా' డాన్ క్విక్సోట్ లాగా అనిపిస్తుంది కానీ, ముందుందు అసలు ఘట్టం ఆవిష్కృతమవుతుంది. ఆరంభదశలో ఉన్న సంచలనాత్మకత తగ్గి పోయి, క్రమంగా సమస్యాత్మక అంశాలు ముందుకు వస్తాయి. అసౌకర్యం కలిగించే చారిత్రక వాస్తవాలన్నీ గుర్తుకు వస్తాయి. 2000 నాటి వరదల్లో దోమలెవరు దగ్గర నుంచి, హుసేన్ సాగర్ చుట్టూ వలయాకారపు ఆక్రమణలూ, హైడ్రా ఆఫీసున్న బుద్ధభవనమూ అన్నీ ప్రశ్నార్థకాలవుతాయి! ఆక్రమణదారులు సొంతంగా అనుభవించరు, అమ్ముకుని సొమ్ముచేసుకుంటారు, కొనుక్కున్న మధ్యతరగతి గగ్గోలు పెడుతుంది. ఈ లోగా, తాత్కాలిక ఫలితాలతో సంతుష్టి చెందిన పాలకులు, మరో కొత్త సంచలనానికి వలసపోలతారు!

చెరువులు అయినా, మూసీ రక్షణ అయినా, కొంత కాఠిన్యాన్ని, కొంత ఆచరణాత్మకతని మిళితం చేసి వ్యవహరిస్తే ఎంతో కొంత ఫలితం దక్కుతుంది, విలువలుగా మారితే, దక్కినది నిలబడుతుంది. ఆక్రమణలు, నియమోల్లంఘనలు ఇకమీదట అనుమతించబోమని, సహజవనరుల పరిరక్షణకు అమిత ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలి. ఇప్పటిదాకా జరిగిన కబ్జాలు, జలాశయాలకు కల్పించిన అవరోధాలు, ఎంతవరకు దిద్దుబాటు చేయగలమో పరిశీలించి, ఆ దిశగా చర్యలు చేపట్టాలి, నగర జీవనాన్ని మరింత క్షేమం, సౌకర్యం, పర్యావరణ హితం చేయడమే కర్తవ్యాలుగా ఉండాలి. వర్షప్రవాహాలను ప్రభావితం చేసి, నిర్మాణాలు చేసినవారి నుంచి పెద్ద ఎత్తున జరిమానాలు వసూలు చేయాలి. భవననిర్మాణ సంస్థల నుంచి రాజకీయ కప్పాలను వసూలు చేస్తున్నారన్న వార్తలు వింటున్నాం, వాటితో పాటు, నగర పర్యావరణాన్ని, జల వనరులను రక్షించడానికి సుంకాలను కూడా వసూలు చేయాలి. అధికార యంత్రాంగాన్ని, రాజకీయ నాయకులను గత చర్యలకు, ప్రస్తుత చర్యలకు కూడా బాధ్యత వహించేట్టు చేయాలి. ఈ చర్యలకు పెద్దగా దృశ్యమానత ఉండదు మరి!

ఆప్టిక్స్‌ను ఆశ్రయించే ఆధునిక రాజకీయాలలో ఈ నిశ్శబ్దనిర్మాణాత్మకతను ఆశించడం కష్టమేమో?



> ఆక్రమణలు, నియమోల్లంఘనలు ఇకమీదట అనుమతించబోమని, సహజవనరుల పరిరక్షణకు అమిత ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలి. ఇప్పటిదాకా జరిగిన కబ్జాలు, జలాశయాలకు కల్పించిన అవరోధాలు, ఎంతవరకు దిద్దుబాటు చేయగలమో పరిశీలించి, ఆ దిశగా చర్యలు చేపట్టాలి, నగర జీవనాన్ని మరింత క్షేమం, సౌకర్యం, పర్యావరణ హితం చేయడమే కర్తవ్యాలుగా ఉండాలి. అధికార యంత్రాంగాన్ని, రాజకీయ నాయకులను గత చర్యలకు, ప్రస్తుత చర్యలకు కూడా బాధ్యత వహించేట్టు చేయాలి. ఈ చర్యలకు పెద్దగా దృశ్యమానత ఉండదు మరి! ఆప్టిక్స్‌ను ఆశ్రయించే ఆధునిక రాజకీయాలలో ఈ నిశ్శబ్దనిర్మాణాత్మకతను ఆశించడం కష్టమేమో?

> ఈ వేడి ఉన్నప్పుడే, సాధ్యమైనన్ని ఎక్కువ సత్యాలు మాట్లాడుకోవాలి, అక్రమార్కులను విమర్శల బోనెక్కించాలి. మాటలకు చేతలకు నడుమ ఉండే ద్వంద్వత్వాన్ని సాధ్యమైనంతగా ఇరుకున పెట్టాలి. అందుకే, ఈ తేనెతుట్టెను కదిలించినందుకు రేవంత్‌రెడ్డిని అభినందించాలి.

డెవలప్‌మెంట్ జర్నలిజంలో మార్గదర్శకుడు విహెచ్

విహెచ్‌గా ప్రాచుర్యం పొందిన వి.హనుమంతరావు జర్నలిస్ట్‌గా 65 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో, అనేక మైలురాళ్ళను దాటారు. వార్తలు, అభిప్రాయాలను సామాన్యుల దృక్కోణం నుండి వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందించే జర్నలిజమే నిజమైన జర్నలిజం అని ఆయన విశ్వాసం. ఆదే తరచు చెబుతూ ఉండేవారు.

తెలుగు దినపత్రిక విశాలాంధ్ర కోసం పార్లమెంటు సమావేశాలకు హాజరయి వార్తలు అందించిన మొదటి పాత్రికేయుని ఘనత విహెచ్‌ది. ఆయన ఐఎన్ఎస్ విక్రాంత్ నుండి యుద్ధ



వార్తలు అందించిన వార్ రిపోర్టర్. జర్నలిజం పాఠశాలను; వార్తా సంస్థ, డేటా న్యూస్ ఫీచర్స్ (డిఎన్ఎఫ్)ను నెలకొల్పి, డేటాను వివరించే అభివృద్ధి జర్నలిజంలోకి యువ జర్నలిస్టులను ప్రవేశించడానికి ఆయన కృషి అపారం. రాజకీయ, పాత్రికేయ రంగాలలో పలువురు సీనియర్లు ఆయన అభిమానులున్నారంటే ఆర్థిక, రాజకీయ సామాజిక, గ్రామీణ వ్యవస్థలపై ఆయనకున్న పట్టు తెలుపుతుంది. ఆయన చెప్పింది ఆథెంటిక్.

గోదావరి జిల్లా, మండపేటలో జన్మించిన హనుమంతరావు తొలుత, కమ్యూనిస్ట్ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వద్ద స్టెనోగా చేరి, ఆ తరువాత జర్నలిజం వృత్తిలో ప్రవేశించి అంచలంచెలుగా ఎదిగి వివిధ పత్రికల్లో వివిధ హోదాలకు ఎదిగి తన ప్రతిభ చాటుకున్నారు. అనుభావిక డేటా ఆధారంగా వార్తాకథనాలు రాయడంలో ఆయన నిపుణుడు, తెలుగులో డెవలప్‌మెంట్ జర్నలిజంలో మార్గదర్శకుడు. మూడు దశాబ్దాలకు పైగా డిఎన్ఎఫ్ ఏజెన్సీని నిర్వహించడమే గాక, వార్తా రంగానికి, విద్యా, ఉద్యోగ పోటీ రంగంలో యువతకు ఏ ఏడాదికా ఏడు తాజా సమాచారంతో ఇయర్ బుక్‌లను ప్రచురించిన అరుదైన ఘనత ఆయనది.

కృష్ణా పత్రిక, ఈనాడు, ది ఎకనామిక్ టైమ్స్, విశాలాంధ్ర, ప్రజాశక్తి మొదలైన మీడియా సంస్థలలో ఆయన వివిధ హోదాలలో ప్రతిభ కనబరచారు. చట్టసభల వార్షిక బడ్జెట్‌లను అక్షరం వదలకుండా అధ్యయనం చేసిన వ్యక్తి అని చెప్పవచ్చు. అసెంబ్లీ, పార్లమెంట్ వార్షిక బడ్జెట్‌లపై వివరాణాత్మక సమాచారం అందివ్వడంలో, విశ్లేషించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన సరళమైన భాషకు, నిజాయితీకి నిలువెత్తు వ్యక్తి. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలపై ఖచ్చితమైన డేటాను అందించడంలో ఆయన అందె వేసిన చెయ్యి.

ఆయన రచనలు పలు రంగాల వారిని ఆలోచింపజేసేవి. సామాజిక, ఆర్థిక సమస్యలపై రాయడానికి పలువురు యువకులను ప్రోత్సహించారు. హనుమంతరావు అనేక మంది జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. పాత్రికేయ, రాజకీయ వర్గాల్లో అత్యంత గౌరవనీయమైన వ్యక్తులలో ఒకరు. తెలుగు ఇంగ్లీషు పత్రికలలో వివిధ హోదాలలో 65 సంవత్సరాలకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన అరుదైన వ్యక్తి. వీక్షణం అనే మాసపత్రికకు వ్యవస్థాపక సంపాదకులు. హనుమంతరావు వివిధ వార్తాపత్రికలు, పత్రికలలో అసంఖ్యాకంగా వ్యాసాలు రాశారు. ఆగస్టు 30న విహెచ్ శత జయంతి.

– నందిరాజు రాధాకృష్ణ, వెటరన్ జర్నలిస్ట్

(హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో రేపు ఉదయం పదిన్నరకు వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో విహెచ్ శతజయంతి సభ)

తెలుగు మాధ్యమంతోనే ఆంధ్రాభ్యుదయం

అమాయక ప్రజలను 'ఇంగ్లీషు విద్యా హక్కు' అని మభ్యపెట్టి, తెలుగు రాష్ట్రంలో తెలుగులో చదువుకునే అవకాశాల్ని కాలరాసింది గత ప్రభుత్వం. పది కోట్ల మందికి పైగా మాట్లాడే తెలుగు భాషకు తెలుగు గడ్డపైనే ఇంతటి దుర్గతి పట్టడం నిజంగా చాలా దురదృష్టం. మన ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమం కాదని ఇంగ్లీషు మాధ్యమానికి పెద్దపీట వేయడం నిజంగా తెలుగు జాతికి సమాధి కట్టడమనే చెప్పాలి.

మాతృభాషలో విద్యాబోధన అనేది పిల్లల మానసిక వికాసానికి చాల మంచిది. దాని వలన పిల్లల సృజనాత్మకత మెరుగుపడుతుంది. వారి ఆలోచనలు 'కాపీ అండ్ పేస్ట్'లా కాకుండా ఒరిజినల్‌గా, అసలు సిసలుగా ఉంటాయి. కనుక పిల్లలకు మాతృభాషలో విద్యాబోధన ఎంతైనా అభిలషణీయం. కనీసం పదవ తరగతి వరకైనా తెలుగు మాధ్యమం ఉండాలి.

ప్రభుత్వానికి సమాజ అభ్యున్నతి మీద నిజంగా స్పృహ ఉంటే, పేదపిల్లలతో పాటు కోటీశ్వరుల పిల్లలు కూడా తెలుగు మాధ్యమంలో చదివేలా ప్రోత్సహించాలి. అంతేకాని ధనికులు ఆంగ్లమాధ్యమంలో చదువుతున్నారు కాబట్టి అదేదో గొప్పని భావించి, పిల్లల మనోవికాసం గురించి కనీస స్పృహ లేకుండా, పేదలను కూడా ఆంగ్లమాధ్యమం వైపు ప్రోత్సహించడం మన 'సంఘసంస్కర్తల' అవివేకాన్ని చాటుతుంది. మన నాయకులకు నిజంగా సమాజాభ్యుదయం మీద చిత్తశుద్ధి, అవగాహన ఉంటే ప్రజలను తెలుగు దారిలోకి మళ్లించడం అసాధ్యమేమీ కాదు. అందుకు ముందు వారు చేయవలసింది తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్యలో రిజర్వేషన్ కల్పించడం. ఉదాహరణకు ఇంటర్మీడియట్ వరకు తెలుగు మీడియం చదివిన విద్యార్థులకు మన వైద్య కళాశాలల్లో యాభై శాతం సీట్లు కేటాయించవచ్చు. అలానే ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో కూడా తెలుగు మీడియం పిల్లలకు సీట్లు కేటాయించాలి. అప్పుడు కచ్చితంగా ప్రజలు తెలుగు మాధ్యమం వైపు మళ్లుతారు. తెలుగు సమాజంలో తిరిగి సృజనాత్మకత వికసిస్తుంది.

మన ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టి, పేద పిల్లలకు ఉపాధ్యాయులచే వచ్చిరాని ఇంగ్లీషులో అరకొర చదువులు చెప్పించడం వలన వారి సృజనాత్మకత దెబ్బతినడం, ఆపైన తెలుగు భాషకి, తెలుగు సంస్కృతికి ఉనికి లేకుండా పోవడం తప్ప పేద పిల్లలకు నిజంగా ఒనగూరే మేలు లేదు. అలా కాకుండా ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తూ, తెలుగు మాధ్యమం విద్యార్థులకు ఉన్నత విద్యలో కోటా ఇస్తే, అది పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుంది. అంతేకాక ఇంగ్లీషు వ్యామోహంలో కొట్టుకుపోతున్న మధ్య తరగతి, ఉన్నత తరగతి పిల్లలు కూడా తెలుగు మీడియం వైపు మళ్లుతారు. కార్పొరేట్ పాఠశాలల్లో కూడా తెలుగు మాధ్యమం చెప్పటం మొదలుపెడతారు. అలా ఎక్కువ మంది విద్యార్థులు మాతృభాషలో చదువుకుంటారు. పిల్లల మనోవికాసం, సృజనాత్మకత మెరుగవుతుంది, తెలుగు జాతి మేధస్సు వికసితమవుతుంది. తెలుగు భాష, తెలుగు సంస్కృతి నిలబడతాయి.


ఇక్కడ మనకు ఒక సందేహం కలగొచ్చు. ఇంటర్మీడియట్ వరకు తెలుగు మీడియంలో చదివితే, మెడికల్ కాలేజీలోనో లేక యూనివర్సిటీలోనో ప్రవేశించిన తరువాత మొత్తం అంతా ఇంగ్లీషులో చదవాలంటే కష్టం కదా? అని. ఈ వాదన కొంతవరకు నిజమే. కానీ మనం నాణేనికి మరో వైపు కూడా చూడాల్సి ఉంది. అదేంటంటే తెలివైన విద్యార్థులకు నిజంగా మీడియం అనేది పెద్ద సమస్య కాదు. వాళ్ళు చిన్నప్పటి నుండి ఇంగ్లీషు మీడియంలో చదవగలరు. లేదా చిన్నప్పుడు తెలుగు మీడియంలో చదివి పై చదువులు ఇంగ్లీషు మీడియంలో చదవగలరు. కానీ యావరేజ్ (average) బిలో యావరేజ్ (below average) స్టూడెంట్స్ మాతృభాషలో విద్యా బోధన లేకపోతే నష్టపోతారు. తెలుగు మీడియం పుణ్యమా అని వీళ్ళు ఇప్పుడు కనీసం హైస్కూల్ వరకు అయినా చదువుకోగలుగుతున్నారు. అదే లేకపోతే చాలా మంది పిల్లలు నిజానికి ప్రాథమిక స్థాయి కూడా దాటలేరు. ఇప్పుడు పిల్లలందరూ హై స్కూల్ స్థాయి దాటి కళాశాలల్లో ప్రవేశిస్తున్నారు అంటే అది పరీక్షా ప్రమాణాలు తగ్గడం వలన వచ్చిన వాపే కానీ బలుపు కాదని గ్రహించాలి.

ఉన్నత విద్య ఇంగ్లీషులో ఉందని, దాని కోసం ప్రాథమిక విద్యను కూడా ఇంగ్లీషులో చెప్పాలనటం నాడా కోసం గుర్రాన్ని వదులుకోవడమే అవుతుంది. పిల్లల్లో సృజనాత్మకత, మానసిక వికాసం క్షీణింపజేసి, వాళ్లకి ఉన్నత విద్య ప్రసాదించడం వలన, సమాజానికి మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుంది. కనుక ప్రాథమిక విద్యని ఇంగ్లీషులోకి మార్చి, తెలుగు సంస్కృతిని, తెలుగు సమాజం మూలాల్ని పెకలించడం కన్నా, ప్రాథమిక విద్యని తెలుగులోనే యథాతథంగా ఉంచి, ఉన్నత విద్యకి సంబంధించిన గ్రంథాలను తెలుగులోకి తర్జుమా చేయించి, ఉన్నత విద్యని కూడా తెలుగులో అందించడం నిజానికి ఎంతో సహేతుకం.

ఉన్నత విద్యని ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒక్కసారిగా తెలుగులో బోధించటం కష్టంగానే ఉండవచ్చు. కానీ చిత్తశుద్ధితో, ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే అది అంత అసాధ్యమైన విషమేమి కాదని తెలుస్తుంది. ఉన్నత విద్యకి సంబంధించిన పుస్తకాలను ఆంగ్లం నుండి తెలుగులోకి తర్జుమా చేయటానికి ఇప్పుడు మనకు కృత్రిమ మేధ సహకారం ఉన్నది. తెలుగులో పాఠాలు చెప్పే మన ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి ఇంగ్లీషులో పాఠాలు చెప్పించటం కంటే, ఇంగ్లీషులో పాఠాలు చెప్పే మన యూనివర్సిటీ ఆచార్యులకు శిక్షణ ఇచ్చి, వాళ్ళ చేత తెలుగులో పాఠాలు చెప్పించటం చాలా తేలిక. చిన్న చిన్న దేశాలు కూడా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, విశ్వవిద్యాలయాల్లో బోధించే ఉన్నత స్థాయి గ్రంథాలను తమ తమ భాషల్లోకి తర్జుమా చేసుకోగలిగినప్పుడు, తెలుగు భాషలోకి ఎందుకు చేయకూడదు? కనుక తెలుగులో ఉన్నత విద్యాభ్యాసం అంత దుర్లభమైన విషయమేమీకాదు.

మాతృభాషలో విద్యాభ్యాసం వలన పిల్లల సృజనాత్మకత మెరుగవుతుంది. కేవలం పరాయి ఆలోచనలను నిష్క్రియాత్మకంగా తలకెక్కించుకోకుండా, స్వతంత్రంగా ఆలోచించగలుగుతారు. ప్రతి దాన్ని పాశ్చాత్యుల నుండి దిగుమతి చేసుకోకుండా శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్వంతంగా ఆవిష్కరణలు చేయగలుగుతారు. వినూత్నమైన అసలు సిసలైన ప్రతిపాదనలు చేయగలుగుతారు. క్రమంగా తెలుగు జాతి మేధస్సు పరిమళిస్తుంది, మన వాళ్ళు కూడా పుస్తకాలు రాయగలుగుతారు. కొంత కాలం తరువాత మన వాళ్ళు తెలుగులో రాసిన పుస్తకాలను పాశ్చాత్యులు తర్జుమా చేసుకునే పరిస్థితి వస్తుంది.

> ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తూ, తెలుగు మాధ్యమం విద్యార్థులకు ఉన్నత విద్యలో కోటా ఇస్తే, అది పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుంది. అంతేకాక ఇంగ్లీషు వ్యామోహంలో కొట్టుకుపోతున్న మధ్య తరగతి, ఉన్నత తరగతి పిల్లలు కూడా తెలుగు మీడియం వైపు మళ్లుతారు. అలా ఎక్కువ మంది విద్యార్థులు మాతృభాషలో చదువుకుంటారు. పిల్లల మనోవికాసం, సృజనాత్మకత మెరుగవుతుంది, తెలుగు జాతి మేధస్సు వికసితమవుతుంది. తెలుగు భాష, తెలుగు సంస్కృతి నిలబడతాయి.



■ డా. గోనుగుంట్ల శ్రీనివాసరావు




కలుషిత నీరు కబళిస్తోంది!

- ఎ.కొండూరు భూగర్భ జలాల్లో మోటాలిక్ ఎలిమెంట్స్
- ఈ మండలంలో తాగునీరు సురక్షితం కాదు
- శాశ్వత పరిష్కారానికే కృష్ణా జలాలు
- మార్చి నాటికి పైపులైన్ పనులు పూర్తి : కలెక్టర్ సృజన

6లో..


దీప్లానగర్ ఠండాలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సృజన


విజయ గణపతి మట్టి విగ్రహ నమూనా ఆవిష్కరణలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్

ఘనపతి

విద్యాధరపురంలో 72 అడుగుల వినాయక విగ్రహం ఏర్పాటు

- పర్యావరణ హితంగా ఖైరతాబాద్ స్థాయిలో..
- ప్రముఖ దేవాలయాల అర్చకులతో నిత్య పూజలు
- పవిత్ర సంగమంలో దసరా నుంచి నవ హారతులు : మంత్రి ఆనం వెల్లడి

భవానీపురం, ఆగస్టు 28 : పర్యావరణ హితం కోరుతూ విద్యాధరపురంలో 72 అడుగుల విజయ గణపతి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. లేబర్ కాలనీ స్టేడియం గ్రౌండ్స్ వద్ద భారీ గణేశ్ మట్టి విగ్రహ నమూనా ఆవిష్కరణలో ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి మంత్రి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ అమరావతి పునర్వైభవం కోరుతూ డూండీ గణేశ్ సేవా సమితి నిర్వాహకుడు డూండీ రాకేశ్ పర్యవేక్షణలో ఖైరతాబాద్ తరహాలోనే విగ్రహం రూపొందించి వినాయక ఉత్సవాలు నిర్వహించాలని తలపెట్టడం అభినందనీయమన్నారు. తిరుమల, ఇంద్రకీలాద్రి, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీశైలం, చిన్నతిరుపతి, సింహాచలం, అన్నవరం దేవస్థానాల అర్చకుల పర్యవేక్షణలో నిత్య కల్యాణోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మకు ఇచ్చే నవహారతులను దసరా నవరాత్రి ఉత్సవాల నుంచి ప్రారంభించ డానికి సీఎం చంద్రబాబు నిర్ణయించారని మంత్రి వెల్లడించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండటంతో పాటు అమరావతికి పూర్వ వైభవం కోసం ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్య నారాయణ, టీడీపీ నాయకులు, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సీన్ రివర్స్

వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్షానిదే హవా

వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సీన్ రివర్స్ అయింది. నిన్నటి వరకు అధికార వైసీపీతో ఏకపక్షంగా నడిచిన కౌన్సిల్‌లో నేడు ప్రతిపక్ష టీడీపీ అంతా తానై ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసింది. నగరంలో పారిశుధ్యం, నూతన వీఎంసీ భవన ఆధునికీకరణలో అవినీతి, ఇండోర్ స్టేడియంలో ప్రైవేట్ వ్యక్తుల దందా వంటి అంశాలపై టీడీపీ కార్పొరేటర్లు భగ్గుమన్నారు. గతంలో ప్రతిపక్షం ప్రశ్న వేయకుండానే, అధికారపక్ష కార్పొరేటర్ల అడ్డగింతలు, అరుపులు, కేకలతో అజెండాలోని అంశాలపై చర్చ జరిగేది కాదు. ఈసారి ఆ పరిస్థితి కనిపించలేదు. వీఎంసీ కౌన్సిల్ హాల్లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ కౌన్సిల్‌లో టీడీపీ కార్పొరేటర్లు ప్రశ్నల వర్షం కురిపించి, అధికారులతో సమాధానం చెప్పించారు. - చిట్టినగర్

నిన్నటివరకు నోరు నొక్కేసిన అధికార వైసీపీ

- నేడు సమస్యలపై గళమెత్తిన టీడీపీ కార్పొరేటర్లు
- సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన అధికారులు
- ఇండోర్ స్టేడియాల్లో ప్రైవేట్ పెత్తనంపై రచ్చ
- వీఎంసీ కొత్త భవన నిర్మాణంలో అవినీతిపై నిలదీత


కౌన్సిల్‌లో అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

ఇండోర్ స్టేడియాల నిర్వహణపై దుమారం

నగరంలోని దండమూడి ఇండోర్ స్టేడియం, రామకోటయ్య ఇండోర్ స్టేడియాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో ఆదాయం కోల్పోవడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ఉపయోగపడట్లేదని కార్పొరేటర్ ముమ్మనేని వెంకటప్రసాద్ లేవనెత్తిన అంశం అధికారులను ఇరకాటంలో పెట్టింది. ప్రైవేట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్లు స్టేడియంలో ఒక గది అద్దెకు తీసుకుని, క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేషన్‌కు చెల్లిస్తున్నారంటే అక్కడ ప్రైవేట్ వ్యక్తుల ప్రాబల్యం ఎంత ఉందో అర్థమవుతుందని, సదరు వ్యక్తులు స్టేడియంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, ఇంట్లో కూర్చుని పర్యవేక్షిస్తున్నారని ప్రసాద్ మండిపడ్డారు. ఇటువంటి చర్యలు సరికాదని, అక్కడకు క్రీడాకారిణులు కూడా వస్తారని, సీసీ కెమెరాల వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. వెంటనే ఆ స్టేడియాలను వీఎంసీ స్వాధీనం చేసుకుని క్రీడాకారులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రకటన ఏజెన్సీలపై పట్టు

నగరంలోని పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, భారీ బ్యానర్లు, వ్యాపార ప్రకటనలకు సంబంధించిన ఏజెన్సీలు.. వీఎంసీకి బకాయిలు చెల్లించకుండా కోర్టులను ఆశ్రయిస్తున్నాయని, దీనివల్ల కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతున్నామని కార్పొరేటర్ ముమ్మనేని వెంకటప్రసాద్ కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. నగర పరిధిలోని పలు ఏజెన్సీలు వ్యాపార ప్రకటనలు, హోర్డింగ్‌ల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించుకుంటూ, నగరపాలక సంస్థకు బకాయిలు చెల్లించకుండా కోర్టులకు వెళ్లి కాలయాపన చేస్తున్నాయని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్రను కోరారు. వీఎంసీ లీగల్ సెల్ ఉన్నప్పటికీ కేసుల పరిష్కారంలో చొరవ తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కమిషనర్ కలగజేసుకుని లీగల్ సెల్, ప్రకటనలకు సంబంధించిన ఏజెన్సీలతో విడివిడిగా సమావేశం నిర్వహించి, బకాయిలు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డబ్బు వసూలు చేసుకుని, వీఎంసీకి చెల్లించని ఏజెన్సీలను రద్దు చేయాలని కోరారు.


ప్లకార్డులతో హాజరవుతున్న టీడీపీ కార్పొరేటర్లు

కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌పై వాగ్వాదం

ప్రశ్నోత్తరాల సమయంలో 34వ డివిజన్ కార్పొరేటర్ పుణ్యశీల ప్రశ్నపై సుమారు గంటపాటు చర్చ జరిగింది. కేదారేశ్వరపేట ఫ్రూట్ మార్కెట్‌కు వచ్చే వాహనాలతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉందనే అంశంపై వాడివేడి చర్చ సాగింది. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ కలగజేసుకుని మార్కెట్ వల్ల ఎటువంటి ఇబ్బందులు లేవని, కేదారేశ్వరపేట ఏర్పడక ముందే అక్కడ ఫ్రూట్ మార్కెట్ ఉందని చెప్పారు. దీంతో కొద్దిసేపు బుల్లా విజయ్‌కుమార్, పుణ్యశీల మధ్య వివాదం నడిచింది. ఎర్రకట్ట ప్రారంభంలో ఓ వ్యక్తి అరటికాయల వ్యాపారం చేసుకుంటూ తీవ్ర ట్రాఫిక్ సమస్య సృష్టిస్తున్నాడని, అతన్ని అక్కడి నుంచి తొలగించకుండా ఎవరు అడ్డుకుంటున్నారో చెప్పాలని బుల్లా విజయ్‌కుమార్ అనడంతో పుణ్యశీల ఆయనతో వివాదానికి దిగారు. తన డివిజన్‌లో ఆయన పెత్తనమేమిటని నిలదీశారు. ఇరువురు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. మేయర్ జోక్యంతో గొడవ సద్దుమణిగింది.

పారిశుధ్య పనులు సక్రమంగా జరగాలి

నగరంలో పారిశుధ్య పనుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కార్పొరేటర్లు మేయర్‌ను కోరారు. పలు డివిజన్లలో సిబ్బంది లేకపోవడంతో పారిశుధ్య సమస్య ఉందని, సిబ్బందిని పెంచాలని చెప్పినా పట్టించుకోకపోవడాన్ని కార్పొరేటర్లు.. కమిషనర్‌కు వివరించారు. కాగా, సమావేశం ప్రారంభానికి ముందే టీడీపీ కార్పొరేటర్లు.. ప్రజలు రోగాల బారినపడకుండా కాపాడాలని, స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని ప్లకార్డులతో నినదించారు.

నూతన భవన ఆధునికీకరణ పనులపై నిజనిర్ధారణ కమిటీ

వీఎంసీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన భవన రెండో అంతస్తులో ఆధునికీకరణ పనుల నాణ్యతపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టారని, అవినీతి జరిగిందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎస్.బాలస్వామి లేవనెత్తిన అంశంపై మేయర్ స్పందించారు. తనపై టీడీపీ కార్పొరేటర్లు ఆరోపణలు చేయడం సరికాదని, ఆ పనులు పూర్తిగా కమిషనర్ పర్యవేక్షణలో జరిగాయన్నారు. పనులకు సంబంధించి నిజనిర్ధారణ కమిటీ వేసి నాణ్యతా ప్రమాణాలను పాటించకుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ కార్పొరేటర్లతో పాటు మేయర్ కమిషనర్‌ను కోరారు.

సీపీతో సీఐడీ ఏడీజీ భేటీ

విజయవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సీఐడీ ఏడీజీ (అడిషనల్ డైరెక్టర్ జనరల్) రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుతో భేటీ అయ్యారు. కమిషనరేట్‌లోని కమిషనర్ చాంబర్‌లో సుమారు అరగంట వరకు ఇద్దరూ మాట్లాడుకున్నారు. సీఐడీ వద్ద ప్రస్తుతం ముఖ్యమైన ఫైర్‌నెట్, ఆడుదాం ఆంధ్రాలో నిధుల దుర్వినియోగం కేసులు ఉన్నాయి. 'ఆడుదాం ఆంధ్రా'లో కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగం జరిగిందని, ఇందులో అప్పటి శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, మంత్రి ఆర్కే రోజా పాత్ర ఉందని ఆత్యాపాత్యా సీఈవో రంభా ప్రసాద్ సీఐడీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ముంబై నటి కేసు వెలుగులోకి వచ్చింది. ఈ కేసును ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. సంబంధిత అధికారులకు సంజాయిషీ నోటీసులివ్వాలని భావిస్తోంది. దీనిపై ముందుగా ప్రాథమిక విచారణ జరగాలి. ఈ కేసుకు దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ నగరంలోనే పనిచేస్తున్నారు. ఆయన్ను పిలిపించి, ఆరా తీసే అవకాశాలున్నాయి. ప్రాథమిక విచారణ పూర్తయ్యాక ఎవరిపై చర్యలు తీసుకోవాలన్న అంశంపై ఉన్నతాధికారులు నిర్ధారణకు వస్తారు. ఈ అంశాలపైనే సీఐడీ చీఫ్ చర్చించినట్టు సమాచారం.

హక్కుల పరిరక్షణ బాధ్యత కమిషన్‌దే

6లో..

బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్

- వేశ్యవృత్తిలోని మహిళల పిల్లల దుర్భరత్వంపై స్టేట్ రిపోర్టు విడుదల

నైట్ అవుట్ వివాదం

ఆర్టీసీలో ముదురుతున్న అలవెన్సుల గోల

- నైట్ అవుట్ అలవెన్స్ నిలిపివేతపై ఉద్యోగుల ఆగ్రహం
- వేతనంతో కలిపి చెల్లించటానికి అధికారుల నిరాకరణ
- ఆందోళన చేస్తామంటున్న ఉద్యోగ సంఘాలు
- ట్రెజరీలో మాడ్యూల్ కష్టాల వల్లే..
- మాడ్యూల్ సమస్యను పరిష్కరిస్తేనే వివాదానికి తెర

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీలో నైట్ అవుట్ అలవెన్స్ రగడ ముదిరిపాకాన పడుతోంది. వేతనాలతో పాటు నైట్ అలవెన్స్ చెల్లింపులను ట్రెజరీ శాఖ నిలిపివేస్తూ ఆదేశాలివ్వడం ఉద్యోగుల్లో ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. ఈ వ్యతిరేకత ఎక్కువ కావడంతో ఉద్యోగ సంఘాలు కూడా రంగంలోకి దిగాయి. గుర్తింపు సంఘాలైన ఎన్ఎంయూఏ, ఈయూ అగ్రనేతలు పీవీ రమణారెడ్డి, వైశ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తీవ్రంగా స్పందించటంతో పాటు ఆందోళనలకు సమాయత్తమవుతామని హెచ్చరిస్తున్నారు.

కొరవడిన స్పష్టత

ఆర్టీసీ ఆపరేషనల్ విభాగంలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్ల సాధారణ డ్యూటీల్లో భాగంగా నైట్ అవుట్లు మిళితమై ఉంటాయి. వేతనంతో పాటు ప్రతినెలా నైట్ అవుట్ అలవెన్సులను చెల్లిస్తారు. అయితే, ఈనెల 1 నుంచి నైట్ అవుట్ అలవెన్సులను వేతనంతో కలిపి ఇవ్వటాన్ని ట్రెజరీ అధికారులు నిలిపివేశారు. ఆర్టీసీ ఉద్యోగులు కార్పొరేషన్ పరిధిలో ఉన్నపుడు ఇండస్ట్రియల్ యాక్ట్ ప్రకారం వారికి నైట్ అవుట్ అలవెన్స్ కల్పించారు. రాత్రిపూట డ్యూటీలు చేసే వారికి రిస్క్ ఎక్కువ కాబట్టి ఇలా ఇస్తారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశాక పరిస్థితి మారింది. సాధారణ ప్రభుత్వ ఉద్యోగులకు నైట్ అలవెన్సులు ఉండవు. ఆ మాదిరిగా చేద్దాం.. అనుకున్నా ఆర్టీసీ ఇంకా పూర్తిగా ప్రభుత్వంలో విలీనం కాలేదు. కాబట్టి ఇండస్ట్రియల్ యాక్ట్ అమలు విషయంలో కొంత అస్పష్టత ఏర్పడింది. ఆర్టీసీ కార్మికుల పని విధానం అప్పుడు, ఇప్పుడు ఒకటే కాబట్టి నైట్ అవుట్ అలవెన్సుల విషయంలో న్యాయస్థానాలు కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ అంశం అంతుచిక్కని వ్యవహారంగా మారింది.

ట్రెజరీలోనే సమస్య

ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలిచ్చేది ట్రెజరీ అధికారులే. కానీ, ఆర్టీసీ.. ప్రభుత్వంలో విలీనమైనప్పటి నుంచి ఉద్యోగులు ట్రెజరీ దగ్గర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ స్థాయిలో చర్చ జరిగి, వారి సమస్యలకు పరిష్కారం ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలో ట్రెజరీ అధికారులు ఆ పని చేయలేకపోతున్నారు. ట్రెజరీ మాడ్యూల్‌ను మారిస్తేనే అది సాధ్యమవుతుంది. అలాగే, విలీన సమయంలో కిందటి వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసింది. కొన్నింటిని ఉద్యోగులు పోరాడి సాధించుకున్నారు. కానీ, వాటి అమలు విషయంలో సమస్య తలెత్తుతోంది. నైట్ అవుట్ అలవెన్స్ సమస్య కూడా అలాంటి వాటిలో ఒకటి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా ఆర్టీసీ సిబ్బందికి చెల్లించే అలవెన్సులన్నింటిపైనా హామీ లభించింది. కానీ, ట్రెజరీ దగ్గరకు వచ్చేసరికి సమస్యలు పరిష్కారం కావట్లేదు.

వారసత్వ రగడ

దుర్గగుడిలో ఆరుగురు అర్చకులకు వారసత్వ గుర్తింపు

- ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జగన్ సర్కార్ ఉత్తర్వులు
- తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలు
- అర్హతలేని వారికి అందలం.. కోర్టు కేసులున్న వారికి ప్రాధాన్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మిగతా అర్చకులు
- ఆదాయార్జన కోసమేనంటూ మండిపాటు



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వారసత్వ రగడ నడుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో గత మేలో హడావిడిగా పలువురు అర్చకులకు వారసత్వ హక్కులు కట్టబెట్టడం, ఈ తతంగమంతా గుట్టుగా జరగడం, అర్హతలేని వారికి వారసత్వ హక్కు కల్పించడం, కోర్టు కేసులు ఉన్నవారికి ప్రాధాన్యమివ్వడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : 1987లో ఎన్టీఆర్ ప్రభుత్వం దుర్గగుడిలో వంశపారంపర్యాన్ని రద్దు చేసింది. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏ ఆలయాల్లోనూ వారసత్వం లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మళ్లీ వంశపారంపర్యానికి ఊపిరిపోసింది. దాన్ని అడ్డం పెట్టుకుని అర్హత లేని వారికి సైతం వారసత్వ హక్కులు కల్పించడం ప్రస్తుతం దుర్గగుడిలో దుమారానికి కారణమయ్యాయి. అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. దుర్గగుడిలో లింగంభొట్ల దుర్గాప్రసాద్, లింగంభొట్ల వెంకట సుబ్రహ్మణ్య బద్రీనాథ్‌బాబు, కుందుర్తి వెంకట కనకసుందరశర్మ, లింగంభొట్ల వెంకట శివరామ ఫణీంద్రశర్మ, లింగంభొట్ల రఘురామశర్మ, లింగంభొట్ల భవానీప్రసాద్‌ను వారసత్వ అర్చక కుటుంబాలకు చెందిన వ్యక్తులుగా గుర్తిస్తూ గత జగన్ ప్రభుత్వంలో గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ గత మే 21న మెమో జారీ చేశారు. వారసత్వ అర్చక కుటుంబాల వారు కావడంతో దుర్గమ్మ అంతరాలయంలో మూలవిరాట్‌కు నిత్యపూజ చేయడం, శఠగోపంతో పాటు భక్తులకు కుంకుమ, ప్రసాదాలు అందజేసేందుకు వీలు కల్పిస్తూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

వెలంపల్లి ఒత్తిడితోనేనా..?

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఉత్తర్వులు వెలువడటం, అర్హతలేని వారికి వారసత్వ హక్కు కల్పించడం, కోర్టు కేసులు ఉన్నవారికి వారసత్వం ఇవ్వడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. 2024, మార్చిలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ సమయంలో ఎవరికి ఎటువంటి లబ్ధి చేకూర్చే పనులు కానీ, ఉత్తర్వులు జారీ చేయడం కానీ, కొత్తగా పథకాలు ప్రారంభించడం కానీ చేయకూడదు. అటువంటిది ఆరుగురు అర్చకులకు వారసత్వ హక్కులు కల్పిస్తూ ఈ ఏడాది మే 21న ఉత్తర్వులు ఇవ్వడం వెనుక దేవదాయ శాఖ మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఒత్తిడి ఉందన్న ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఉత్తర్వులను గోప్యంగా ఉంచారు. తాజాగా ఇది బయటకు రావడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అడ్డగోలుగా..

వారసత్వ అర్చకుల గుర్తింపుపై 2022లో విచారణ జరిగింది. అప్పట్లో ఈవోగా ఉన్న సురేశ్ బాబు వారసత్వ అర్చకుల గుర్తింపుపై విచారణ చేశారు. ఆ తర్వాత ఆయనే ఆర్జేసీగా ఉండటంతో ఆ విచారణ నివేదికను ఓకే.. చేసేశారు. నిబంధనల ప్రకారం ఇటువంటి వారసత్వ గుర్తింపు అంశాలపై తొలుత ఈవో విచారణ జరుపుతారు. ఆ తర్వాత దేవదాయ శాఖ సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఆర్జేసీ, దేవదాయ శాఖ హెడ్డాఫీసు నుంచి అధికారులు విచారణ జరిపి, ఈవో ఇచ్చిన నివేదికలో పొరపాట్లు ఉంటే సరిచేస్తారు. కానీ, అలా జరగలేదు. దాని ఫలితమే అర్హత లేని వారికి వారసత్వ హక్కులు కల్పించడం.

నిదర్శనాలివిగో..

- బదరీనాథ్ బాబు జీవించి ఉండగానే, ఆయన కుమారుడికి వారసత్వ హక్కు కల్పించారు. ఎవరైనా అర్చకుడు చనిపోతే వారి తరఫున ఉన్నవారికి వారసత్వ హక్కు కల్పిస్తారు. కానీ ఇక్కడ అలా జరగలేదు.
- చంద్రశేఖర్‌శర్మ ఎప్పుడో పదవీ విరమణ చేసి అన్ని ప్రయోజనాలు పొంది, పెన్షన్ తీసుకుంటూ చనిపోయారు. ఆయన కుమారుడు రఘురామశర్మకు వారసత్వ హక్కు కల్పించారు. అన్ని ప్రయోజనాలు పొంది పదవీ విరమణ చేసిన వ్యక్తి కుమారుడికి వారసత్వ హక్కు ఎలా కల్పించారన్నది ప్రశ్న.
- ప్రభాకరశర్మ చనిపోతే ఆయన కుమారుడు ఫణీంద్రశర్మకు 2005లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చారు.

- మిగతా 6లో


ఎ.కొండూరులోని డయాలసిస్ యూనిట్ పరిశీలించి, రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ సృజన

కలుషిత నీరు కబళిస్తోంది!

- భూగర్భ జలాల్లో మెటాలిక్ ఎలిమెంట్స్
- మండలంలో తాగునీరు సురక్షితం కాదు
- శ్వాశత పరిష్కారానికే కృష్ణా జలాలు
- మార్చి నాటికి పైపులైన్ పనులు పూర్తి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ఎ.కొండూరు, ఆగస్టు 28 : ఎ.కొండూరు మండల గ్రామాల్లో భూగర్భ జలాల్లో మెటాలిక్ ఎలిమెంట్స్ వలన తాగు నీరు కలుషితమవుతోంది.. దీనికి శాశ్వత పరిష్కారంగా కృష్ణా జలాలు పైపులైన్ ద్వారా అందజేసే ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.. అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలోని 38 కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ఎక్కువగా నీరు కలుషితం అవుతున్నట్టు పరీక్షల ద్వారా నిర్ధారణ కావడంతో సత్వరం కృష్ణా జలాలు అందజేసేందుకు ప్రభుత్వం రూ.50 కోట్లతో పైపులైన్ పనులు శరవేగంగా వచ్చే మే, జూన్ నాటికి పూర్తి చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం మండలాల్లో నీటి పరీక్షలు, కిడ్నీ వ్యాధిపై సర్వే నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఎ.కొండూరు మండలంలో 216 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు, 25 మంది డయాలసిస్ రోగులు ఉన్నారని తెలిపారు. ఎ.కొండూరు పీహెచ్‌సీలో ఉచిత డయాలసీస్ కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, యూనిట్ పని తీరుపై కలెక్టర్ ఆరాతీశారు. అనంతరం దీప్లానగర్ తండాలో ప్రజల సమస్యలు, కిడ్నీ వ్యాధి పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరికి పింఛన్ రావడం లేదని, ట్యాంకర్లతో సరఫరా చేసే కృష్ణా జలాలు సక్రమంగా రావడంలేదని కలెక్టర్‌కు వివరించారు. ప్రజలు కిడ్నీ వ్యాధి, విష జర్వాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో కె.మాధవి, డీఎంహెచ్‌వో సుహాసిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, రమణ, డ్వామా పీడీ, జె.సునీత, ఎంపీడీవో శ్రీకృష్ణ పరమత్మ, సర్పంచ్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

మరో కిడ్నీ మరణం..



ఎ.కొండూరు : మండలంలోని గిరిజన తండాలో మరో కిడ్నీ మరణం నమోదైంది. వరుస మరణాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణారావుపాలెం శివారు గ్యామా తండాకు చెందిన అజ్మీర జావ్లా(65) గత పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అయినకాడికి అప్పులు చేసి విజయవాడ, తిరువూరులోని ప్రయివేటు అసుపత్రుల్లో చికిత్స పొందుతూ.. వ్యాధితీవ్రత పెరిగి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం నేతలు ఆనంద రావు, వెంకటేశ్వరావు తదితరులు డిమాండ్ చేశారు.


ఆర్గానిక్ కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఆదాయ అభివృద్ధే ధ్యేయం

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

అవనిగడ్డ, ఆగస్టు 28 : వికసిత్ ఆంధ్రప్రదేశ్ ద్వారా రాబోయే ఐదేళ్లలో వివిధ రంగాల ద్వారా వచ్చే దిగుబడులు, ఆదాయాన్ని 15 శాతం పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకుగానూ మండలాల వారీగా వివిధ శాఖల ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుని కార్యశాలలో చర్చించిన తర్వాతే ప్రణాళికలు పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. బుధవారం అవనిగడ్డలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్ రూపకల్పన కోసం నియోజకవర్గ స్థాయిలో కార్యశాల నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తో కలిసి మండలాల వారీగా తయారు చేసిన యాక్షన్ ప్లాన్‌ను పరిశీలించారు. వ్యవసాయం, ఆక్వా రంగాల్లో పురోభివృద్ధి సాధించేటమే ధ్యేయంగా పని చేస్తామని, వ్యవసాయ, అనుబంధ రంగాలైన పశుపోషణకు కూడా తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ అభినందనీయం : బుద్దప్రసాద్

వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్ తయారీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలను ముందుగా అందిపుచ్చుకోవటం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ఆర్గానిక్ పంటకు మార్కెటింగ్ సౌకర్యం, సర్టిఫికేషన్ కల్పించాలని ఈ సందర్భంగా రైతులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆక్వా సాగు అభివృద్ధి కోసం రైతులు పాత చెరువుల అభివృద్ధి, చెరువుల వద్దకు అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, సబ్సిడీ విద్యుత్, ఉప్పునీటిలో పెరిగే చేపల జాతుల సాగు ప్రోత్సహించాలని కోరారు. దీనిపై మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, కృష్ణా జిల్లాలో ఆక్వా సాగు గణనీయమైన వృద్ధి రేటు సాధిస్తుందని, రైతులకు సౌకర్యాలు కల్పించటం ద్వారా వారికి సాగులో లాభాలు పొందేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతి దేవి, పీపీవో గణేష్ కృష్ణ, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జీరో బేస్డ్ నేషనల్ ఫార్మింగ్ జిల్లా అధికారి పార్థసారధి, మార్కెఫెడ్ డిఎం మురళీ కిషోర్, ఎంపిడివో మరియ దేవి, తహసీల్దార్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో సాగు చేసిన కూరగాయల తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్

జడ్పీ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మోపిదేవి, ఆగస్టు 28 : కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మోపిదేవిలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, ఇంటి భోజనం తేడాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా నిబంధనల మేరకు భోజనం తయారుచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పలువురు విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చిన భోజనం చేస్తుండటాన్ని గమనించిన కలెక్టర్ వారిని ప్రశ్నించగా. ఆరోగ్యం బాగుండని కారణంగా కొద్ది రోజులు ఇంటి నుంచి తీసుకొస్తున్నట్టు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన నిర్వహణపై పలు సూచనలు చేశారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన అవసరం

పెరటి తోటల పెంపకం పట్ల విద్యార్థులు మరింత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. పాఠశాలలో రసాయన రహితంగా సాగుచేస్తున్న పెరటి తోటను ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. తోటల నిర్వహణ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రసాయన రహితంగా చేస్తున్న కూరగాయలను మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జయంతి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూలు, కూరగాయలను కలెక్టర్‌కు అందజేశారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్, స్వీపర్, ఆయాలకు ఐదు నెలలుగా వేతనాలు అందటం లేదంటూ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈవో తాహెరా సుల్తానా, ఏడీప పార్థసారధి, తహసీల్దార్ శ్రీవిద్య ఎంఈవో విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

వారసత్వ రగడ

(5వ పేజీ తరువాయి)

అలాగే, రఘురామ్, భవానీ ఇద్దరు కూడా రెగ్యులర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. గతంలో వీరిని ప్రభుత్వం ఉద్యోగంలో ఉంటారా, వారసత్వంలో ఉంటారా అని అడిగితే తాము ప్రభుత్వ ఉద్యోగంలోనే ఉంటామని చెప్పి మరీ కొనసాగుతున్నారు. తాజాగా వీరిని వారసత్వంలోకి తీసుకొచ్చారు.

- 1980లో లింగంభొట్ల బదరీనాథ్‌బాబు వంశపారంపర్య అర్చకుడిగా చేరారు. ఆయన కుమారుడు భవానీ ప్రసాద్ 2009లో సహాయకుడిగా చేరి రెగ్యులర్ అయ్యారు. దుర్గగుడి ఈవోగా సూర్యకుమారి ఉన్న సమయంలో జరిగిన తాంత్రిక పూజల్లో బదరీనాథ్, ఆయన కుమారుడు భవానీ, ఫణీంద్ర పాల్గొన్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరు మాంసం, మద్యం అమ్మవారికి నివేదన చేసినట్లుగా కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంలో బదరీనాథ్ బాబును సస్పెండ్ చేశారు. మిగతా ఇద్దరికి డ్యూటీలు మార్చారు. బదరీనాథ్‌బాబు కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకుని కొనసాగుతున్నారు. అయితే, ఈ కేసు ఇంకా పూర్తి కాలేదు. దోషులని తేలితే రెండేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉంది. కేసు నడుస్తున్న సమయంలో వారిని వంశపారంపర్య అర్చకులుగా ఎలా గుర్తిస్తారంటూ పలువురు అర్చకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అంతరాలయంలో పూజలు, తదితరాలు నిర్వహించేందుకు భవానీప్రసాద్, ఫణీంద్ర, రఘురామ్‌కు అవగాహన లేదన్నది పలువురు అర్చకుల వాదన. ఇంకొకవైపు అంతరాలయంలో అనేక కార్యక్రమాలున్నా.. వారసత్వ అర్చకులుగా వచ్చినవారు కేవలం పాదుకలు, కుంకుమ మాత్రమే ఇస్తామని చెప్పడంపైనా మిగిలిన అర్చకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయార్జన కోసమే వారంతా వారసత్వ అర్చకులుగా గుర్తింపు తెచ్చుకున్నారని విమర్శిస్తున్నారు.

రాజకీయ క్రీనీడ


స్టేడియంకు కేటాయించిన స్థలం ఇదే.. శిలాఫలకం (ఇన్‌సెట్‌లో)

- పాలకుల నిర్లక్ష్యంతో అటకెక్కిన ఆటస్థలం!
- బందరులో స్టేడియం నిర్మాణానికి అవరోధాలెన్నో..
- కొల్లు రవీంద్ర క్రీడా మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన
- స్టేడియం స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించిన వైసీపీ
- జిల్లా క్రీడాకారులకు కొరవడిన శిక్షణ

నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా..

(మచిలీపట్నం టౌన్)

2018 సంవత్సరంలో కొల్లు రవీంద్ర క్రీడాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గో సంఘం వద్ద రెండెకరాల స్థలంలో రూ. 13 కోట్ల వ్యయంతో 2018 జులై 24న స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఈతకొలను నిర్మించేందుకు గాను భారత క్రికెట్ జట్టు అప్పటి సారధి పద్మశ్రీ అనిల్ కుంబ్లేను తీసుకువచ్చారు. శంకుస్థాపనతో మచిలీపట్నంలో ఇండోర్ స్టేడియం వస్తుందని క్రీడాకారులు ఆశించారు.

వైసీపీ పాలనలో అకకెక్కిన ఆటస్థలం

ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని అటకెక్కించింది. అంతేకాకుండా ఆ స్థలంలో కొంత భాగాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి ఇతర ప్రయోజనాల కోసం కేటాయించింది. మరికొంత స్థలాన్ని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించేందుకు ప్రతిపాదించారు. ఈ దశలో స్టేడియం నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొల్లు రవీంద్ర కేటాయించిన భూమి తరిగిపోయింది. ఈ నేపథ్యంలో మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొల్లు రవీంద్ర దృష్టికి క్రీడాకారులు, యోగసాధకులు స్టేడియం నిర్మాణం విషయం తెచ్చారు. జిల్లా కలెక్టర్ బాలాజీతో దీనిపై చర్చించారు. కలెక్టర్ స్పందించి జాయింట్ కలెక్టర్‌తో విచారణ జరిపించాలని సూచించారు.

ప్రముఖ క్రీడాకారుడు పద్మశ్రీ సీకే నాయుడు పుట్టిన గడ్డపై క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లేకుండా పోయింది. విద్యతో పాటు యువత క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో స్టేడియం లేక క్రీడాకారులు ఆశించిన స్థాయికి ఎదగలేకపోతున్నారు. మచిలీపట్నంలో స్టేడియం నిర్మించాలన్న క్రీడాకారుల ఆశ అడియాశవుతూనే ఉంది.

అరకొర పనులతో సరి..

రెవెన్యూ కళ్యాణ మండపానికి దగ్గరలో రెండెకరాల స్థలంలో వైసీపీ ప్రభుత్వం రూ. 2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టింది. కోడ్ వస్తుందని ఆదరాబాదరగా ప్రారంభించారు. కాంట్రాక్టర్‌కు కేవలం రూ.85 లక్షలు మాత్రమే ఇచ్చారు. షటిల్ కోర్టులు నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో బీటలు వారుతున్నాయి. క్రీడా ప్రాంగణం వర్షం వస్తే ముంపునకు గురవుతోంది.

ఆటగాళ్ల ఆశలు చిగురించేనా..

నూతనంగా వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇండోర్ స్టేడియంను జాయింట్ కలెక్టర్ సందర్శించారు. నివేదికను కలెక్టర్ బాలాజీకి అందచేశారు. కొల్లు రవీంద్ర తిరిగి మంత్రి అయిన కొద్ది రోజుల్లోనే క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించడంతో క్రీడాకారులు ఆశయాలు నెరవేరతాయని ఆశిస్తున్నారు. స్పోర్ట్స్ అకాడమీ సాయంతో మచిలీపట్నం, నాగాయలంకలో క్రీడా సముదాయాలు నిర్మిస్తే క్రీడాకారులు ఆశించిన విధంగా చేయూతలభిస్తుంది. ఇందుకు మంత్రి రవీంద్రతో పాటు ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ బాలాజీలు దృష్టి సారించాల్సి ఉంది. జిల్లా పరిషత్ సెంటర్‌లోని ఈతకొలను పక్కన ఉన్న క్రీడా ప్రాంగణం వర్షం వస్తే ముంపునకు గురవుతోంది. ఈ క్రీడా ప్రాంగణాన్ని మెరక చేయాల్సి ఉంది. క్రీడాకారులకు కావలసిన పరికరాలను కొనుగోలు చేయవలసి ఉంది. కోచ్‌ల సాయంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపుతూ క్రీడాకారులను ప్రోత్సహించవలసి ఉంది.

క్రీడాకారుల స్టేడియం కల కార్యరూపం దాల్చాలి



- తోట అజయ్‌కుమార్
వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ నాయకుడు

మచిలీపట్నంలో స్టేడియం ఏర్పాటు చేయాలని చాలా కాలంగా వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు కోరుతూనే ఉన్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న కొల్లు రవీంద్ర గతంలో క్రీడాశాఖ మంత్రిగా పనిచేశారు. మచిలీపట్నంలో దాతల సహకారంతో స్టేడియం నిర్మించాలని కోరుతున్నాం. స్టేడియం నిర్మిస్తే నైపుణ్యం, ప్రతిభ గల క్రీడాకారులు ఎందరో రాణించగలుగుతారు.

హక్కుల పరిరక్షణ బాధ్యత కమిషన్‌దే

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్

గవర్నర్‌పేట, ఆగస్టు 28 : సెక్స్ వర్కర్ల పిల్లల హక్కుల రక్షణ బాధ్యత రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌దేనని, వారి పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు నివారించడం కోసం కమిషన్‌తో కలిసి ద్విముఖ వ్యూహం రూపొందించి అమలు చేస్తుందని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ఎంజీ రోడ్డులోని హోటల్‌లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో వేశ్యవృత్తిలోని మహిళల పిల్లల విద్య, వారి దుర్భరత్వంపై నిర్వహించిన స్టడీ రిపోర్టును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టడీ నివేదిక ద్వారా వెలుగులోకి వచ్చిన సమస్యల ఆధారంగా తమ తల్లి వద్ద ఉంటున్న పిల్లలకు, ఇప్పుడే పుట్టిన పిల్లలకు వారిని ఉద్దేశించే కార్యక్రమాలు రూపొందించాలని, 15 సంవత్సరాలు దాటిన పిల్లలకు జీవన నైపుణ్యాలు, వృత్తి విద్యా శిక్షణ అందించి స్వతంత్రంగా బతికే వరకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్వహిస్తున్న టార్గెట్ ఇంటర్వెన్షన్‌లో సెక్స్ వర్కర్లు, వారి పిల్లలకు కూడా విద్య, మెంటల్ హెల్త్, న్యూట్రీషన్, బాలల అభివృద్ధి అంశాలు జోడించి నూతన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నాగార్జున యూనివర్శిటీ సోషల్ వర్క్ ప్రొఫెసర్ సరస్వతీ రాజు అయ్యర్ స్టడీ అంశాలను వివరించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నోడల్ ఆఫీసర్ ఎం.సోమశేఖర్, హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామ్మోహన్, ప్రోగ్రామ్ మేనేజర్ వి.భాస్కర్ పాల్గొన్నారు.


స్టడీ రిపోర్టు విడుదల చేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యులు

చల్లపల్లిలో కేంద్ర బృందం పర్యటన

- జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

చల్లపల్లి/అవనిగడ్డ రూరల్, ఆగస్టు 28 : జలజీవన్, స్వచ్ఛభారత్ మిషన్ పనులను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున నేషనల్ వాటర్ ఎక్స్‌పర్ట్(ఎన్‌డబ్ల్యూఈ) బృంద సభ్యులు సుధీర్‌కుమార్, కె.రాఘవేంద్రరావులు అధికారుల బృందంతో కలిసి బుధవారం చల్లపల్లిలో పర్యటించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు. తాగునీటి లభ్యత, అవసరాలు, వాటర్ టెస్టింగ్, జేజేఎం పనులపై చర్చించారు. సంపద తయారీ కేంద్రంలో వర్మికంపోస్ట్ తయారీని పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వినియోగిస్తున్నారో లేదో పరిశీలన చేశారు. స్వచ్ఛ చల్లపల్లి ఆధ్వర్యంలో 'మన కోసం మనం' ట్రస్ట్ నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను చూశారు. భూగర్భ డ్రెయినేజీలను పరిశీలించారు. గ్రామంలో మరొక ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, రెండు డైరెక్ట్ పంపింగ్ హౌస్‌లు అవసరమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. కేంద్ర బృంద సభ్యులకు సర్పంచ్ కృష్ణకుమారి, కార్యదర్శి పివి.మాధవేంద్రరావులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పి.సత్యనారాయణ, ఏఈ జగత్, జేజేఎం బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మంగళాపురం గ్రామంలోనూ బృంద సభ్యులు పర్యటించగా, గ్రామంలో తాగునీటి అవసరాల కోసం కేటాయించిన చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించి తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మోదుమూడి గ్రామంలో బుధవారం సాయంత్రం కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా శానిటేషన్, తాగునీటికి చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు సూచించారు.


చల్లపల్లిలో కేంద్ర బృందానికి వివరాలు తెలియజేస్తున్న సర్పంచ్, ఈవోలు

మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గంపై అధ్యయనం

- ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంతోకాలంగా జిల్లాప్రజల చిరకాల కోరికగా ఉన్న మచిలీపట్నం-రేపల్లె మధ్య రైలుమార్గం నిర్మాణంపై అధ్యయనం చేయనున్నట్టు కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్వినీవైష్ణవ్ అంగీకరించారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైలుమార్గం నిర్మాణం చేయాలని గతంలో పలుమార్లు రైల్వేశాఖమంత్రికి వినతి పత్రాలు అందజేసినట్టు ఎంపీ తెలిపారు. ఈనెల 26వ తేదీన కేంద్రమంత్రిని మరోసారి కలిసి మచిలీపట్నం-రేపల్లె మధ్య రైలుమార్గం నిర్మాణం చేస్తే ఒనగూరే ప్రయోజనాలను, తీరప్రాంతం వెంబడి ఉత్పత్తి అయ్యే రొయ్యలు, చేపలను ఇతర రాష్ట్రాలకు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఎగుమతులు చేసే అవకాశం ఉందని వివరించడం జరిగిందన్నారు. బందరుపోర్టు నిర్మాణం పూర్తయితే వివిధ ప్రాంతాలకు సరుకుల ఎగుమతులను తక్కువ ఖర్చుతో చేసేందుకు అవకాశం ఉందని కూడా తెలియజేసినట్టు ఎంపీ తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర రైల్వేశాఖమంత్రి కార్యాలయం నుంచి రైలుమార్గం నిర్మాణం కోసం అవసరమైన వనరులను సమకూరుస్తామని లేఖరాసినట్టు ఎంపీ తెలిపారు.

ఎంపీపీపై రాజీనామాకు ఒత్తిడి!

- కుదరదని తేల్చి చెప్పిన ఎంపీపీ
- మండల వైసీపీ నేతల అవాక్కు.


పదవీకాలం పూర్తయిన రాజామణి


పదవి కోసం చూస్తున్న మధుబాబు

తోట్లవల్లూరు : పదవికి రాజీనామా చేయాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణిని మండల వైసీపీ నేతలు ఒత్తిడి చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి నడకుదురు రాజేంద్ర బుధవారం ఎంపీపీ రాజామణితో సమావేశమయ్యారు. రాజీనామా చేస్తే మిగతా పదవీ కాలాన్ని పెనమకూరు ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివ మధుబాబుకి ఇస్తామని రాజామణికి వారు చెప్పారు. నేతల ప్రతిపాదనను ఎంపీపీ తిరస్కరించారు. 2021లో పదవి ఇచ్చేటప్పుడు పెట్టిన షరతుకు కట్టుబడాలని రామ్మోహన్‌రెడ్డి ఎంపీపీకి సూచించారు. అయినా ఎంపీపీ అంగీకరించకపోవటంతో వైసీపీ నేతల గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. ఏంచేయాలో తెలియక మరొకసారి ఆలోచించుకుని చెప్పమని నేతలిద్దరు వెళ్లిపోయారు. తోట్లవల్లూరు ఎంపీపీ పదవి జనరల్ కేటగిరి(ఓసీ)కి రిజర్వు అయింది. అయితే నాటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఓసీలను పక్కనపెట్టి గరికపర్రుకు చెందిన నడకుదురు రాజేంద్ర(ఎస్సీ)ను ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో రాజేంద్ర ఎంపీటీసీగా ఓటమి చెందారు. అయినప్పటికీ రాజేంద్ర చక్రం తిప్పి కైలే అనిల్‌కుమార్‌ని ఒప్పించి నార్తువల్లూరు ఎంపీటీసీగా గెలుపొందిన ఈడ్పుగంటి రాజామణి(ఎస్సీ)కి ఎంపీపీ పదవిని ఇచ్చారు. అయితే రాజామణి పదవి చేపట్టి రెండున్నరేళ్లు పూర్తవటంతో నాటి ఒప్పందం ప్రకారం బీసీనైన తనకు ఎంపీపీ పదవి ఇవ్వాలని మరీదు శివ మధుబాబు నేతలపై తీవ్ర వత్తిడి తెస్తున్నట్టు సమాచారం. కాని నేతల ప్రయత్నాలు ఫలించే అవకాశం లేదు. ఎంపీపీ పదవి అంశం మండల వైసీపీలో ఎలాంటి మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

మచిలీపట్నంలో మూడు ఎఫ్‌ఎం స్టేషన్లకు అనుమతులు

మచిలీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ప్రైవేటుగా మూడు ఎఫ్ఎం రేడియోకేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం అనుమతులు మజూరుచేసింది. ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. పట్టణప్రాంతాలలో మాతృభాషలో నడిచే ఎఫ్ఎం రేడియోకేంద్రాలను వేలంపాట ద్వారా కేటాయించనున్నారు. ఎఫ్ఎం రేడియో కేంద్రాలద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వీటికి అనుమతులు ఇచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో విజయవాడలోనే ఎఫ్ఎం రేడియో కేంద్రం ఉంది. ఒకే విడతలో మచిలీపట్నంలో ప్రైవేటుగా మూడు ఎఫ్ఎం రేడియోకేంద్రాలను ఏర్పాటుచేసేందుకు కేంద్రప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

నగరంలో జాబ్‌మేళా రేపు

వన్‌టౌన్, ఆగస్టు 28 : హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 30న శుక్రవారం నగరంలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు ముస్లిం మైనార్టీ నేత ఫారూక్ షుబ్లీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో నారా లోకేశ్ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పారన్నారు. ఈ క్రమంలో హెచ్‌సీఎల్ జాబ్‌మేళాను యువత సద్వినియోగ పరచుకోవాలన్నారు. నాన్ ఎంపీసీ ఇంటర్ పూర్తి చేసుకుని 75 శాతం మార్కులు సాధించిన వారికి వెంటనే నియామకాలు అందజేస్తారని తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో కూడా ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువతి మృతి



ఇబ్రహీంపట్నం: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై గుంటుపల్లి డాన్‌బోస్కో స్కూల్ ఎదుట స్కూటీని టిప్పర్ ఢీ కొన్న ఘటనలో స్కూటీపై వెళుతున్న యువతి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటుపల్లి గ్రామానికి చెందిన మావిళ్ల జోషిత (22) విజయవాడ నలందలో ఫైనల్ ఇయర్ డిగ్రీ చదువుతోంది. బుధవారం రాత్రి ఇబ్రహీంపట్నం వైపు స్కూటీపై వెళుతున్న ఆమెను వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమైన అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తోబుట్టువుపై గొడ్డలితో దాడి

ఇబ్రహీంపట్నం : చెల్లిపై మద్యం మత్తులో అన్న దాడికి పాల్పడిన ఘటన బుధవారం కొండపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లా రోడ్డు సెంటర్ సమీపంలో స్వర్గం ఫ్యామిలీ రెస్టారెంట్ పక్కనే వెంకట్రావ్, నాగమల్లేశ్వరి అన్నా, చెల్లెళ్లు సొంతింటిలో వేరు వేరు గదుల్లో ఉంటున్నారు. వివాహం కాని చెల్లిని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని అన్న పలుమార్లు గొడవ పడేవాడు. ఈ క్రమంలో పూటుగా మద్యం సేవించి వచ్చి చెల్లితో గొడవకు దిగి విచక్షణా రహితంగా గొడ్డలితో ఆమె వీపుపై నరికాడు. తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆమెను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై ఎస్.పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.20

ఆటో డ్రైవర్ల ఉపాధిపై పోలీసుల దెబ్బ : సీఐటీయూ

గవర్నర్‌పేట, ఆగస్టు 28 : ఆటో డ్రైవర్లపై ఎడాపెడా ఫైన్లు విధిస్తూ వారి స్వయం ఉపాధిని ఆర్టీఏ, పోలీసు విభాగాలు దెబ్బ తీస్తున్నాయని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీశ్రీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దీనిపై సీపీని కలిశామని, ఎడాపెడా ఫైన్లు వేయడం ఆపాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామని సీపీ హామీ ఇచ్చారని తెలిపారు.



వికసిత్ ఆంధ్రప్రదేశ్ వర్క్‌షాప్

అజిత్‌సింగ్‌నగర్ : ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టాలనే లక్ష్యంతో వికసిత్ ఆంధ్ర 2047 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖ గౌరవ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ అన్నారు. నగరంలోని ఎనికేపాడు వద్దనున్న బీవీ.రావు కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి వికసిత్ ఆంధ్ర 2047 పేరుతో బుధవారం శిక్షణ, వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, దామోదరనాయుడు, వై.సింహాచలం పాల్గొన్నారు.

రెల్లీస్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

లబ్బీపేట, ఆగస్టు 28 : రెల్లీస్ కాలనీలోని సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బుధవారం 19వ డివిజన్ రెల్లీస్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న గోడను, పోలీస్ క్వార్టర్స్‌లోని రామాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ కాలనీలో రెల్లీస్ కాలనీ పేరుతో చాలామంది ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న గోడ పక్కకు వరిగి ప్రమాదకరంగా ఉందని, ఆర్డీవో, డీసీసీలతో మాట్లాడి సంయుక్తంగా పరిశీలించామని, గోడ పడితే ఎన్నో కుటుంబాలకు నష్టం జరుగుతుందని అన్నారు. ఆయా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గోడను తొలగించి కాలనీ వాసులకు భద్రత కల్పిస్తామని తెలిపారు.



రెల్లీస్ కాలనీలో ప్రమాకరంగా ఉన్న గోడను పరిశీలిస్తున్న గద్దె రామోహన్, పలు శాఖల అధికారులు

ముగిసిన కాస్మో క్రూయజ్ ప్రదర్శన

వన్‌టౌన్, ఆగస్టు 28 : వన్‌టౌన్ కేబీఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు రోజుల కాస్మో క్రూయజ్ ప్రదర్శన బుధవారం ముగిసింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాధించిన విజయాలను తెలియజేసే నమూనాలను ఇస్రో నుంచి తీసుకువచ్చి ఇక్కడ ప్రదర్శించారు. ఇస్రో సిబ్బంది వాటిపై వివరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 90 విద్యాసంస్థల నుంచి 11 వేల మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించినట్లు కాలేజీ యాజమాన్యం తెలిపింది. హిందూ హైస్కూల్స్ విద్యాసంస్థల పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణ రావు మాట్లాడుతూ, ప్రదర్శన విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ విధమైన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కేబీఎన్‌లో ఏర్పాటు చేసిన కాస్మో క్రూయజ్ ప్రదర్శనను చూసేందుకు తరలివచ్చిన విద్యార్థులు

బ్రాహ్మణుల సమస్యకు ముందడుగు

● దేవదాయ శాఖ సమీక్షపై బ్రాహ్మణ సాధికారత రాష్ట్ర కమిటీ హర్షం

లబ్బీపేట, ఆగస్టు 28 : దేవదాయ శాఖ సమీక్ష బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ముందడుగు అని బ్రాహ్మణ సాధికారత కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చి రామ్‌ప్రసాద్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా వెంకటగిరిలో టీడీపీ యువనేత, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ బ్రహ్మణులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ఒక హోటల్ బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బ్రాహ్మణ సాధికారత కమిటీ సంఘం నాయకులు సత్యవాడ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విగ్రహాల ధ్వంసం, రథం కాలిపోవడం, వెండి సింహాల దొంగతనం, పురోహితులపై దాడులు, దేవస్థానాల భూముల అన్యాక్రాంతం తదితర సంఘటనలపై ఒక ప్రత్యేక కమిటీ వేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్



టీఎంహెచ్ హైస్కూల్ 1994-95 బ్యాచ్ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిట్టినగర్, ఆగస్టు 28 : టేనర్ మెమోరియల్ హైస్కూల్ 1994-95 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం చిట్టినగర్ ఎస్వీ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. 29 ఏళ్ల తరువాత స్నేహితులు ఒకరినొకరు కలుసుకొని భావోద్వేగానికి గురయ్యారు. కొంతమంది విద్యార్థులు తమతో లేకపోవడాన్ని తలుచుకొని బాధను వ్యక్తం చేశారు. విద్యార్థులంతా తమ ఆటపాటలతో చిన్నతనాన్ని గుర్తు చేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాదాసి వెంకన్న, రేమల్లి కిషోర్ కుమార్, రాచర్ల ప్రకాష్, రేడపొంగు చంద్రశేఖర్, చెవుల మరళి, గాలి విజయ్ కుమార్, పాతర్ల విజయ, పలిశెట్టి సాయి లక్ష్మి తదితరులు ఉన్నారు.

వైద్యం కోసం రూ.10 వేల ఆర్థిక సాయం

● అందజేసిన గద్దె క్రాంతికుమార్

పటమట, ఆగస్టు 28 : రాణిగారి తోట 18వ డివిజన్‌కు చెందిన ఓర్సు రమణమ్మ కుమారుడు ఓర్సు చరణ్‌తేజ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని సొంత నిధులతో బుధవారం అందజేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని అశోక్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో రమణమ్మకు క్రాంతికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఓర్సు చరణ్ పరిస్థితిని క్రాంతికుమార్‌కు వివరించగా వెంటనే స్పందించి ఆయనకు రూ.10వేలు వైద్య ఖర్చులకు అందజేశారు.



ఆర్థిక సాయం అందిస్తున్న గద్దె క్రాంతికుమార్

వైద్య కేంద్రానికి ఏసీల బహూకరణ

భారతీనగర్, ఆగస్టు 28 : ఏపీఐఐసీ కాలనీలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఆయుష్మాన్ భవ వైద్య కేంద్రంలో వైద్యులకు, ప్రజలకు ఉపయోగపడేందుకు లక్ష రూపాయలతో కొనుగోలు చేసిన రెండు ఏసీలను బుధవారం టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ప్రారంభించారు. గద్దె క్రాంతికుమార్ రూ.50వేలు, ఆలిండియా మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోలవరపు ఫణిధర్ రూ.50 వేలుతో రెండు ఏసీలను కొనుగోలు చేసి ఆయుష్మాన్ భవ వైద్య కేంద్రానికి ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గద్దె రమేష్, యలమంచలి పండు, యలమంచలి రాజా, చలసాని వాసు, తుమ్మల వెంకట్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, ఆగస్టు 28 : సూర్యారావుపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా దుర్గా అగ్రహారం కాలువగట్టు, సీతారామపురం వీఎంసీ డ్రైనేజీ వర్క్‌షాపు, కొత్తవంతెన రోడ్డు, జనతా ప్రెస్ రోడ్డు, కాట్రగడ్డవారి వీధి, అంకమ్మ తల్లి టెంపుల్ ఏరియా, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, జగడం వీధి, ఏలూరు రోడ్డు, వీరాంజనేయ స్వామి టెంపుల్ వీధి, డోర్నకల్ రోడ్డు, గోరా వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కబేళా విద్యుత్ కేంద్రం పరిధిలో..

భవానీపురం : కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ లలితానగర్ విద్యుత్ లైన్ మరమత్తుల కారణంగా ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జోజినగర్, లలితానగర్, నూరి మసీద్‌రోడ్డు, రైతు బజార్, రేపాకు వారి వీధి, టెలిఫోన్స్ కాలనీ, పోలీస్ కాలనీ, నేతాజీ స్కూల్ రోడ్డు బట్టల తాతయ్య వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విజయవాడ విద్యుత్ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేన్సర్ పై అవగాహన సదస్సు

భారతీనగర్ : ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, డిపార్టుమెంట్ ఆఫ్ మైక్రో బయాలజీ, సుహాస్తి ఎన్జీవో సంయుక్తంగా ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి సమక్షంలో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కినేని హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ మనీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది ప్రజలు కేన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. వారిలో సగానికిపైగా రోగులు చివరికి మరణిస్తున్నారన్నారు. ఆధునిక జీవన శైలి వల్ల మహిళల్లో రొమ్ము కేన్సర్ ఏటా పెరుగుతుండడం ఆందోళన కలిగించిందని అన్నారు. వివిధ నిర్ధారణ పరీక్షలు అయిన బయాప్సీ, పీటీ స్కాన్ ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పార్వతీ దేవి, కళాశాల తెలుగు విభాగం అధ్యాపకురాలు శాంతి కుమారి, అరుణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్టెల్లా కళాశాలలో 400 మందికి ఉచిత వైద్యం

పటమట, ఆగస్టు 28 : మారిస్ స్టెల్లా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో రోహన్ డెంటల్ హాస్పిటల్, సంధ్య ఐ హాస్పిటల్ సంయుక్తగా ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించాయి. ఈ క్యాంప్‌లో వైద్యులు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. దంత సంరక్షణ, చికిత్స, కంటి శుక్లాల ఆపరేషన్ పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో కళాశాల యాజమాన్యం సిస్టర్ లీనా క్వాడ్రస్, సిస్టర్ కులరేఖ, డాక్టర్లు శ్రీరామ్, సంజయ్, కృష్ణ, ఎండీ భార్గవరామ్, ఉషాకుమారి, డాక్టర్ సిస్టర్ ఇన్నాసియా, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీనివాసరావు, హరిక, 200 మంది వలంటీర్లు పాల్గొన్నారు.



విద్యార్థినికి దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'నిమ్రా' ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్

వన్‌టౌన్, ఆగస్టు 28 : పంజా సెంటర్‌లో నిమ్రా మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. నిమ్రా విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ సకిబ్ రసూల్‌ఖాన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తూ స్థానిక ప్రజానీకానికి వైద్య సేవలు అందించేందుకు హెల్త్ సెంటర్ నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. సంస్థ సీఈవో డాక్టర్ విశ్వచరణ్ మాట్లాడుతూ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ శ్యామలాదేవి, డైరెక్టర్ డాక్టర్ ఎస్ బాబూలాల్, చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ పి.ప్రసాద్, వివిధ విభాగాల నిపుణులు డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ విజయశేఖర్ పాల్గొన్నారు.



నేత్రదానం ప్రతి ఒక్కరి బాధ్యత

● జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో శ్రీనివాసరావు

పటమట, ఆగస్టు 28 : నేత్రదానం ప్రతి ఒక్కరి బాధ్యత అని దేశంలోని నల్లగుడ్డు అంధత్వం ఉన్న వారికి చూపును ప్రసాదించి వారికి నూతన జీవితాన్ని అందించటంలో ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో యు. శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలోని నేత్రదాన ప్రచార పక్షోత్సవాల సందర్భంగా నాస్తిక కేంద్రంలో ఏర్పాటు చేసిన నేత్రదాన ప్రదర్శనశాలను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో రకరకాల మూఢ నమ్మకాలు, అపోహలు, నిర్లిప్తత కారణంగా నేత్రదానం చేసే వారు చాలా తక్కువ సంఖ్యలో ఉంటున్నారని తెలిపారు. స్వేచ్ఛా గోరా ఐబ్యాంక్ దాదాపు 900 మందికి చూపును ప్రసాదించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ ప్రదర్శన సెప్టెంబరు 9వ తేదీ వరకు ఉంటుందని ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.సమరం తెలిపారు. గురువారం నుంచి నేత్రదానంపై వ్యాసరచన, చిత్రలేఖనం, పాటలు, క్విజ్, స్లోగన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.




నేత్రదాన ప్రదర్శనశాలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, డాక్టర్ సమరం

దుర్గగుడిలో అన్నదానానికి విరాళం

వన్‌టౌన్, ఆగస్టు 28 : దుర్గగుడిలో జరుగుతున్న అన్నదానానికి విజయవాడ బ్యాంక్ కాలనీ శ్రీనివాసనగర్‌కు చెందిన ఎస్.ప్రసాద్‌రెడ్డి బుధవారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,121 చెక్కు రూపంలో విరాళం ఇచ్చారు.

● కేశఖండనశాల నిర్మాణ ప్లాన్ పరిశీలన



కేశఖండనశాల నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

దుర్గాఘాట్ వద్ద దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నిర్మించే కేశఖండన శాల ప్లాన్‌నూ, సబ్‌వే నిర్మించే ప్లాన్‌నూ బుధవారం దేవదాయశాఖ కమిషనర్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఆలయ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, దేవదాయ శాఖ ఎస్టేట్స్ ఆర్జేసీ అజాద్, ఈఈ గంగయ్య ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, డీఈ రవీంద్ర ఏఈఈ మస్తానయ్య పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సరుకుల పంపిణీ

పాతరాజరాజేశ్వరి పేట, ఆగస్టు 28 : తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా పేదలకు సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందని టీడీపీ యువత రాష్ట్ర నాయకులు ధనేకుల వెంకట హరికృష్ణ అన్నారు. స్థానిక 55వ డివిజన్ కంసాలిపేటలో ధనేకుల వెంకట హరికృష్ణ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు డివి హరికృష్ణ అందజేశారు. ఏటా తన పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ యువత నాయకుడు ధనేకుల హరికృష్ణ



శ్రమకావ్యం ఆవిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాంస్కృతిక సంఘాల నేతలు

రేపు అశోక్ తేజ శ్రమకావ్యం ఆవిష్కరణ

గవర్నర్‌పేట, ఆగస్టు 28 : సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ కష్టజీవుల ఐక్యత, సంపద సృష్టించే వర్గం కోసం రచించిన శ్రమకావ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు ఎంబీవీకే ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం జరిగింది. నారాయణరావు మాట్లాడుతూ జాతీయ అవార్డు గ్రహీత అశోక్ తేజ తన పాటలతో, వచనంతో ప్రసంగిస్తారని తెలిపారు. ఛాందస భావాలకు వ్యతిరేకంగా అభ్యుదయ భావజాలాన్ని సృష్టించే అద్భుత కావ్యం శ్రమకావ్యం అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక వేదిక గౌరవాధ్యక్షుడు అరసవిల్లి గిరిధర్, అధ్యక్షుడు ఏ. సునీల్‌కుమార్, అరసం నాయకులు పరుచూరి అజయ్, కళాకారులు బి.నరేన్, కార్మిక సంఘ నేత రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి

అడ్మిషన్స్



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్‌ఆర్‌ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్ఆర్ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా- పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

ఏసీఎస్ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

- మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions

రిమైండర్

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** సెప్టెంబరు 2న
- **ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** సెప్టెంబరు 5
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AxmEvBlలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

హీరోగా మారిన విలన్ కథ ఇది




నేను 'మగధీర' చిత్రానికి కో డైరెక్టర్‌గా పని చేశా. ఆ సమయంలోనే దేవ్ గిల్‌తో పరిచయం ఏర్పడింది. దేవ్ ఈ సినిమా ప్రపోజల్‌తో వచ్చాడు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అన్నారు దర్శకుడు త్రికోటి. దేవ్ గిల్ హీరోగా నటించిన 'అహో విక్రమార్క' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నెల 30న ఆ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో దేవ్ గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ అనీ, మదర్ సెంటిమెంట్ కూడా ఉందనీ ఆయన తెలిపారు.

రచయిత నరసింగరావు కన్నుమూత



కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబి', రామ్‌గోపాల్ వర్మ 'అనగనగా ఒకరోజు' లాంటి పలు హిట్ చిత్రాలకు మాటల రచయితగా పనిచేసిన నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కౌంట్‌డౌన్ మొదలు



ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పుష్ప 2 ది రూల్' చిత్రం విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. మరో వంద రోజుల్లో అంటే డిసెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ పేర్కొంటూ పోస్టర్ విడుదల చేశారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరో వైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంతో జరుగుతున్నాయి. 'కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా 'పుష్ప 2' అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. మీరు ఎంత ఎక్స్‌పెక్ట్ చేసినా అంతకు మించి 'తగ్గేదేలే' అనిపించే రీతిలో సినిమా ఉంటుంది' అని దర్శకనిర్మాతలు చెప్పారు. దేవిశ్రీప్రసాద్ పాటలు అలరిస్తాయని తెలిపారు.

అందరి పేర్లు బయటపెట్టాలి



మలయాళ చిత్ర ప్రముఖులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్ఈఎఫ్‌కేఏ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ) దర్శకుల సంఘం ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. జస్టిస్ హేమ కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడిన అందరి పేర్లను బయట పెట్టాలంటూ ఎఫ్ఈఎఫ్‌కేఏ దర్శకుల సంఘం డిమాండ్ చేసింది. "ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువ మాట్లాడాలనుకోవడం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ అందరి పేర్లు బయటకి రావాలి. దోషులకు కఠిన శిక్ష పడాలి. నిందితులలో మా సంఘం సభ్యులున్నా.. మేం కలుగజేసుకోం" అని పేర్కొంది.

సిద్ధిఖీపై కేసు

మలయాళ నటుడు సిద్ధిఖీపై నటి రేవతి సంపత్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. అలాగే, బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు ఇండస్ట్రీలో మరీ ఎక్కువ

నటి షకీలా తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "లైంగిక వేధింపులు కేవలం మలయాళ చిత్రసీమలోనే కాదు.. తమిళ ఇండస్ట్రీలోనూ ఉన్నాయి. తెలుగు ఇండస్ట్రీలో అయితే మరీ ఎక్కువగా ఉన్నాయి. అడ్జస్ట్‌మెంట్లు, కమిట్‌మెంట్ల గురించి మేనేజర్లు ముందే అడుగుతారు" అని ఆరోపించారు.

నోరు విప్పితే ట్రబుల్‌మేకర్స్ ముద్ర

హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వర భాస్కర్. "హేమ కమిటీలో వెలువడిన చీకటి వాస్తవాలు చూసి షాకయ్యా. బాధితులు ఎవరైనా ఏ విషయంపై అయినా నోరు తెరచి మాట్లాడితే వారిని ట్రబుల్‌మేకర్స్‌గా ముద్ర వేస్తారు" అని స్వర భాస్కర్ పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలోనూ మహిళలు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొంటున్నారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అన్నారు. వేధింపులను వెలుగులోకి తెచ్చేందుకు హేమ కమిటీ రిపోర్ట్ ఉపయోగపడిందన్నారు. ఈ నివేదిక మనలో మార్పు తీసుకురావాలి అని ఆమె ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్

గన్నూ.. గర్ల్!



శ్రీ సింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'మత్తు వదలరా' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. రితీశ్ రానా దర్శకత్వంలో చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్ర పోషిస్తున్నారు. గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఫరియా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సునీల్, వెన్నెల కిశోర్, అజయ్, రోహిణి తదితరులు నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది.

సెప్టెంబర్‌లో జిగేల్



త్రిగుణ్, మేఘనా చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సెప్టెంబర్‌లో 'జిగేల్' చిత్రాన్ని విడుదల చేస్తాం. యువతను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది' అని నిర్మాతలు చెప్పారు. రఘుబాబు, పృథ్వీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఆనంద్ మంత్ర

నీలి మేఘములలో...



రానా దగ్గుబాటి సమర్పణలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం సెప్టెంబర్ 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. లీడ్ పెయిర్ జర్నీని అందంగా ఆవిష్కరిస్తూ భరద్వాజ్ గాలి రాసిన 'నీలి మేఘములలో' పాటను బుధవారం విడుదల చేశారు. వివేక్ సాగర్ ఈ గీతానికి స్వరాలు అందించారు.

ప్రేమికుడి వీక్షణం



యువ కథానాయకుడు రామ్ కార్తీక్ హీరోగా, కశ్వి హీరోయిన్‌గా నటించిన 'వీక్షణం' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం సిద్ శ్రీరామ్ పాడిన 'ఎన్నెన్నో' పాటను విడుదల చేశారు. ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసుని ఆవిష్కరించే ఈ పాటను రెహ్మాన్ రాయగా, సమర్థ్ గొల్లపూడి స్వరాలు సమకూర్చారు.

సాధనకు దీక్ష అవసరం



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటించిన ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం.' అని కోరారు. ఒక మంచి సినిమాలో అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో, హీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 29 ఆగస్టు 2024

మీ పిల్లలు బాగా చదువుకోవాలా?

సాధారణంగా తల్లితండ్రుల దృష్టంతా పిల్లల చదువుపైనే ఉంటుంది. పిల్లలు బాగా చదువుకోవాలంటే వారికి తగిన వాతావరణం కల్పించాలంటున్నారు మానసిక నిపుణులు. పిల్లలకు తల్లితండ్రులు ఇవ్వాల్సిన సలహాలేమిటో చూద్దాం..

సరిహద్దులు నిర్మించండి..

చాలా మంది పిల్లలకు చదువుకొనే సమయంలో ఏకాగ్రత కోల్పోతూ ఉంటారు. ఫోన్ చూసుకోవటం.. టీవీ చూడటం.. గేమ్స్ ఆడుకోవటం వంటి పనులు చేస్తూ ఉంటారు. అందువల్ల పిల్లలకు- చదువుకోవటానికి.. ఖాళీ సమయంలో ఇతర పనులు చేయటానికి మధ్య ఉన్న తేడాను వివరించాలి. ప్రతి రోజూ ఈ రెండు పనులను వేర్వేరుగా సమయాన్ని కేటాయించుకొమ్మని సలహా ఇవ్వాలి. అప్పుడు వారికి స్పష్టత రావటంతో పాటుగా సమయ పాలన కూడా అలవాటు అవుతుంది.

అలవాటైన ప్రదేశం..

ఇంట్లో పిల్లలు చదువుకోవటానికి ఒక ప్రదేశాన్ని నిర్దేశించండి. వారిని ప్రతి రోజూ ఆ ప్రదేశంలోనే కూర్చుని చదవమని సలహా ఇవ్వండి. ఒక సారి వారికి ఆ ప్రదేశంలో కూర్చుని చదవటం అలవాటు అయితే ఏకాగ్రతతో చదవగలుగుతారు.



ప్రాధమ్యాలు..

చాలా మంది పిల్లలకు కొన్ని పాఠాలు ఆసక్తికరంగా ఉంటాయి. కొన్నింటిపై దృష్టి పెట్టరు. అందువల్ల ఏఏ పాఠాలు ముఖ్యమైనవో ముందే గుర్తించి వాటిని చదవమని సలహా ఇవ్వండి. దీని వల్ల వారికి పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చే అవకాశముంటుంది.

టెక్నిక్స్ ఫలిస్తాయి..

చాలా మంది ఎక్కువ సేపు కూర్చుని చదివితే ఏకాగ్రతతో చదివినట్లు అనుకుంటారు. కానీ ఏకాగ్రతతో చదవటమంటే పూర్తి దృష్టిని కేంద్రీకరించటం. సాధారణంగా పిల్లలు 25 నిమిషాలకు మించి ఏకాగ్రతతో చదవలేరు. ఆ తర్వాత ఒక ఐదు నిమిషాలు బ్రేక్ తీసుకొని మళ్లీ చదివితే పాఠాలు త్వరగా అర్థమవుతాయి. ఇలాంటి టెక్నిక్స్‌ను పాటించటం వల్ల ఎక్కువ ఫలితాలుంటాయి.

ధ్యానం.. యోగా

రోజుకు కనీసం ఒక అరగంట యోగా.. ధ్యానం చేయమని ప్రోత్సహించండి. దీని వల్ల పిల్లలు చురుకుగా తయారవుతారు. ఏకాగ్రత కూడా పెరుగుతుంది.

వాస్తవిక లక్ష్యాలు..

చాలా సందర్భాలలో తల్లితండ్రులు తమ పిల్లలకు పెద్ద పెద్ద లక్ష్యాలు పెడతారు. వీటిని చేరుకోలేక పిల్లలు మానసికంగా చాలా ఇబ్బందులకు గురవుతారు. పిల్లల సామర్థ్యాన్ని.. వారి ఆసక్తులను గమనించి లక్ష్యాలను నిర్దేశిస్తే మంచి ఫలితాలు లభిస్తాయి.

ప్రేమతో..

ప్రతి రోజు పిల్లలతో కనీసం ఒక గంట సేపు గడపండి. వారితో ప్రేమగా మాట్లాడండి.. వారికి ఏం కావాలో తెలుసుకోండి. అప్పుడు వారు చదువుపై మరింత దృష్టి కేంద్రీకరించగలుగుతారు.

జీర్ణక్రియ సాఫీగా...

దానిమ్మ పండులో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలం. రుచితో పాటు ఆరోగ్యం కూడా. అందుకే ప్రతిరోజూ దానిమ్మ గింజలను తినాలంటున్నారు పరిశోధకులు. ఇంతకీ దానిమ్మ ఉపయోగాలేంటీ..

- దానిమ్మను సూపర్‌ఫుడ్ అంటారు. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల వాపులు తగ్గుతాయి. కీళ్ల వాతం తగ్గిపోతుంది.
- దానిమ్మ గింజలను లేదా జ్యూస్‌ను తరచు తీసుకుంటే రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.
- ఇవి తినటం వల్ల నోటిలో ఉండే బ్యాక్టీరియా పోతుంది.



- పీచుపదార్థం కాబట్టి గుప్పెడు గింజలు తిన్నా.. తిన్న ఫీలింగ్ కలుగుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. అందుకే బరువు తగ్గాలనుకునేవారు మెనూలో దానిమ్మ గింజలను చేర్చాల్సిందే.
- ఇది మంచి ఇమ్యూనిటీ బూస్టర్. దీనివల్ల జలుబు, దగ్గు, జ్వరం లాంటివి దరిచేరే అవకాశాలు తక్కువ.
- దానిమ్మ గింజలను తరచూ తింటుంటే చర్మంలో మృదుత్వం వస్తుంది. దీంతో యంగ్‌గా కనిపిస్తారు.
- ఈ పండును తినటం వల్ల ఒత్తిడి తగ్గిపోతుంది.

'మిస్ ఇండియా అందాల పోటీల్లో శారీరక సౌందర్యం ఒక్కటే అర్హత కాదు, అంతఃసౌందర్యం కూడా చాలా ముఖ్యం' అంటారు ఫెమినా 'మిస్ తెలంగాణ- 2024' టైటిల్ విజేత ప్రకృతి కంబం. 'మిస్ ఇండియా' పోటీలకు ఎంపికైన ఈ అమ్మాయి లలిత కళలు, క్రీడల్లో మాత్రమే కాదు... నిజ జీవితంలోనూ ఒక ధీర. అందం, ఆత్మవిశ్వాసంతో పాటు దక్షిణాది సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని చాటడానికి 'మిస్ ఇండియా' పోటీలను ఒక వేదికగా మలుచుకొంటానని చెబుతున్న ప్రకృతితో 'నవ్య' మాట కలిపింది.



అంతఃసౌందర్యం ముఖ్యం

"మిస్ ఇండియా' పోటీలకు ఎంపికవడం చాలా సంతోషంగా ఉంది. ఇది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నన్ను నేను మరింతగా మెరుగు పరుచుకొంటూ, కొత్త విషయాలు నేర్చుకొంటూ ముందుకు వెళ్లడానికి అవసరమైన స్థైర్యాన్ని ఈ పోటీలు నాకు కల్పించాయి. అందాల పోటీలో శారీరక సౌందర్యం ఒక్కటే ప్రామాణికం కాదు. అంతకు మించి క్రమశిక్షణ, మేధస్సు, సామాజిక స్పృహ, సాంస్కృతిక అస్తిత్వం, వ్యక్తిత్వం తాలూకూ ప్రభావాలు మరెన్నో ముడిపడి ఉంటాయి. శరీర దారుఢ్యం కూడా చాలా కీలకం. తెల్లవారుజామున 4.30కి నా రోజు మొదలవుతుంది. యోగాతో పాటు జిమ్‌లో వర్కవుట్స్ లాంటివి చేస్తుంటాను. 'మిస్ ఇండియా' పోటీల్లో స్పీచ్, వాక్ వంటి రకరకాల విభాగాల్లో మెప్పించాలి. ఆ క్రమంలో నడకను, ఉచ్చారణను, ఆలోచనలను, ఆహార్యాన్ని.. ఇలా ప్రతి ఒక్క అంశాన్నీ న్యాయనిర్ణేతలు సూక్ష్మంగా పరిశీలిస్తారు. కనుక అందాల పోటీలో రాణించడానికి అంతఃసౌందర్యంతో పాటు బహుముఖ ప్రజ్ఞ కూడా చాలా అవసరం. ఈ పోటీలో పాల్గొనడం అంటే మరొకరితో పోటీ పడటం కాదు... నాతో నేను తలపడుతున్నట్టు.

అలా చూడటం సరికాదు...

లైంగిక దాడి లేదా వేధింపులకు లోనైనవారిని బాధితులుగా చూడటం సరికాదు. అసలు వారిని అలా సంబోధించకూడదు కూడా. ఒక అమ్మాయి తనకెదురైన హింసను బయటకు వెల్లడించడానికి అనువైన వాతావరణం ఇంట, బయట తప్పనిసరిగా కల్పించాలి. తనకు ఒక భరోసా ఇవ్వగలగాలి. అంతేకానీ.. కుటుంబ పరువు, ప్రతిష్ట పేరుతో నోరు మూయించడం లాంటివి చేస్తే మాత్రం సమాజంలో మరింత మంది నేరగాళ్లు తయారవడానికి మనమే పరోక్షంగా కారణం అవుతాం. 'హింసను ఎదుర్కొన్నవారు సైతం మీ అంతరాత్మకు మినహా మరెవ్వరి సందేహాలనూ తీర్చనక్కర్లేదు. ఎవరో ఏదో అనుకొంటారని వెనకడుగు వేయద్దు. నిర్భయంగా బయటకు వచ్చి అన్యాయంపై పెదవి విప్పండి. నిశ్శబ్దాన్ని ఛేదించండి. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లండి' అని ప్రతి ఒక్కరికీ ఓ సోదరిగా చెబుతాను.

అథ్లెటిక్స్‌లోనూ...

జీవితంలో ఎలాంటి కష్టం లేకుండా విజయం వరించడం సాధ్యం కాదు కదా. మనం ఎంచుకున్న ఈ రంగంలోనూ కొన్ని కష్టాలుంటాయి. ముఖ్యంగా మనకు ఇష్టమైన ఆహారాన్ని చాలా సందర్భాలలో తీసుకోలేకపోవచ్చు. నేనైతే, రోజులో ఎక్కువగా నీళ్లు తాగుతుంటాను. చర్మాన్ని కాంతిమంతంగా ఉంచడంలో అంతకు మించిన చిట్కా మరొకటి లేదని నమ్ముతాను. డైట్ విషయంలో చాలా కచ్చితంగా ఉంటాను. చిన్నప్పటి నుంచి క్రీడలన్నా, నృత్యం, సంగీతమన్నా విపరీతమైన ఇష్టం. నేను అథ్లెట్‌ను కూడా. స్కూల్, కాలేజీ రోజుల్లో త్రోబాల్ టీమ్ కెప్టెన్‌గా వ్యవహరించాను. అందాల పోటీల వైపు ఆసక్తి కలగకపోతే, క్రీడా రంగం వైపు వెళ్లేదాన్నేమో! భరతనాట్యంతో పాటు హిప్‌హాప్ లాంటి పాశ్చాత్య నృత్యరీతులనూ నేర్చుకొన్నాను. అవన్నీ నాకు ఈ పోటీల్లో పనికొస్తున్నాయి. కల్చరల్ ఐడెంటిటీ ఇక్కడ చాలా కీలకం. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సంస్కృతుల మేళవింపును నేను 'మిస్ ఇండియా' పోటీ వేదికపై పరిచయం చేయాలని అనుకొంటున్నాను. అదే నా అస్తిత్వం కూడా.

అమ్మానాన్న ప్రోత్సాహం...

ఇదివరకు 'మిస్ గ్రాండ్ కర్ణాటక', 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్ బెంగళూరు' టైటిల్స్ గెలుచుకున్నాను. నిజానికి అందాల పోటీలో పాల్గొనాలన్న ఆలోచనకు స్ఫూర్తి మా అక్క ప్రేరణ. తను నాకన్నా నాలుగేళ్లు పెద్ద. నిబంధనల ప్రకారం ఉండాల్సినంత ఎత్తు లేకపోవడంతో 'మిస్ ఇండియా' పోటీ ఫైనల్స్ వరకు వెళ్లి వెనక్కి వచ్చింది. దాంతో నన్ను అటువైపు వెళ్లమని అక్క ప్రేరేపించింది. చదువుతో పాటు ఆట, పాటలన్నిటిలో అమ్మానాన్న మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. చదువు పూర్తయ్యాక ఎటువైపు వెళ్లినా తమకు అభ్యంతరం లేదన్నారు. అందాల పోటీ అనగానే 'ఆ రంగంలోని లోటుపాట్లు, కష్టసుఖాలన్నిటినీ ముందు అర్థం చేసుకోండి. తర్వాత మీ వంతు కృషితో ముందుకు సాగండి'అని సూచించారు.

అందుకు గర్విస్తున్నా...

నేను పుట్టి, పెరిగిందంతా బెంగళూరులో. అక్కడే బీకామ్ పూర్తి చేశాను. మాది తెలంగాణ. మా తాతయ్య ప్రొఫెసర్ కేవీ బాలముకుంద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పని చేశారు. మా నానమ్మ నీల తొలి నాళ్లలో ఆకాశవాణిలో గాయని. ఒకప్పుడు కుటుంబమంతా చిక్కడపల్లిలో ఉండేవాళ్లు. మా నాన్న పురుషోత్తం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడంతో ఉద్యోగరీత్యా బెంగళూరులో స్థిరపడ్డారు. మా అమ్మ రూప తమిళియన్. అలా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో నాకు మంచి ప్రవేశమే ఉంది. కర్ణాటకలో ఉన్నా, తెలుగు భాష, సంస్కృతులకు దగ్గరగానే పెరిగాను. మా నాయనమ్మ ప్రభావంతో ఇక్కడి పండుగలు, ఆచార వ్యవహారాలన్నీ చిన్నప్పటి నుంచి నా జీవితంలో భాగం అయ్యాయి. నాన్న ద్వారా ఈ నేల గొప్పతనం గురించి ఎన్నోసార్లు విన్నాను. అలాంటిది ఇప్పుడు తెలంగాణ అమ్మాయిగా 'మిస్ ఇండియా' పోటీలకు వెళ్లడం నాకు చాలా గర్వంగా ఉంది.

సినిమాల్లో రాణించాలి...

తెలుగు సినిమాల్లో నటిగా రాణించాలన్నది నా అంతిమ లక్ష్యం. ఇప్పటికే మా అక్క ప్రేరణ తెలుగు సీరియల్ 'కృష్ణాముకుంద మురారీ'లో లీడ్ రోల్ చేస్తోంది. నేనూ ఒక సినిమాలో నటించాను. ఇప్పటికే సినిమాల వైపు కూడా దృష్టిపెడుతూ, కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నాను. అల్లు అర్జున్‌తో నటించాలన్నది నా కోరిక. ప్రస్తుతం 'మిస్ ఇండియా' పోటీలకు సన్నద్ధమవుతున్నాను. ప్రతి అమ్మాయికీ తన కెరీర్‌ను ఎంపిక చేసుకోవడంలో స్వేచ్ఛ ఉండాలి. వారి కలలకు తల్లిదండ్రులు మద్దతుగా నిలవాలి. అందాల పోటీలో పాల్గొని టైటిల్స్ గెలవడమే నా ఆశయం కాదు, నా వంతుగా సమాజానికి సహాయపడాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల ముఖంలో సంతోషాన్ని చూడటానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించాలన్నది నా కోరిక."



వేధింపులకు వ్యతిరేకంగా...

కోల్‌కతాలో డాక్టర్ మీద అఘాయిత్యం, మహారాష్ట్ర బద్లాపూర్‌లోని చిన్నారులపై అమానుషం... ఇలాంటి వార్తలు వింటున్నప్పుడు మనసంతా ఆందోళనగా ఉంటుంది. అలా అని బాధపడుతూనో, భయపడుతూనో కూర్చోకూడదు కదా! మనం బతికేది ఇలాంటి సమాజంలోనా? అని ప్రశ్నిస్తూ దోషులను, సమాజాన్ని నిలదీయాలి. ప్రతి ఆడపిల్ల జీవితంలో వేధింపులు భాగమేమో. నాకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తప్పనిసరిగా ఇక్కడ ప్రస్తావించాలి. స్కూల్లో చదువుతున్నప్పుడు చాలామందిలానే నేనూ శారీరక, మానసిక, లైంగిక వేధింపులు ఎదుర్కొన్నాను. అది నన్ను బాగా కుంగదీసింది. ఆ బాధను బహిర్గతం చేయాలా వద్దా అని చాలా రోజులు నాలో నేను మధనపడ్డాను. ఇలా ఎన్నాళ్లని కుమిలిపోవాలి? నేను చెయ్యని తప్పునకు నేనెందుకు ఆత్మన్యూనతకు లోనవ్వాలి? ఒక రోజు జరిగిన విషయాన్ని అమ్మానాన్న దృష్టికి తీసుకెళ్లాను. ఆ సమయంలో వారు నాకు అందించిన ధైర్యం, నా పట్ల ప్రవర్తించిన తీరు నన్ను ఒక ధీరగా నిలబెట్టాయి. నా జీవితంలో గర్వపడే క్షణాలు అంటే, నా చేదు అనుభవాన్ని బహిర్గతం చేయడమే. అమానుషత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తడమే.

• కేవీ
ఫొటోలు:రాజ్‌కుమార్

కౌన్సెలింగ్

క్యాల్షియం ఇలా...

డాక్టర్! నా వయసు 55 సంవత్సరాలు. మెనోపాజ్‌లో భాగంగా క్యాల్షియం సప్లిమెంట్లు తీసుకుంటున్నప్పటికీ, నా ఎముకలు గుల్లబారుతున్నాయి. ఇందుకు కారణమేంటో తెలియడం లేదు. శరీరం క్యాల్షియంను శోషించుకోవడం కోసం నేనేం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

మెనోపాజ్‌కు చేరుకున్న మహిళలకు వైద్యులు క్యాల్షియం సప్లిమెంట్లను సూచించడం సహజం. అయితే శరీరం క్యాల్షియంను పూర్తిగా శోషించుకోవడం కోసం, అందుకు తోడ్పడే పోషకాలను కూడా సరిపడా తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- ఆహారంతో కలిపి తీసుకున్నప్పుడు క్యాల్షియం కార్బొనేట్‌ను శరీరం చక్కగా శోషించుకుంటుంది. కాబట్టి ఈ సప్లిమెంటును భోజనం తర్వాత తీసుకోవాలి.



- క్యాల్షియం సప్లిమెంట్లను విటమిన్ డితో కలిపి తీసుకోవాలి. శరీరం క్యాల్షియంను శోషించుకోవడంలో విటమిన్ డి ఎంతో బాగా సహాయపడుతుంది.
- ఒకసారికి 500 మి.గ్రాములకు మించి క్యాల్షియం తీసుకోకూడదు. ఎక్కువ తీసుకోవడం వల్ల శోషణ సామర్థ్యం కుంటుపడుతుంది.
- ఫోర్టిఫైడ్ పదార్థాలు తింటూ ఉండాలి. క్యాల్షియం కలిగిన సిరీల్స్, నారింజ రసం, సోయా మిల్క్ తీసుకోవాలి.
- పాలకూర, కేల్, బ్రొకొలిలలో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. వీటిని ఆలివ్ లేదా కొబ్బరి నూనెలతో కలిపి తినడం వల్ల శోషణ పెరుగుతుంది.
- **టోఫు:** క్యాల్షియం సల్ఫేట్‌తో తయారుచేసిన టోఫుతో శాకాహారులు సరిపడా క్యాల్షియం సమకూర్చుకోవచ్చు.
- **నువ్వులు:** నువ్వులను నానబెట్టి, నూనె లేకుండా వేయించి, మొలకెత్తించి తినడం వల్ల వాటిలోని క్యాల్షియం శోషణ పెరుగుతుంది.
- కాఫీ, సోడా, ఉప్పు ఎక్కువగా ఉండే పదార్థాలు క్యాల్షియం శోషణకు అవరోధంగా మారతాయి. కాబట్టి వాటిని తీసుకోవడం మానేయాలి.
- బీన్స్‌లో ఫేటేట్స్ ఉంటాయి. ఇవి కాల్షియం శోషణను అడ్డుకుంటాయి. కాబట్టి బీన్స్‌ను కొన్ని గంటలపాటు నానబెట్టి, కడిగి, ఉడకబెట్టుకుని వండుకోవాలి.
- ఐరన్‌లో కోసం ఆకుకూరలు, గుడ్లు, మాంసం, లివర్ తరచూ తింటూ ఉండాలి.
- శాకాహారులు మష్రూమ్స్, అవకాడొ, దానిమ్మ, బీట్‌రూట్ తినొచ్చు.
- ప్రతి రోజూ పాలు, పెరుగు తింటూ ఉండాలి.



శనగపిండితో అందం

రుచికరమైన వంటలు వండుకోవటానికి ఉపయోగపడే శనగపిండిలో సహజమైన పోషకాలుంటాయి. ముఖ్యంగా చర్మం అందం పెంచటానికి ఇది ఉపయోగపడుతుంది. శనగపిండితో సులువుగా ఫేస్‌ప్యాక్స్ ఎలా చేయాలో తెల్సుకుందాం.

- బౌల్‌లో టేబుల్ స్పూన్ శనగపిండి, టేబుల్ స్పూన్ అలొవెరా జెల్ వేసి మెత్తగా చూర్ణం చేయాలి. ఈ మిశ్రమనిష్ణ ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రపరచాలి. అలొవెరాలోని యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల నల్లటి మచ్చలు పోతాయి. శనగపిండితో చర్మం మృదువుగా తయారవుతుంది.
- రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి, చిటికెడు పసుపు వేసి కలపాలి. సరిపడ రోజ్‌వాటర్ కలిపి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద నొప్పులు పోతాయి.
- ఒక టమోటాను పేస్ట్‌లా చేసుకోవాలి. బౌల్‌లో టేబుల్ స్పూన్ శనగపిండి వేసి అందులోకి టమోటా పేస్ట్ వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి ముఖానికి పట్టించాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం మీద వలయాలతో పాటు ముఖంలోని జిడ్డు తొలగిపోతుంది.
- రెండు చిన్న అరటిపండ్లను చూర్ణం చేయాలి. ఈ గుజ్జులోకి రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి వేసి మెత్తగా కలపాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టిస్తే అందంగా కనపడుతుంది.
- బౌల్‌లో ఒకటిన్నర టేబుల్ స్పూన్ వేసి ఇందులో అర టీస్పూన్ నిమ్మరసం కలపాలి. కొద్దిగా పసుపు, టేబుల్ స్పూన్ పెరుగు వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత మంచి నీళ్లతో కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం ఫ్రెష్‌గా అనిపిస్తుంది. ముఖం శుభ్రం అవుతుంది.
- రెండు వందల గ్రాముల బొప్పాయి ముక్కల్ని చూర్ణం చేయాలి. బౌల్‌లో ఈ బొప్పాయి చూర్ణం వేసి, టేబుల్ స్పూన్ శనగపిండి వేసి కలపాలి. ఇందులోకి కొద్దిగా రోజ్ వాటర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రం చేయాలి.

డిబేట్

తల్లిదండ్రులు స్నేహితులు కాగలరా!

నటి, ఎంపీ జయాబచ్చన్, ఆమె కూతురు శ్వేతా నందా మధ్య ఓ ఆసక్తికరమైన చర్చ సాగింది. 'పిల్లలకు తల్లితండ్రులు స్నేహితులు కాగలరా'..? ఈ అంశంపై ఇద్దరూ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీనికి వేదిక... జయ మనవరాలు, శ్వేత తనయ నవ్య నవేలీ నందా నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్.

తల్లిదండ్రులు పిల్లలతో స్నేహితుల్లా మెలగగలరా..? ఇది ఎప్పటికీ ఎడతెగని చర్చ. ఈ చర్చను మరింత లోతుకు తీసుకువెళ్లింది జయ, శ్వేతల సంభాషణ. నవ్య హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వాట్ ది హెల్ నవ్య' పాడ్‌కాస్ట్‌లో తరచూ బచన్ కుటుంబానికి సంబంధించిన కథలు వినిపిస్తుంటాయి.

ఇందులో శ్వేత మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితులుగా ఉండలేరని అన్నారు. స్నేహితులతో ఏ విషయమైనా పంచుకోవచ్చని, అదే పిల్లలతో అయితే అలా కుదరదనేది ఆమె వాదన.

"ఈ మధ్య ప్రతిఒక్కరూ 'తల్లిదండ్రులు స్నేహితులు'లా ఉండాలని కోరుకొంటున్నారు. ఈ కోణం నాకు అస్సలు అర్థంకాదు. ఎందుకంటే పిల్లలు పిల్లలే. స్నేహితులు స్నేహితులే. నా మిత్రులతో పంచుకున్న విషయాలన్నిటినీ నా పిల్లలతో చెప్పలేను కదా" అంటారు శ్వేత.

దీన్ని ఖండించిన జయాబచ్చన్... "నీ అభిప్రాయం సరైంది కాదు. మన పిల్లలు మన స్నేహితులు ఎందుకు కాలేరు? ఒక వయసు దాటిన తరువాత నీ పిల్లలతోనే నీకు దోస్తీ కుదురుతుంది" అన్నారు. ఈ వాదనతో శ్వేత ఏకీభవించలేదు. "ఎన్ని చెప్పినా ఒక స్థాయికి వెళ్లేసరికి 'నేను నీ తల్లిని. పిల్లవి నీకేం తెలుసు' అనే పెద్దరికం పెద్దల్లో వచ్చేస్తుంది" అన్నారు.

ఇద్దరి భిన్నాభిప్రాయాల నేపథ్యంలో నవ్య కూడా చర్చలోకి దిగింది. 'తల్లిదండ్రులు పిల్లలకు స్నేహితులు ఎందుకు కాలేరు' అని శ్వేతను ప్రశ్నించిన నవ్య... 'అమ్మా... ఇప్పుడు నువ్వు, అమ్మమ్మా ఇద్దరూ తల్లులే. కనుక మీరిద్దరూ 'స్నేహితులు కాగలరు' అంటూ పరిస్థితిని సమతూకం చెయ్యడానికి ప్రయత్నించింది.

అయితే శ్వేత తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

> **తల్లిదండ్రులు స్నేహితులుగా మెలగడమంటే తమ పిల్లల్ని తమతోపాటు పెద్దలుగా భావిస్తున్నట్టే అని 2002లో ఓ అధ్యయనం వెల్లడించింది. దీనివల్ల పెద్దలతో ఎలా మసలుకోవాలో తెలియని అయోమయ స్థితిలోకి పిల్లలు వెళ్లిపోతారని పేర్కొంది..**

ప్రస్తుతం తను, జయ ఇద్దరూ తల్లులే అయినప్పటికీ పిల్లల్ని పెంచే విధానాల్లో తమ మధ్య ఎంతో వ్యత్యాసం ఉందంటారు శ్వేత. "నేను, అమ్మ స్నేహితులం కాదు. ఇప్పటికీ ఎప్పటికీ ఆమె నా తల్లి. ఒక కూతురుగా తనతో ప్రవర్తించే తీరులో నాకు కొన్ని హద్దులు ఉంటాయి. వాటిని అతిక్రమించకూడదు. అదే స్నేహంలో అయితే ఎలాంటి పరిధులూ, పరిమితులూ ఉండవు. ఎవరైనా సరే కుటుంబంతో అపరిమిత సమయం గడపగలరు... నవ్య వాళ్ల అమ్మమ్మతో గడిపినట్టు. అంతమాత్రాన వారిద్దరూ స్నేహితులు కారు. ఎందుకంటే నవ్య తనకు సంబంధించిన ప్రతి విషయాన్నీ మా అమ్మతో నిజాయతీగా పంచుకోలేకపోతోంది" అనేది శ్వేత వాదన. అయితే తల్లిదండ్రులు కొంతవరకు స్వేచ్ఛ ఇవ్వాలంటారు ఆమె. "దానివల్ల పిల్లలకు తమ తప్పులను సరిదిద్దుకొనే అవకాశం కలుగుతుంది. అది వారి మానసిక పరిపక్వతకు దోహదపడుతుంది" అంటారు ఆమె.




"దీనికి నేను ఒప్పుకోను. అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. పిల్లలు తప్పులు చేయకుండా వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యత పెద్దలదే" అంటూ జయ చర్చను ముగించారు.

ఈ చర్చ నెట్టింటికి చేరింది. కొందరు జయను సమర్థిస్తుంటే... మరికొందరు శ్వేత పక్షాన నిలిచారు. మరి నిపుణుల మాటేమిటి?

జీన్ ట్వెంగే, డబ్ల్యూ కీత్ క్యాంపబెల్ తమ 'ది నార్సిసిజమ్ ఎపిడెమిక్: లివింగ్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఎన్‌టైటిల్‌మెంట్' అనే పుస్తకంలో ఏం చెప్పారంటే... 'తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితులుగా మెలిగేందుకు ప్రయత్నించినప్పుడు సమస్యలకు కారకులవుతారు' అని. 'ఈ క్రమంలో ప్రధానంగా ఎదురయ్యే ఇబ్బంది పిల్లల మీద పెద్దలు అధికారం కోల్పోవడం. ఫలితంగా తల్లిదండ్రులు నిర్లక్ష్యానికి గురవుతారు. పిల్లల ఆలనాపాలనలో కొన్ని నిబంధనలు, పరిమితులు తప్పనిసరి. ఒకవేళ స్నేహితులుగా ఉంటే పిల్లల్లో క్రమశిక్షణ కూడా కరువవుతుంది' అని కొందరు అభిప్రాయపడ్డారు.


తల్లిదండ్రులు స్నేహితులుగా మెలగడమంటే తమ పిల్లల్ని తమతోపాటు పెద్దలుగా భావిస్తున్నట్టే అని 2002లో ఓ అధ్యయనం వెల్లడించింది. దీనివల్ల పెద్దలతో ఎలా మసలుకోవాలో తెలియని అయోమయ స్థితిలోకి పిల్లలు వెళ్లిపోతారని పేర్కొంది. అమ్మానాన్నలతో స్నేహితుల్లా సాన్నిహిత్యంగా ఉండే ప్రతిఒక్క చిన్నారిలో ఇదేరకమైన పరిస్థితి ఉంటుందని చెప్పలేమని మరో అధ్యయన సంస్థ 'స్టాటిన్ హెచ్' తెలిపింది. అలాగే ఇరవై నాలుగు గంటలూ నిఘా పెట్టడంవల్ల పెద్దలపై పిల్లల్లో నమ్మకం సన్నగిల్లుతుందని గుర్తించినట్టు స్వీడన్‌కు చెందిన ఆ అధ్యయన సంస్థ చెప్పింది. మరి మీ ఓటు ఎవరికి? శ్వేతకా? జయాబచ్చన్‌కా?



ప్రపంచ శ్రేణికి

యూపీఐ, రూపే విస్తరణ

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబై: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), రూపేలను వాస్తవిక ప్రపంచ శ్రేణి ఉత్పత్తులుగా తీర్చి దిద్దడంపై దృష్టి సారిస్తున్నట్టు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. బుధవారం నాడిక్కడ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024లో ఆయన మాట్లాడుతూ..పలు దేశాల నుంచి యూపీఐ, రూపేలకు వస్తున్న ప్రోత్సాహకరమైన స్పందనను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. వీటికి తోడు ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న సీబీడీసీ (సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ) అంతర్జాతీయ సహకారానికి అవకాశం ఉన్న మరో విభాగమని చెప్పారు. ప్రస్తుతం భూమి లేని కౌలు రైతులకు రుణ సహాయం లేదా ప్రభుత్వ సహాయం అందించడానికి, రైతులకు కార్బన్ క్రెడిట్లు అందించేందుకు సీబీడీసీని ఉపయోగించుకుంటున్నట్టు దాస్ వెల్లడించారు. యూపీఐ వంటి సత్వర రిటైల్ పేమెంట్ వ్యవస్థలతో అనుసంధానమై సీబీడీసీ విజయవంతంగా పని చేసేలా చేయగలిగామని, ఆఫ్‌లైన్ సొల్యూషన్ల ద్వారా లబ్ధి పొందడం కోసం ప్రయోగాలను కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఈ దిశగా సాధించే పురోగతి ఆధారంగా సీబీడీసీ ఏర్పాటు కోసం ఇతర దేశాలు చేస్తున్న ప్రయత్నాలకు కూడా సహకరిస్తామని ఆయన తెలిపారు. అంతర్జాతీయ అనుసంధానిత మార్కెట్లో ఉన్న రిస్కులను పరిష్కరించుకుంటూనే అందుబాటులో ఉన్న అవకాశాలు సొమ్ము చేసుకోగల శక్తివంతమైన వ్యవస్థలను రూపొందించుకోవాలని ఆర్థిక సంస్థలు, ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు ఆయన పిలుపు ఇచ్చారు.

ఐదు ప్రాధాన్యతా అంశాలు: డిజిటల్ ప్రభుత్వ మౌలిక వసతులు (డీపీఐ), వినియోగదారుల రక్షణ, సైబర్ భద్రత, సుస్థిర ఫైనాన్స్, ప్రపంచ శ్రేణి సహకారం అనే ఐదింటినీ ఆర్‌బీఐ ప్రాధాన్యతాంశాలుగా గుర్తించిందని చెప్పారు. ఫిన్‌టెక్ రంగం నియంత్రణ వైఖరినికూడా దాస్ ప్రస్తావించారు. ఫిన్‌టెక్ రంగం ఒక క్రమపద్ధతిలో, స్థిరంగా అభివృద్ధి చెందాలంటే ఇన్నోవేషన్, విచక్షణ మధ్య సమతూకం అవసరమన్నారు.

రిలయన్స్-వాల్ట్ డిస్నీ విలీనానికి సీసీఐ గ్రీన్ సిగ్నల్

రూ.70,000 కోట్ల భారీ మీడియా వెంచర్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్-వాల్ట్ డిస్నీ మీడియా ఆస్తుల విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. ఈ జాయింట్ వెంచర్ కంపెనీలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 63.16 శాతం, వాల్ట్ డిస్నీకి 36.84 శాతం వాటా ఉంటుంది. ఇక ఈ విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదమే తరువాయి. ఎన్‌సీఎల్‌టీ కూడా ఆమోదం తెలిపితే దేశంలో రూ.70,000 కోట్ల భారీ మీడియా వెంచర్ ఏర్పడనుంది. అదే జరిగితే వీక్షకులకు రెండు స్ట్రీమింగ్ సర్వీసులు, 120కిపైగా టీవీ ఛానల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ జాయింట్ వెంచర్ కంపెనీకి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ భార్య నీతా అంబానీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. సోనీ, నెట్‌ఫ్లిక్స్‌లతో పోటీ పడేందుకు వీలుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ జాయింట్ వెంచర్ కంపెనీలో రూ.11,500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది.

ఎస్‌ఎంఈ షేర్లతో జర జాగ్రత్త

మదుపరులను హెచ్చరించిన సెబీ

న్యూఢిల్లీ: చిన్నమధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎస్‌ఎంఈ) కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టే విషయంలో జాగ్రత్తగా ఉండాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి మదుపరులను హెచ్చరించింది. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా నిండా మునగడం ఖాయమని స్పష్టం చేసింది. ఎస్‌ఎంఈ కంపెనీల షేర్ల లిస్టింగ్, ట్రేడింగ్‌లో ప్రమోటర్లు అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో సెబీ ఈ హెచ్చరిక చేయడం విశేషం. లిస్టింగ్ తర్వాత కొన్ని ఎస్‌ఎంఈ కంపెనీలు లేదా వాటి ప్రమోటర్లు తమ కంపెనీల కార్యకలాపాలపై అతిశయోక్తులు చెబుతూ మదుపరులను మాయ చేస్తున్నట్టు ఇటీవల వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెబీ ఈ హెచ్చరిక చేసింది.

రీసోర్స్‌ఫుల్ ఆటో ఐపీఓ దెబ్బతోనే: ఇటీవల రూ.12 కోట్ల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూకి వచ్చిన రీసోర్స్‌ఫుల్ ఆటోమొబైల్స్ అనే ఎస్‌ఎంఈ కంపెనీ ఐపీఓ 419 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. సోమవారం నాడు ముగిసిన ఐపీఓ ద్వారా రూ.12 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తే ఏకంగా రూ.4,800 కోట్లకు బిడ్స్ వచ్చాయి. ఢిల్లీలో కేవలం రెండు దుకాణాలు, 8 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్న ఈ ఎస్‌ఎంఈ కంపెనీ ఐపీఓ ఈ స్థాయిలో సబ్‌స్క్రైబ్ కావడంతో ఈ మార్కెట్లో ఏదో జరుగుతోందనే అనుమానాలు మరింత బలపడ్డాయి. దీనికి తోడు పెద్దగా ఫండమెంటల్స్ లేకపోయినా కొన్ని ఎస్‌ఎంఈల ఐపీఓలు మూడు నుంచి నాలుగున్నర రెట్ల లాభాలతో లిస్టవుతున్నాయి. దీంతో ఎస్‌ఎంఈల లిస్టింగ్ లాభాలను సెబీ ఇటీవల 90 శాతానికి పరిమితం చేసింది. అయినా మార్కెట్లో వీటి హవా నడుస్తోంది. నిజానికి సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ ఈ ఏడాది మార్చిలోనే ఎస్‌ఎంఈల షేర్లలో పెట్టుబడులు పెట్టేటప్పుడు మదుపరులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

సెకండరీ మార్కెట్ ట్రేడింగ్‌కు యూపీఐ బ్లాక్ విధానం: సెకండరీ మార్కెట్ లావాదేవీలను మరింత సురక్షితం చేయాలని సెబీ భావిస్తోంది. ఇందుకోసం క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు అందరూ సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్ చేసే ఇన్వెస్టర్లకు తప్పనిసరిగా యూపీఐ బ్లాక్ మెకానిజం అందుబాటులోకి తేవాలని ప్రతిపాదించింది. ఇది ప్రైమరీ మార్కెట్లో ఐపీఓలకు దరఖాస్తు చేసే మదుపరులకు అందిస్తున్న ఏఎస్‌బీఏ తరహాలో ఉండాలని స్పష్టం చేసింది. దీని వల్ల మదుపరుల నిధులతో పాటు సెక్యూరిటీలకూ భద్రత లభిస్తుందని సెబీ తెలిపింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో జీక్యూజీకి మరింత వాటా

న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్.. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈక్విటీలో తన వాటాను మరింత పెంచుకుంది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ నెల 23న కంపెనీ ఈక్విటీలో మరో 0.43 శాతం (4.52 కోట్ల షేర్లు) వాటా కొనుగోలు చేసింది. దీంతో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈక్విటీలో జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటా 4.74 శాతం నుంచి 5.17 శాతానికి చేరింది. ఈ 0.43 శాతం వాటా కోసం జీక్యూజీ పార్ట్‌నర్స్ దాదాపు రూ.433 కోట్లు ఖర్చు చేసింది. జీక్యూజీ పార్ట్‌నర్స్ ఇప్పటికే అదానీ గ్రూప్‌లో కీలక ఇన్వెస్టర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.

అపోలో ఆయుర్‌వైద్‌తో అవెస్థాజెన్ భాగస్వామ్యం

చెన్నై: అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలపైనా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గ్రూప్ కంపెనీ అపోలో ఆయుర్‌వైద్, అవెస్థాజెన్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా అవెస్థాజెన్ అనుబంధ కంపెనీలు ఆయుర్వేద వైద్య విధానానికి అనుగుణంగా తయారు చేసే కొన్ని ఆహార ఉత్పత్తులు, అనుబంధ పదార్థాలను అపోలో ఆయుర్‌వైద్.. 'అవెస్థాఆయుర్‌వైద్' బ్రాండ్ పేరుతో మార్కెట్ చేయనుంది. ఈ ఆహార ఉత్పత్తులు, పదార్థాలు.. మధుమేహం, బరువు నియంత్రణ, మెటబాలిక్ డిజార్డర్స్ సరిదిద్దేందుకు ఉపయోగపడతాయని రెండు కంపెనీలు తెలిపాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	93,600 ▲
ముంబై	71,691 ▼	65,669 ▼	84,929 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29 వ తేదీ

హైదరాబాద్	490	విజయవాడ	520
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	508	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	108
వరంగల్	109	గుంటూరు	107
కరీంనగర్	109	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	100
కర్నూలు	109	నెల్లూరు	100
విశాఖపట్నం	104	అనంతపురం	107
గోదావరి	108		

అత్యుత్తమ బ్యాంకుగా ఎస్‌బీఐ



ఈ దశాబ్దం భారత్‌దే

బ్యాంక్ కొత్త చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కొత్త చైర్మన్‌గా తెలుగు బిడ్డ చల్లా శ్రీనివాసులు శెట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బ్యాంకు చైర్మన్‌గా వ్యవహరించిన దినేశ్ కుమార్ ఖారా ఈ నెల 27న పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో శెట్టి బాధ్యతలు చేపట్టినట్లు రెగ్యులేటరీ సంస్థలకు పంపిన ఒక ప్రకటనలో ఎస్‌బీఐ వెల్లడించింది. కాగా బ్యాంకు నికర లాభాలు మరింత పెంచడంతో పాటు బ్యాంకును అత్యంత విలువైన ఆర్థిక సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి ప్రకటించారు. ఎస్‌బీఐని దేశంలోనే అత్యుత్తమ బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తానని ఒక సందేశంలో ఉద్యోగులకు హామీ ఇచ్చారు. దాదాపు 50 కోట్ల మంది ఖాతాదారులకు ఆర్థిక సేవలు అందిస్తున్న ఎస్‌బీఐ.. మార్కెట్ క్యాప్‌పరంగా గత పదేళ్లలో ప్రపంచంలోని అతి పెద్ద బ్యాంకుల్లో 52వ స్థానం నుంచి 17వ స్థానానికి ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్థిక వృద్ధిలో దూసుకుపోతూ ప్రస్తుతం మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశం స్థాయి నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారుతోందన్నారు. నిక్కచ్చిగా ఈ దశాబ్దం మన దేశానిదేనన్నారు. ఈ దశాబ్దం ఎస్‌బీఐది కూడా కావాలని తాను కోరుకుంటున్నట్టు శ్రీనివాసులు శెట్టి తెలిపారు. 1988లో ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరిన శెట్టి.. బ్యాంక్‌లోని పలు కీలక విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించారు.

రూ.7,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి గాను టియర్-2 బాండ్ల ద్వారా ఎస్‌బీఐ రూ.7,500 కోట్లు సమీకరించింది. 15 సంవత్సరాల కాలపరిమితి ఉండే ఈ బాండ్లపై ఏటా 7.42 శాతం వడ్డీ చెల్లిస్తారు. రూ.5,000 కోట్లకు బిడ్స్ ఆహ్వానిస్తే ప్రావిడెండ్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంకుల నుంచి రూ.8,800 కోట్లకుపైగా బిడ్స్ వచ్చాయి. అయితే ఎస్‌బీఐ రూ.7,500 కోట్ల బిడ్స్‌ను మాత్రమే స్వీకరించింది. ఈ బాండ్స్ కాలపరిమితి 15 సంవత్సరాలు ఉన్నా.. పదేళ్ల తర్వాత వెనక్కి తీసుకునే హక్కు ఎస్‌బీఐకి ఉంది.

టెక్నో పెయింట్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు

హైదరాబాద్: వచ్చే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రో నగరాల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన టెక్నో పెయింట్స్ వెల్లడించింది. హైదరాబాద్‌లో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా సంస్థ సీఎండీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సెంటర్లలో కంపెనీ అనుబంధ సంస్థ రిచ్‌వేవ్స్ బ్రాండ్‌కు చెందిన ఇటాలియన్ ఫినిషెస్, లగ్జరీ పెయింట్స్ అందుబాటులో ఉంటాయన్నారు. భారత్‌లో ఈ పెయింట్స్‌ను తయారు చేస్తున్న కంపెనీ టెక్నో ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా అందుబాటు ధరల్లో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు తెలిపారు.

నిఫ్టీ అదే దూకుడు

ముంబై: నిఫ్టీ వరుసగా పదో రోజు కూడా అదే దూకుడు ప్రదర్శించింది. ఈక్విటీ మార్కెట్లోకి తరలివస్తున్న విదేశీ పెట్టుబడులు.. ఇన్వెస్టర్ సెంటిమెంట్ సానుకూలంగా ఉండేందుకు దోహదపడ్డాయి. దీంతో బుధవారం నిఫ్టీ 34.60 పాయింట్ల లాభంతో 25,052.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 111.85 పాయింట్లు లాభపడి 25,129.60 పాయింట్లను తాకింది. ఈ రెండూ జీవితకాల గరిష్ఠ స్థాయిలే. కాగా సెన్సెక్స్ 73.80 పాయింట్ల లాభంతో 81,785.56 వద్ద ముగిసింది.

ఓరియెంట్ టెక్నాలజీస్ లిస్టింగ్ జోరు: బుధవారం లిస్టింగ్ అయిన ఓరియెంట్ టెక్నాలజీస్ షేరు ఇష్యూ ధర రూ.206తో పోల్చితే 48 శాతం ప్రీమియంతో ముగిసింది. బీఎస్ఈలో 40.77 శాతం లాభంతో రూ.290 వద్ద లిస్ట్ అయిన ఈ షేరు చివరికి 47.99 శాతం లాభంతో రూ.304.45 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 46.79 శాతం లాభంతో రూ.302.40 వద్ద క్లోజైంది.



మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 2023-24 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన ఇండియా గోల్డ్ కాన్ఫరెన్స్ (ఐజీసీ) రెస్పాన్సిబుల్ జువెలరీ హౌస్ అవార్డును గెలుచుకుంది. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ చైర్‌పర్సన్ సుందరవల్లి నారాయణ స్వామి చేతుల మీదుగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఎండీ ఓ. అషర్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ ఎల్ఎల్‌సీ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ సీతారామన్ వరదరాజన్, సంస్థ బులియన్ హెడ్ దిలీప్ నారాయణన్, మలబార్ గోల్డ్ కర్ణాటక రీజియన్ హెడ్ ఫిల్బర్ బాబు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం

ఘనంగా పారాలింపిక్స్ ప్రారంభోత్సవం

అదరగొట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు



పారిస్ : సంప్రదాయానికి భిన్నంగా సెన్ నదిలో పడవలపై అథ్లెట్ల పరేడ్‌తో ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించగా.. ఇప్పుడు పారా విశ్వ క్రీడల ఆరంభాన్నీ అంతే ప్రత్యేకంగా అంటే.. స్టేడియం బయట జరిపారు. నాలుగు వేలమందికిపైగా అథ్లెట్లు, 22 క్రీడాంశాలలో తలపడే ఈ 11 రోజుల ఆటల పండుగకు బుధవారం రాత్రి ఉత్సాహంగా తెరలేచింది. నగరం మధ్యలో ఓపెన్ ఎయిర్‌లో చారిత్రాత్మక డి ల కాంకార్డ్, చాంప్స్-ఎలీస్‌వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఫ్రెంచ్ పారా స్విమ్మర్ థియో క్యూరిన్ పూలతో అందంగా అలంకరించిన కారులో ప్రారంభోత్సవ వేదిక డి ల కాంకార్డుకు వస్తూ తన అథ్లెట్లకు స్వాగతం పలికాడు. భారీగా హాజరైన ప్రేక్షకుల చప్పట్లమధ్య ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్..ఇంటర్నేషనల్ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ) చీఫ్ ఆండ్రూ పార్సన్స్‌తో కరచాలనం చేశారు. అనంతరం కెనడాకు చెందిన ప్రఖ్యాత పియానిస్ట్ చిల్లీ గొంజాలెస్..పియానో వాయిస్తుండగా 140 మంది డ్యాన్సర్లతో సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ తరుణంలో పారాలింపిక్స్ మస్కట్ 'పిర్జే' స్టేజ్ పైకి వచ్చి అతిథులు, ప్రతినిధులు, అథ్లెట్లకు స్వాగతం పలికింది. ఆపై..పలువురు ఫ్రెంచ్ కళాకారులు.. తమ దేశ దివంగత దిగ్గజ గాయని ఎడిత్ పియాఫ్‌కు నివాళిగా ఆమె పాడిన పాటను ఆలపించారు. అనంతరం అథ్లెట్ల మార్చ్‌పాస్ట్ ప్రారంభమైంది. తొలుత అఫ్ఘానిస్థాన్ రాగా అనంతరం సౌతాఫ్రికా జట్టు విచ్చేసింది. అఫ్ఘాన్ తరఫున ఒకే ఒక అథ్లెట్ బరిలో దిగుతోంది. తదుపరి జర్మనీ, అర్జెంటీనా అథ్లెట్లురాగా..జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ జాదవ్ త్రివర్ణ పతకాన్ని ధరించి ముందు నడవగా బృందం సభ్యులు వారిని అనుసరించారు. తెల్ల కుర్తా, పైజమా తోపాటు పైన ఓవర్ కోట్, మెడలో త్రివర్ణ పతాక రంగులతో కూడిన కండువాను ధరించి భారత అథ్లెట్లు పరేడ్‌లో పాల్గొన్నారు. గురువారం పోటీలు ఉండడంతో 10 మంది షూటింగ్ జట్టు పరేడ్‌లో పాల్గొనలేదు. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత, జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా భారత పారా బృందానికి బెస్టాఫ్ లక్ చెప్పాడు. అథ్లెట్ల పరేడ్ జరుగుతుండగానే విమానాలు ఫ్రెంచ్ జాతీయ పతాకంలోని రంగులను వదులుతూ కనువిందు చేశాయి. కుంగ్ ఫు మొనగాడు, హాలీవుడ్ స్టార్ 70 ఏళ్ల జాకీ చాన్ క్రీడా జ్యోతిని చేబూని పారిస్ వీధుల్లో సందడి చేశాడు.


జాకీ చాన్

స్పోర్ట్స్

లఖ్‌నవూ మెంటార్‌గా జహీర్ ఖాన్



కోల్‌కతా : ఐపీఎల్ జట్టు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తమ మెంటార్‌గా జహీర్ ఖాన్‌ను నియమించుకుంది. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ బుధవారం వెల్లడించింది. జహీర్ 2018 నుంచి 2022 వరకు ముంబై ఇండియన్స్‌కు పనిచేసిన విషయం తెలిసిందే. గతంలో లఖ్‌నవూ మెంటార్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ నిరుడు కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మారాడు. దాంతో అప్పటినుంచి లఖ్‌నవూ జట్టు మెంటార్ పదవి ఖాళీగా ఉంది.

గుండె సర్జరీ తర్వాత ధుల్ రీఎంట్రీ

న్యూఢిల్లీ: గుండెకు చిన్నపాటి శస్త్రచికిత్స చేయించుకొన్న 2022 అండర్-19 వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ యశ్ ధుల్ మళ్లీ పోటీ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. ఎన్‌సీఏలో నిర్వహించిన స్కానింగ్‌లో అతడి గుండెకు రంధ్రం ఉన్నట్టు బయటపడింది. దీంతో గత నెలలో అతడికి మైనర్ సర్జరీ చేశారు. క్రమంగా కోలుకొన్న ధుల్ ప్రస్తుతం ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు.

కోహ్లీని వెనక్కునెట్టిన జైస్వాల్

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్



దుబాయ్: టెస్ట్ ర్యాంకింగ్స్‌లో యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్.. విరాట్‌ను వెనక్కునెట్టి మెరుగైన ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టెస్ట్ ర్యాంక్‌ల జాబితాలో ముగ్గురు భారత బ్యాటర్లు టాప్-10లో నిలిచారు. జైస్వాల్ ఒక స్థానం మెరుగు పర్చుకొని ఏడో స్థానం దక్కించుకోగా.. కోహ్లీ రెండు మెట్లెక్కి ఎనిమిదో ర్యాంక్ సొంతం చేసుకొన్నాడు. కాగా, రోహిత్ ఒక స్థానం దిగజారి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ టాప్‌లో ఉండగా.. పాక్ ఆటగాడు బాబర్ ఆజమ్ ఏకంగా ఆరు స్థానాలు దిగజారి 9వ ర్యాంక్‌కు పడిపోయాడు. బౌలర్లలో స్పిన్నర్ అశ్విన్ అగ్రస్థానంలో ఉండగా.. బుమ్రా మూడో ర్యాంక్‌లో, జడేజా ఏడో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్లలో జడేజా, అశ్విన్‌లు టాప్-2లో ఉండగా.. అక్షర్ పటేల్ ఆరో ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు.

కొరియా ఓపెన్‌లో భారత్‌కు నిరాశ

సియోల్: కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. అస్మిత, మాళవిక, ఆకర్షి తొలి రౌండ్‌లోనే ఓటమి పాలై, ఇంటి ముఖం పట్టారు. అస్మిత 8-21, 13-21తో పోర్న్‌పావీ (థాయ్‌లాండ్) చేతిలో ఓడగా, ఆకర్షి 15-21, 15-21తో లైన్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)తో పోరులో పరాజయం పాలైంది. మాళవిక 21-18, 15-21, 17-21తో లైన్ హోజ్‌మార్క్ (డెన్మార్క్) చేతిలో ఓడింది.

క్రెజికోవాకు షాక్

● దిమిత్రోవ్ ముందంజ ● యూఎస్ ఓపెన్


గాబ్రియెలా రూజ్

న్యూయార్క్: వింబుల్డన్ చాంపియన్ బార్బరా క్రెజికోవాకు రెండో రౌండ్‌లోనే చుక్కెదురైంది. యూఎస్ ఓపెన్‌లో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో 8వ సీడ్ క్రెజికోవా (చెక్) 4-6, 5-7తో ఎలెనా గాబ్రియెలా రూజ్ (రుమేనియా) చేతిలో పరాజయం పాలైంది. కాగా, 26వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్) 6-3, 7-5తో టౌన్‌సెండ్ (అమెరికా)పై, ఎలీస్ మెర్టెన్స్ 6-3, 6-2తో టామ్లజోవిచ్ (రుమేనియా)పై, నీమర్ (జర్మనీ) 6-4, 6-0తో యోయికా (జపాన్)పై, మాడిసన్ కీస్ 6-4, 6-0తో మాయా జాయింట్‌పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరుకొన్నారు. మాజీ చాంపియన్ ఒసాక 6-3, 6-2తో ఓస్టపెంకోను చిత్తు చేసింది. రిబకినా 6-1, 7-6(1)తో అలావాను, పొలెనీ 6-7(5), 6-2, 6-4తో ఆండ్రెస్క్యూను, పెగుల 6-4, 6-3తో రోజర్స్‌ను ఓడించారు.

మూడో రౌండ్‌కు దిమిత్రోవ్..: పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో దిమిత్రోవ్ (బల్గేరియా) 6-1, 6-1, 7-6(4)తో హిజికటా (ఆస్ట్రేలియా)పై నెగ్గాడు. తొలి రౌండ్‌లో వరల్డ్ నెం:1 సిన్నర్ (ఇటలీ) 2-6, 6-2, 6-1, 6-2తో మెక్ డొనాల్డ్ (అమెరికా)పై, అల్కారజ్ (స్పెయిన్) 6-2, 4-6, 6-3, 6-1తో లి టు (ఆస్ట్రేలియా)పై, 5వ సీడ్ మెద్వెదెవ్ 6-3, 3-6, 6-3, 6-1తో లజోవిచ్‌పై, హర్కాజ్ 6-3, 7-6(4), 7-6(3)తో టిమోఫి స్కటోవ్‌పై గెలిచారు. కాగా, 5 గంటల 35 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో డాన్ ఇవాన్స్ (బ్రిటన్) 6-7(6), 7-6(2), 7-6(4), 4-6, 6-4తో కచనోవ్‌పై పోరాడి గెలిచాడు. 1970లో టైబ్రేక్ ప్రవేశపెట్టిన తర్వాత యూఎస్ ఓపెన్‌లో సుదీర్ఘంగా జరిగిన మ్యాచ్‌గా ఇది రికార్డులకెక్కింది. అయితే, సిట్సిపాస్ (గ్రీస్) 6-7(5), 6-4, 3-6, 5-7తో తనాసి (ఆస్ట్రేలియా) చేతిలో పరాజయం పాలయ్యాడు.

యుకీ, బాలాజీ జోడీలకు గెలుపు: డబుల్స్‌లో యుకీ భాంబ్రి, శ్రీరామ్ బాలాజీ జంటలు ముందంజ వేశాయి. తొలి రౌండ్‌లో ఇండో-ఫ్రాన్స్ జంట యుకీ-ఒలివెట్టి 6-3, 6-4తో రెయాన్ సెగర్‌మెన్-ప్యాట్రిక్ త్రహాక్‌పై గెలిచింది. ఇండో-అర్జెంటీనా జోడీ శ్రీరామ్ బాలాజీ-గుడియో ఆండ్రియోజి 5-7, 6-1, 7-6(10)తో మార్కస్ డేనియల్- మిగ్వేల్ ఏంజిల్ రీస్‌పె నెగ్గి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు.

సవాళ్ల ముంగిట షా

క్రికెట్ విస్తరణతోపాటు ఆదాయ పెంపే ప్రధానం



ఐసీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా డిసెంబరు ఒకటిన బాధ్యతలు స్వీకరించనున్నాడు. ప్రస్తుతం షా పదవీ కాలం మూడేళ్లు కాగా.. మరో పర్యాయం కూడా కొనసాగే అవకాశం ఉంది. అంటే దాదాపు ఆరేళ్లపాటు అతడు ఐసీసీ హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించే చాన్సులున్నాయి. కేవలం 35 ఏళ్ల పిన్నవయసులో కీలక బాధ్యతల్ని భుజానికెత్తుకోనున్న జైతో ఐసీసీలో సరికొత్త అధ్యాయం ఆరంభం కానుంది. 2028లో జరిగే లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడంతో.. ఈ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా మరింత ప్రాచుర్యం లభించే కీలక సమయంలో షా పగ్గాలు అందుకోంటున్నాడు. ఈ నేపథ్యంలో తనకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ క్రికెట్‌ను షా ఎలా ముందుకు తీసుకెళ్తాడనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఒక రకంగా జై సమర్థత, పరిపాలనా దక్షతకు పరీక్షా సమయంగానే భావించాలి.

టెస్ట్ క్రికెట్‌ను ఎలా కాపాడాలి?

జై షా ముందున్న ప్రధాన సవాల్ ఇది. ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో సుదీర్ఘ ఫార్మాట్ మనుగడ రోజురోజుకూ కష్టమవుతోంది. పైగా ఆటలో కొత్తగా అడుగు పెట్టిన దేశాలు కూడా టెస్ట్ క్రికెట్‌పై పెద్దగా ఆసక్తి ప్రదర్శించడం లేదు. ఈ నేపథ్యంలో గ్లోబల్ బాడీ హెడ్‌గా షా తీసుకోబోయే నిర్ణయాలకు ఎంతో ప్రాధాన్యం సంతరించుకోనుంది. భారత టెస్ట్ క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులో 300 శాతం బోనస్‌గా ప్రకటించి యువతను టెస్టుల వైపు ఆకర్షించేలా బీసీసీఐ నిర్ణయం తీసుకోవడంలో షా కీలక పాత్ర పోషించాడు.

ఐసీసీ ఈవెంట్ల క్రేజ్‌ను పెంచాలి: 2024 టీ20 వరల్డ్‌కప్‌లో 20 దేశాలు పాల్గొన్నా.. కొన్ని కారణాల వల్ల ఆశించినంత ప్రాచుర్యంతో పాటు ఆదాయం కూడా లభించలేదు. అయితే, ఒలింపిక్స్‌తో రానున్న క్రేజ్‌ను మరింత విస్తరిస్తే.. ఆట మూలాలు మరింతగా బలపడతాయి. ఈ అవకాశం చేజారకుండా చూసుకోవాల్సిన బాధ్యత షాపై ఎంతో ఉంది. ఇక, ఐసీసీ ఈవెంట్ల స్థాయిని మరింతగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. టోర్నీల నిర్వహణతోపాటు వాటిపై వచ్చే ఆదాయం కూడా అదే స్థాయిలో ఉండాలి. ఇటీవలి కాలంలో వన్డే వరల్డ్‌కప్, ఐపీఎల్ ఈవెంట్లను భారత బోర్డు సమర్థంగా నిర్వహించి భారీగా ఆదాయాన్ని కూడా సమకూర్చుకొంది. బ్రాడ్‌కాస్టింగ్ ఒప్పందాలు, పెద్ద ఈవెంట్ల నిర్వహణలో షా ఎంతో సమర్థంగా వ్యవహరించాడు. ఆ అనుభవం ఐసీసీకి లాభించే అవకాశం ఉంది.

క్రికెట్‌కు డేవిడ్ మలాన్ గుడ్ బై



లండన్ : టీ20లలో మాజీ నెంబర్ వన్ బ్యాటర్ డేవిడ్ మలాన్ క్రికెట్ అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పాడు. 36 ఏళ్ల ఈ ఇంగ్లండ్ ఆటగాడు ఈ మేరకు తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించాడు. టాపార్డర్ బ్యాటర్ మలాన్ 22 టెస్టులు, 30 వన్డేలు, 62 టీ20లలో ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. టీ20లలో తిరుగులేని ఆటగాడైన డేవిడ్ 2020లో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. 2022లో ఇంగ్లండ్ జట్టు పొట్టి వరల్డ్ కప్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. గతేడాది భారత్‌లో జరిగిన 50 ఓవర్ల ప్రపంచ కప్ తర్వాత మలాన్ ఇంగ్లండ్ జట్టుకు ఆడలేదు. కాగా..వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు అతడిని ఎంపిక చేయలేదు. తెల్లబంతుల ఫార్మాట్‌లో తాను అంచనాలకు మించి రాణించినా..టెస్ట్ క్రికెట్‌లో నిరాశ పరిచినట్టు మలాన్ అంగీకరించాడు. 'మూడు ఫార్మాట్లను సీరియస్‌గా తీసుకున్నా. ఎందుకనో ఐదు రోజుల మ్యాచ్‌ల్లో నా బ్యాటింగ్ ఆశించిన స్థాయిలో లేకపోయింది' అని తెలిపాడు. లీగ్ క్రికెట్‌కు తాను అందుబాటులో ఉంటానని చెప్పాడు. జాస్ బట్లర్‌తోపాటు మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు చేసిన ఇంగ్లండ్ క్రికెటర్లలో మలాన్ ఒకడు కావడం విశేషం.

శ్రీజేష్ స్థానంలో పాఠక్

ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక



న్యూఢిల్లీ : ఊహించినట్టుగానే పురుషుల హాకీ జట్టు ప్రధాన గోల్ కీపర్‌గా క్రిషన్ బహదూర్ పాఠక్ నియమితుడయ్యాడు. ఈమేరకు రాబోయే ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి 18 మంది సభ్యుల జట్టును హాకీ ఇండియా (హెచ్ఐ) బుధవారం ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత శ్రీజేష్ రిటైర్ కావడంతో అతడి స్థానాన్ని పాఠక్ భర్తీ చేస్తాడని భావించిన సంగతి తెలిసిందే. ఇక..వచ్చేనెల ఎనిమిది నుంచి 17 వరకు చైనాలోని హులున్‌బ్యూయిర్‌లో ఈ చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో పాటు కొరియా, మలేసియా, పాకిస్థాన్, జపాన్, చైనా బరిలో దిగనున్నాయి.

● పోలవరం ప్రాజెక్టును నాశనం చేసిన వారిపై విచారణల గురించి మేం ఆలోచించడం లేదు. ముందు ఆ ప్రాజెక్టు ఎలా పూర్తి చేయాలన్నదాని పైనే దృష్టి పెట్టాం.

● 2019లో మేం మళ్లీ అధికారం చేపట్టి ఉంటే.. 2021 నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది. అయితే జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి పోలవరంపై పగపట్టినట్లుగా వ్యవహరించారు.

- చంద్రబాబు



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రులు





రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు అచ్చెన్న, నాదెండ్ల తదితరులు

● గతంలో మా హయాంలో ఢిల్లీలో తెలుగు అధికారులను తీసుకోవడానికి పోటీలు పడేవారు. వైసీపీ హయాంలో వారిమీద ఒక వ్యతిరేక ముద్ర పడి అందరినీ పక్కన పడేశారు.

● నేను ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి నిధులు కావాలని వినతి పత్రాలు ఇస్తుంటే.. గతంలో ఇచ్చిన నిధులు ఏమయ్యాయో ముందు చెప్పాలని కేంద్ర మంత్రులు నా చేతికి ప్రేమ లేఖలు ఇచ్చి పంపుతున్నారు. ఆ డబ్బులు ఎటుపోయాయా అని మేం ఇక్కడ కిందా మీదా పడి లెక్కలు వెతకాల్సి వస్తోంది.

● అసెంబ్లీ టికెట్లు ఇచ్చే సమయంలో ఎంత కసరత్తు చేశామో ఇప్పుడు నామినేటెడ్ పోస్టులపైనా అంత జాగ్రత్తగా చేస్తున్నాం. కొన్ని పోస్టులు జనసేన, బీజేపీలకు కూడా ఇవ్వాలి. వారితోనూ మాట్లాడుతున్నాం.

- సీఎం చంద్రబాబు

పోలవరానికి 12,127 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరుగుతున్న సమయంలోనే కేంద్ర కేబినెట్ నిర్ణయాల గురించి తెలిసింది. దీంతో మంత్రివర్గ సమావేశం ముగిసిన వెంటనే చంద్రబాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టుకు, పారిశ్రామిక కారిడార్లకు ఆర్థికంగా కేంద్రం సహకరిస్తోందని.. ఇందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. రాష్ట్రంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు కూడా 2019లో సీఎం రూపంలో జగన్మోహన్‌రెడ్డి అనే శనిగ్రహం ఆవహించిందని చంద్రబాబు విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే.. రివర్స్ టెండర్ పేరిట పోలవరం కాంట్రాక్టు సంస్థను మార్చేశారని మండిపడ్డారు. 2019 నుంచి 2021 నవంబరు దాకా పనులే చేయలేదని.. ఫలితంగా 2020లో వచ్చిన వరదకు డయాఫ్రం వాల్ దెబ్బతిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జల సంఘం ఐఐటీ-హైదరాబాద్‌తో అధ్యయనం చేయిస్తే.. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 2020 వరదలకు ఈ వాల్ దెబ్బతిన్నట్లు తేలిందన్నారు. గైడ్ బండ్ కుంగిపోయిందని.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలకు సీపేజీ వచ్చిందని గుర్తుచేశారు. టీడీపీ అధికారంలో ఉండగా 72 శాతం పనులు పూర్తి చేశామని.. 48 రేడియల్ గేట్లు బిగించేందుకు వీలుగా సిద్ధం చేశామని అన్నారు. ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టుపై సమీక్షించానని.. దీనిని పూర్తి చేయడం తన అభిలాషగా పేర్కొన్నారు. కేంద్రం నిధులు ఇస్తున్నందున కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపడతామన్నారు. ఇది పూర్తి చేస్తూనే ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంను కూడా నిర్మిస్తామని.. 2027 మార్చిలోగా తొలి దశ పనులు పూర్తి చేస్తామని వివరించారు.

వారి సహకారం చాలా ఉంది..

అంతకుముందు కేబినెట్ భేటీలో సీఎం మాట్లాడుతూ.. తన ఢిల్లీ పర్యటనలో ప్రధానితో సమావేశమయ్యానని.. పోలవరానికి నిధుల విషయంలో జలశక్తి మంత్రి పాటిల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారం చాలా ఉందన్నారు. వీరి తోడ్పాటుతో పోలవరం నిర్మాణం పూర్తవుతుందన్న భరోసా వచ్చిందని చెప్పారు. 'కేంద్రం మంజూరు చేసిన రూ.12,127 కోట్లలో డయాఫ్రం వాల్ నిర్మాణం పనులకూ నిధులు ఉన్నాయి. 2022లో వాల్ మరమ్మతుల కోసం పిలిచిన టెండర్లను రూ.675 కోట్లకు మేఘా దక్కించుకుంది. ఇటీవల నేను ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్రం ఈ విషయాన్ని ప్రస్తావించింది. మేఘా ఇప్పటికే బిడ్ దక్కించుకున్నందున.. దానికే కొత్త డయాఫ్రం వాల్ బాధ్యత అప్పగిస్తే బాగుంటుందని చెప్పింది. అయితే నిర్మాణ పనుల బాధ్యత తీసుకున్నందున రాష్ట్రానికి పూర్తి అధికారాలు ఉంటాయని.. కాంట్రాక్టు సంస్థ విషయంలో పూర్తి స్వేచ్ఛ మీకే ఉందని వెల్లడించింది. కానీ గతానుభవాన్ని దృష్టిలో ఉంచుకుని.. ప్రస్తుతం నిర్మాణాన్ని చేపడుతున్న మేఘాకే కొత్త వాల్ నిర్మాణ బాధ్యతలు అప్పగించాలని యోచిస్తున్నాం. 2022లో డయాఫ్రం వాల్ మరమ్మతులకు రూ.675 కోట్లకు మేఘా కోట్ చేసింది. ఆ ధరలనే కొనసాగిస్తే.. కొత్త వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు అవుతుందని అంచనా. పాత టెండర్‌ను కొనసాగిస్తూ.. కొత్త వాల్‌కు అవే ధరలు అమలు చేస్తే అదనంగా రూ.340 కోట్లు చెల్లిస్తే సరిపోతుంది. డయాఫ్రం వాల్ నిర్మాణంలో అనుభవం కలిగిన జర్మనీ సంస్థ బావర్‌తో కలసి మేఘా నిర్మించేలా ఒప్పందం కుదిర్చితే భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలూ ఎదురు కాకపోవచ్చు' అని ఆయన మంత్రులతో అన్నారు. తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో.. వాల్ నిర్మాణంలో బావర్ ప్రమేయం ఉండేలా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టంగా చెప్పారు.

సమావేశం మధ్యలో పీఎంవో నుంచి ఫోన్

మంత్రివర్గ సమావేశం జరుగుతుండగా ఢిల్లీ ప్రధాని కార్యాలయం నుంచి ముఖ్యమంత్రికి ఫోన్ వచ్చింది. ఆయన లేచి బయటకు వెళ్లి మాట్లాడి వచ్చారు. 'కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పోలవరం మొదటి దశకు ఇప్పుడే అనుమతి మంజూరు చేశారు. దీనివల్ల రాష్ట్రానికి రాబోయే రెండేళ్లలో రూ.12 వేల కోట్లు రాబోతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి చేయగలమన్న నమ్మకం ఏర్పడుతోంది. రాష్ట్రంలో నాలుగు పారిశ్రామిక పార్కులకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం, నక్కపల్లి పార్కులకు ఆమోదం వచ్చింది' అని మంత్రులతో చెప్పారు. ఈ దిశగా కృషిచేసిన చంద్రబాబుకు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మంత్రులు చప్పట్లు కొట్టారు. జగన్ కేసుల కోసం ఢిల్లీ చుట్టూ తిరిగితే.. చంద్రబాబు నిధుల కోసం తిరుగుతున్నారని, దాని ఫలితాలు రాష్ట్రం పొందుతోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

అసహ్యమేస్తోంది!

- కామ పార్టీల గురించి మాట్లాడాల్సి వస్తోంది: చంద్రబాబు
- వైసీపీ నేతలు, ఐపీఎస్‌ల పనులు వింటుంటే అసహ్యం కలుగుతోంది

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'మేం అధికారంలో ఉంటే ప్రజల వద్దకు పాలన, శ్రమదానం, జన్మభూమి, ఆకస్మిక తనిఖీలు వంటి కార్యక్రమాల గురించి ఆలోచన చేస్తుంటాం.. మాట్లాడుతుంటాం. గత ప్రభుత్వంలో వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఐపీఎస్ అధికారుల కామ కార్యకలాపాల గురించి వినాల్సి వస్తోంది. కామ పార్టీల గురించి మాట్లాడాల్సిన ఖర్మ పట్టింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి పార్టీలు ఎలా మనగలుగుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. బుధవారమిక్కడ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముంబై నటిని విజయవాడ తీసుకువచ్చి ఐపీఎస్ అధికారులు వేధించిన అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'కొందరు ఐపీఎస్‌లు చేసిన పనులు వింటుంటే అసహ్యం కలుగుతోంది. నేను ఎప్పుడూ ఇటువంటివి వినలేదు. మా హయాంలో మా వాళ్లు చిన్న తప్పు చేసినా సీరియస్‌గా తీసుకుంటాను. పిలిచి మాట్లాడతాను. మందలిస్తాను. కానీ గత ప్రభుత్వంలో ఇలాంటివాటిని చాలా తేలిగ్గా తీసుకున్నారు. వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఐపీఎస్ అధికారుల వ్యవహారాలు.. నాడు ప్రభుత్వం నడిపిన వారికి బాధ కలిగించలేదా? పిలిచి మాట్లాడి అదుపు చేయాలని అనిపించలేదా? అసలు పట్టించుకున్నారా? ప్రభుత్వాన్ని నడిపే పద్ధతి ఇదేనా' అని విరుచుకుపడ్డారు. గంజాయి రవాణా, విక్రయాల కోసం భయంకరమైన నెట్‌వర్క్ తయారుచేశారని ధ్వజమెత్తారు. దానిని బద్దలు కొట్టడం సాధ్యమేనా అని అనిపిస్తోందన్నారు. మద్యంలో ఇంకో సామ్రాజ్యం తయారు చేశారని ఆరోపించారు. దశాబ్దాలు మార్కెట్లో ఉండి నిర్దిష్ట నాణ్యతతో నడుస్తున్న బ్రాండ్లను పక్కన పెట్టి సొంత బ్రాండ్లు తీసుకొచ్చి జనం మీద రుద్దడం ఏమిటని నిలదీశారు. నైపుణ్య గణనను పైలెట్ ప్రాజెక్టుగా మంగళగిరిలో ప్రారంభించామని, తర్వాత రాష్ట్రమంతటా చేపడతామని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

ఎస్కోబార్‌పై సిరీస్ చూడండి..

కాలచక్రంలో కొందరు దుర్మార్గులు వస్తుంటారు. నాశనం చేస్తుంటారు. కొలంబియా మాఫియా డాన్ ఎస్కోబార్ చరిత్ర పై నాలుగు సిరీస్‌లు వచ్చాయి చూడండి. అతడికి, ఇక్కడ పాలన చేసిన వ్యక్తికి మధ్య పోలికలు చాలా కనిపిస్తాయి. ఇలాంటి వ్యక్తిని దేశ చరిత్రలో ఎవరూ చూసి ఉండరు. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నేనైతే ఇలాంటివారిని చూస్తానని అనుకోలేదు. రాష్ట్రాన్ని ఇంత నాశనం చేసి కూడా ఇంకా తమ ఘనతల గురించి మాట్లాడుతున్నారు. ఇలాంటి వ్యక్తులు పార్టీలను నడపడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. అనేక రాష్ట్రాలతో పోటీపడి ఎంతో శ్రమకోర్చి కియా కార్ల ఫ్యాక్టరీని రాష్ట్రానికి తెచ్చాం. లక్షల కార్లు అందులో తయారై బయటకు వస్తున్నాయి. దానికి కూడా పారిశ్రామిక రాయితీలు రూ.1,700 కోట్లు బకాయి పెట్టారు. పంచాయతీలకు కేంద్రం రూ.990 కోట్లు ఇస్తే వాటిని దారి మళ్లించి వాడేశారు. ఇలా అనేక శాఖల్లో జరిగింది.

భూతం మళ్లీ విజృంభిస్తుంది..

రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉంటారు. పోరాటాలూ ఉంటాయి. కానీ కనీస విలువలు లేకుండా ప్రభుత్వాలు నడపడం... అడ్డగోలుగా దోచుకోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వం మారగానే బూతులు మాట్లాడడం ఆగిపోయింది. అంతకు ముందు నోరు తెరిస్తే పచ్చి బూతులు మాట్లాడేవారు. ఇప్పుడు కిక్కురుమనడం లేదు. మా వాళ్లు అధికారం ఉన్నా అంత అసహ్యంగా మాట్లాడడాన్ని మేం అనుమతించడం లేదు. ఇవన్నీ తరచూ ప్రజలకు గుర్తు చేయాలి. లేకపోతే భూతం మళ్లీ సమయం చూసుకుని విజృంభిస్తుంది. వైసీపీ హయాంలో ఎవరో మెడ మీద కత్తి పెట్టినట్లు ప్రజలు భయం భయంగా ఉండేవారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ భయాలు పోయి నవ్వు ముఖంతో కనిపిస్తున్నారు.

నెలలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

మా ప్రభుత్వం ఏర్పడి 75 రోజులైంది. వంద రోజులు పూర్తయ్యేలోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తాం. అన్ని కోణాల నుంచీ పరిశీలన జరుపుతున్నాను. ఈ పోస్టులపై కోరికలు విపరీతంగా పెరిగిపోయాయనిపిస్తోంది. పోయిన ప్రభుత్వంలో అందరూ పోరాటం చేశారు. అందరూ బాధలకు గురయ్యారు. అదే సమయంలో వేల మందికి అవకాశాలు రావడం కష్టం. ఉన్నంతలో ఎవరిని ఏ మేరకు సర్దుబాటు చేయాలో చూసి చేస్తాం. దానిని అర్థం చేసుకోవాలి.

ఉచిత ఇసుకపై ఇంకా కసరత్తు

ఉచిత ఇసుకను ఇంకా త్వరితంగా, చౌకగా ప్రజలకు ఎలా అందివ్వవచ్చన్నదానిపై మా కసరత్తు కొనసాగుతోంది. వర్షాకాలం కాబట్టి ఈ సమయంలో నదుల్లో ఇసుక తవ్వలేం. దీంతో లభ్యత తక్కువగా ఉండి సమస్యలు వస్తున్నాయి. లారీలు ఎక్కువ సేపు వేచి ఉండడంతో ఆ భారం కూడా వినియోగదారులపై మోపుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ మరింత పటిష్ఠం చేసి లారీలు గంటా... రెండు గంటలకు మించి వేచి ఉండే పరిస్థితి లేకుండా చేస్తున్నాం. రాత్రి కూడా 8 గంటల సమయంలో టెలికాన్ఫరెన్స్ నిర్వహించాను. బాధ్యతగా భావించి పని చేస్తున్నాను.

కన్నయ్యనాయుడిని బతిమాలి..

గత ప్రభుత్వంలో ఎవరికీ బాధ్యత లేదు. రిజర్వాయర్ల గేట్ల రిపేర్లను కూడా పట్టించుకోకుండా వదిలేశారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోతే.. వరద ప్రవాహంలో ఏమీ చేయలేమని కర్ణాటక ప్రభుత్వం కూడా చేతులెత్తేసింది. ఇందులో నైపుణ్యం ఉన్న కన్నయ్య నాయుడు కంటి ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతిలో ఉన్నా.. ఆయన్ను బతిమాలి తీసుకెళ్లి.. వరద వస్తున్నప్పుడు కూడా గేటు పెట్టగలిగాం. 45 టీఎంసీల నీటిని రక్షించగలిగాం.

రాజీనామా చేసే రావాలి..

వైసీపీ రాజ్యసభ సభ్యులు టీడీపీలో చేరుతుండడంపై విలేకరులు ప్రశ్నించగా.. ఎవరు వచ్చినా తమ పదవులకు రాజీనామా చేసి రావాలని చెబుతున్నామని చంద్రబాబు తెలిపారు. 'మా పార్టీలోకి రావాలనుకునేవారు పదవులకు రాజీనామా చేస్తే వారి వ్యక్తిత్వాలను బట్టి నిర్ణయం తీసుకుంటాం. పార్టీ బలోపేతం కోసం ఎవరి అవసరమైనా ఉందనుకుంటే వారిని తీసుకుంటాం. అదే సమయంలో స్థానికంగా పార్టీ నేతల మనోగతాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాం. జగన్ వంటి వ్యక్తులు పార్టీలను నడపడం ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదం. ఆ కోణంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి వస్తోంది' అని చెప్పారు.

ఒక రోజు ముందే పింఛన్ల పండగ

- 1న ఆదివారం కావడంతో ఈసారి 31నే పంపిణీ

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31వ తేదీనే (శనివారం) పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడం, ఆ రోజు ఉద్యోగులకు సెలవు దినం కావడంతో రాష్ట్ర మంత్రిమండలి ఈ నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో అందుబాటులేకపోవడం తదితర కారణాలతో 31న పింఛన్ అందుకోలేనివారికి సెప్టెంబరు 2న(సోమవారం) అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

వైసీపీ స్థాయికి మనం దిగజారొద్దు!

- ఒకరిద్దరి తప్పులతో మొత్తానికే చెడ్డపేరు
- టీడీపీ ఎమ్మెల్యేల శైలిపై సీఎం సీరియస్
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు చంద్రబాబు స్పందన

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కొందరు టీడీపీ ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. కొందరు ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యుల తీరుపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తలను బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "వైసీపీ స్థాయికి మనం దిగజారొద్దు. నేను ప్రభుత్వ ప్రతిష్ట పెంచేందుకు ఇటుక ఇటుక పేర్చుకొంటూ వస్తుంటే ఎమ్మెల్యేల్లో కొందరు తమ ప్రవర్తనతో జేసీబీలు పెట్టి కూలగొడుతున్నారు. ప్రభుత్వం ఎంత కష్టపడి పనిచేసినా ఒకరిద్దరు చేసే తప్పుల వల్ల ఆ మంచి పక్కకుపోయి చెడ్డపేరు పత్రికల్లో పతాక శీర్షికల్లో వస్తోంది. మనం చేస్తున్న మంచిపై ప్రజల్లో చర్చ జరగాలి తప్ప చెడు పనులపై కాదు. 20 రోజుల్లో మనం వంద రోజులు పూర్తి చేసుకోబోతున్నాం. ఈ సమయంలో మన గురించి ఏ విషయం హైలెట్ కావాలన్నది ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ఆత్మవిమర్శ చేసుకోవాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన మితి మీరకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, మంత్రులపై ఉంది. ఎవరి గురించి వార్తలు వస్తున్నాయో వారిని నేను పిలిపించి మాట్లాడతాను. పదేపదే చెప్పించుకొనే పరిస్థితి తెచ్చుకోవద్దు" అని హెచ్చరించారు. మంత్రులు కూడా తమ జిల్లాల్లో ఏం జరుగుతోందో చూసుకోవాలని, తప్పులు జరుగుతుంటే సరిచేసే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. "జగన్ హయాంలో ఎవరు ఏం చేసినా పట్టించుకునేవారు, దిద్దుకోమని చెప్పేవారు లేరు. మనం వారి స్థితికి దిగజారవద్దు" అని చంద్రబాబు సూచించారు.

తణుకు టీడీఆర్ బాండ్ల విలువ తగ్గింపు!

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల స్కాంపై మున్సిపల్‌శాఖ కొరడా ఝుళిపించింది. తణుకులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై ఇప్పటికే విచారణ జరిపిన అధికారులు టీడీఆర్ బాండ్ల విలువను తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నారు. గతంలో టీడీఆర్ బాండ్లను జారీచేసే సమయంలో విచ్చలవిడిగా డోర్ నెంబర్లు వేసి, దాని మార్కెట్ రేటు ఆధారంగా విలువ లెక్కించి బాండ్లు పొందారు. ఒక్క తణుకులోనే సుమారు రూ.700 కోట్ల టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు. తాజాగా మున్సిపల్‌శాఖ ఈ టీడీఆర్ బాండ్ల విలువను తగ్గించేందుకు చర్యలు తీసుకుంది. డోర్ నెంబర్ల ఆధారంగా కాకుండా సర్వే నెంబర్ల ఆధారంగా మార్కెట్ విలువను గుర్తించి ఆ మేరకు బాండ్లను మార్పు చేయాలని ఆదేశాలిచ్చింది. బాండ్ల మంజూరు సమయంలో అక్రమాలకు పాల్పడిన అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తుల జోక్యం ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాలని మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏకే సింఘాల్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

ఆక్రమణలపై మరో భూ పోరాటం: రామకృష్ణ

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ ఆక్రమణలు, భూ దందాలు పెరిగిన నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మరో భూ పోరాటాన్ని ప్రారంభిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. భూ ఆక్రమణలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీఎం చంద్రబాబు చెబుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన భూ బాధితుల రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్రంలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో భూ ఆక్రమణలు కూడా అదేస్థాయిలో పెరిగిపోయాయి. కడప జిల్లాలో 22ఏ పేరుతో ఫ్రీ హోల్డ్‌లో పెట్టిన భూములన్నీ ఒకే కులం వారి చేతుల్లోకి వెళ్లిపోయాయి. మదనపల్లెలో భూదందాల ఆధారాలు చెరిపేయడానికి ఏకంగా సబ్ కలెక్టర్ కార్యాలయాన్నే దహనం చేసే స్థాయికి బరితెగించారు. భూ ఆక్రమణలకు పాల్పడిన వారిని, వారికి సహకరించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పేదలకు న్యాయం జరిగేవరకు కమ్యూనిస్టు పార్టీ తరఫున పోరాటం చేస్తాం' అని ప్రకటించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి బాధితులు తీసుకువచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని రామకృష్ణ చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, జంగాల అజయ్ కుమార్ తదితరులు మాట్లాడారు.

సెబ్ రద్దు

ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణకు కేబినెట్ ఆమోదం

- రివర్స్ టెండరింగ్‌కూ మంగళం
- మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) రద్దుకు తీర్మానించింది. జగన్ సర్కారు 2019లో తెచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దుచేయాలని, దాని స్థానంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) మార్గదర్శకాలతో కూడిన సంప్రదాయ టెండర్ విధానం అమలు చేయాలని నిశ్చయించింది. సాగునీటి వినియోగదారుల సంఘాలకు 3నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు తెలిపారు. గత ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీ వల్ల రాష్ట్రానికి రూ.18,860 కోట్ల నష్టం వాటిల్లిందని, ప్రజల ఆరోగ్యాలు కూడా దెబ్బతిన్నాయని.. ఈ నేపథ్యంలో నూతన ఎక్సైజ్ పాలసీ తీసుకురావాలని చంద్రబాబు సూచించారని చెప్పారు. '2019కి ముందు ఎగ్జిక్యూటివ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్టిలరీ విభాగాలు ఒకే లైన్ ఆఫ్ కంట్రోల్‌లో సమర్థంగా పనిచేసేవి. 2020 మేలో సెబ్ ఏర్పాటుతో ఎక్సైజ్ సిబ్బందికి, సెబ్‌కి మధ్య సమన్వయ లోపం ఏర్పడింది. దీంతో గత ఐదేళ్లలో ఎన్డీపీఎల్ నేరాల సంఖ్య 66శాతానికి పెరిగింది. గత ప్రభుత్వం సెబ్‌ను ఆదాయం పెంచుకునేందుకు వినియోగించలేదు. సెబ్‌లోని సిబ్బందిని ఎక్సైజ్ శాఖలో ఉంచాలని కేబినెట్ ప్రతిపాదించింది' అని చెప్పారు. సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలోని ఓటర్లను కలిపి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయిందని, సీఎం చంద్రబాబు సమయస్ఫూర్తితో కర్ణాటక ప్రభుత్వ సమన్వయంతో మూడు రోజుల్లోనే సమస్యను పరిష్కరించామని తెలిపారు. సీఎం చొరవకు కేబినెట్ ప్రత్యేక అభినందనలు తెలిపిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టులను సమగ్రంగా పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపడతామని వెల్లడించారు. వర్షాలు బాగా కురుస్తున్నందున ప్రస్తుత సీజన్‌లో అన్ని రిజర్వాయర్లు, చెరువులు నిండే విధంగా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని చెప్పారు. విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రతిఒక్కరూ భాగస్వాములను చేయాలని.. వారి సలహాలు, సూచనలు ప్రతిబింబించే విధంగా ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేయాలని సూచించారని వెల్లడించారు. ఇందుకోసం గ్రామసభలు నిర్వహించి ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, ఆలోచనలు తెలుసుకోవాలని ఆదేశించారని తెలిపారు. 2014-19 మధ్యకాలంలో నిర్వహించిన కాగిత రహిత కేబినెట్ తరహాలో.. ఢిల్లీలోని ఎన్ఐసీ అధునాతన సాంకేతికపరిజ్ఞానంతో రూపొందించిన బహుళ ఫీచర్లతో కూడిన సమగ్ర అప్లికేషన్ ఆధారంగా బుధవారం మొదటి ఈ-కేబినెట్ నిర్వహించినట్లు పార్థసారథి చెప్పారు. ఈ విధానంలో మంత్రివర్గ ఎజెండా, కేబినెట్ నోట్స్ ఇలా అన్నీ ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయన్నారు.

కేబినెట్ మరిన్ని నిర్ణయాలివీ.. అన్ని శాఖల్లో రివర్స్ రద్దు..

గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానంతో తనకు కావలసిన వారికి సింగిల్ టెండర్‌తో పనులు దక్కేలా వ్యవహరించింది. దీంతో అన్ని ఇంజనీరింగ్ శాఖల్లో రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేయాలని కేబినెట్ తీర్మానం. దేశంలో అత్యుత్తమ చీఫ్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) మార్గదర్శకాలతో కూడిన పాత టెండర్ల విధానమే అవలంబించాలని నిర్ణయం.

ఎడమ కాలువ పనులు పునరుద్ధరణ

పోలవరం ఎడమ కాలువ పనులు పునరుద్ధరణకు ఆమోదం. ప్రస్తుతం పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థతోనే పనులు కొనసాగించేందుకు అంగీకారం. ప్రస్తుత ఏజెన్సీలు తమ అగ్రిమెంట్ రేట్లు, ఒప్పందాల ప్రకారం పనులు కొనసాగించాలి. 6 వేల క్యూసెక్కుల సామర్థ్యమున్న ఎడమ కాలువ పనుల పూర్తికి తయారుచేసిన సమగ్ర ప్రణాళికకు ఆమోదం. రూ.1,226 కోట్ల అంచనా వ్యయంతో 2024-25లో ఎల్ఎస్ విధానంలో టెండర్లకు ఆమోదం. తొలుత విశాఖకు ఎత్తిపోతల విధానంలో గోదావరి జలాలు. పోలవరం పూర్తయ్యాక గ్రావిటీ ద్వారా పూర్తి స్థాయిలో నీరు.



కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

జగన్ పేరు, బొమ్మలు, పార్టీల లోగోలు ఉండవ్

పట్టాదార్ పాస్‌పుస్తకాలపై జగన్ పేరు, బొమ్మలు, రాజకీయ పార్టీల లోగో తొలగించేందుకు ఆమోదం. 21.86 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలపై కొత్తగా రాజముద్ర ముద్రించి ఇవ్వాలని నిర్ణయం. 77లక్షల సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగించి వినియోగం. 22ఏ, ఫ్రీహోల్డ్ భూములు వివాదాలపై రెవెన్యూ సదస్సుల నిర్వహణ. వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేత. ఫైళ్ల దహనం ఘటనల నేపథ్యంలో 29లక్షల ఫ్రీ-హోల్డ్ ల్యాండ్స్‌పై విచారణ. వీటిలో 16.66 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు స్పష్టత. ఫ్రీహోల్డ్‌లో ఉన్న 25,230 ఎకరాల రిజిస్ట్రేషన్. అన్యాక్రాంతమైన భూములపై గ్రామసభల్లో చర్చ. అవి ఎలా అన్యాక్రాంతమయ్యాయో తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని సీఎం ఆదేశం.

- కొత్తగా 2,774 రేషన్ దుకాణాల ఏర్పాటుకు నిర్ణయం. వీటిలో ఈ-పోస్ యంత్రాల కొనుగోలుకు రూ.11.51 కోట్లు విడుదల.
- కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరు ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా మార్పు. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌లకు కూడా పేర్లు మార్చాలని నిర్ణయం.
- పాత ఉచిత ఇసుక పాలసీ పునరుద్ధరణకు ఆమోదం. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాల నియామకాల సమయంలో బీకాం అర్హత కలిగిన వారు అనర్హులని తిరస్కరించడంతో అప్పట్లో 269 మంది కోర్టుకెళ్లారు. కోర్టు వారిని ఉద్యోగాల్లో నియమించాలని ఆదేశించింది. వారిని పురపాలక-పట్టణాభివృద్ధిశాఖలో నియమించేందుకు 269 సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించాలని కేబినెట్ నిర్ణయం.

సెబ్ రద్దుతో బానిసత్వం పోయింది: ఎక్సైజ్ జేఏసీ

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను రద్దు చేయాలని కేబినెట్ చేసిన తీర్మానంపై ఎక్సైజ్ శాఖ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. బుధవారం కేబినెట్ తీర్మానం చేసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ కార్యాలయాల్లో బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. సెబ్‌ను రద్దు చేసినందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ఎక్సైజ్ జేఏసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి ఎంకే మీనాను కలిసి ధన్యవాదాలు తెలిపారు.



మంత్రి కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు చెబుతున్న ఎక్సైజ్ ఉద్యోగులు

జ్యుడీషియల్ ప్రివ్యూ వృథా

- దాంతో అక్రమాలకు సర్టిఫికెట్
- సీవీసీ నిబంధనల మేరకే టెండర్లు
- మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చ

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): టెండర్ల విధానంలో వైసీపీ సర్కారు అవలంబించిన జ్యుడీషియల్ ప్రివ్యూతో ఎలాంటి ప్రయోజనం లేదని మంత్రివర్గం అభిప్రాయపడింది. దీనివల్ల టెండర్ల అక్రమాలకు రిటైర్డ్ జడ్జితో ఆమోద ముద్ర వేయించుకోవమేనని మంత్రులు పేర్కొన్నారు. కేంద్రం సహా అన్ని రాష్ట్రాలు టెండర్ల విధానంలో కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) గైడ్‌లైన్స్‌నే అనుసరిస్తున్నాయని, రివర్స్ టెండరింగ్ స్థానంలో రాష్ట్రంలో కూడా వాటినే అనుసరించాలని భావించింది. బుధవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు.

- రేషన్ బియ్యం పంపిణీ వాహనాలు అనవసరమని మెజారిటీ మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ వాహనాలు కొనేందుకు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్నారని, మధ్యలోనే వాటిని తీసివేయడం ఇబ్బందికరమని అధికారులు చెప్పారు. వాటిని మరో పనికి వాడటంపై యోచించాలని మంత్రులు సూచించారు.
- రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మరపట్టించి సార్టెక్స్ పేరుతో నాణ్యత పెంచడం అనేక అక్రమాలకు తావిస్తోందని, సార్టెక్స్ లేకపోతే అక్రమాలు తగ్గుతాయని ఒక మంత్రి అభిప్రాయపడ్డారు. కానీ, సార్టెక్స్ చేయకపోతే బియ్యం నాణ్యత తగ్గుతుందని, దీనిపై మరింత అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.
- వైసీపీ హయాంలో ఫ్రీ హోల్డ్ చేసిన అసైన్‌మెంట్ భూములపై మరింత లోతుగా పరిశీలన చేయించాలని మంత్రివర్గం చర్చించింది. మొత్తం 13 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారని, దీనిలో సుమారుగా లక్ష ఎకరాలు దళితుల నుంచి దళితేతరుల చేతికి వెళ్లిందని అధికారులు వివరించారు. మిగిలిన వాటిలో కూడా దళితులను బినామీలుగా పెట్టి వైసీపీ పెద్దలు చేజిక్కించుకొని ఉండవచ్చన్నారు.
- ఉచిత ఇసుక విధానం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని పలువురు మంత్రులు తెలిపారు. రవాణా చార్జీలు తగ్గుముఖం పడుతున్నాయని, విశాఖ నగరంలోనే ధర కొంత ఎక్కువగా ఉందని కొందరు మంత్రులు పేర్కొన్నారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తే ఇసుక లభ్యత పెరుగుతుందని కొందరు మంత్రులు సూచించగా దానిపై ఆలోచన చేయాలని సీఎం ఆదేశించారు. వీలైనన్ని ఎక్కువ రేవుల్లో ఇసుక తీసేలా చూస్తే లభ్యత పెరిగి రేట్లు అందుబాటులోకి వస్తాయని కొందరు మంత్రులు సూచించారు. 2019 రేట్ల స్థాయికి ధరను తగ్గిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

మంత్రులకు ప్రోగ్రెస్ రిపోర్ట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా మంత్రులందరికీ వారి పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇస్తానని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎవరి పనితీరు ఎలా ఉందో? ఏయే విషయాల్లో బాగా పనిచేస్తున్నారో? ఎక్కడ లోపాలు ఉన్నాయో? ఆ రిపోర్టుల్లో వివరిస్తానని చెప్పారు. ఇదిలావుంటే, మంత్రివర్గ సమావేశ ఎజెండా సహా ప్రభుత్వ పరమైన సమాచారం ముందే బయటకు వస్తోందని మంత్రులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు.

1 నాటికి 30 ఏళ్లు

చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యి వచ్చే సెప్టెంబరు 1నాటికి 30 ఏళ్లు అవుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రస్తావించారు. ఈ సందర్భంగా మంత్రులంతా ఆయనకు అభినందనలు తెలిపారు. 2న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు అని మరో మంత్రి చెప్పడంతో ఆయనకు కూడా ముందస్తు అభినందనలు తెలిపారు. అయితే, తాను పుట్టిన రోజు చేసుకోనని, ఆ రోజు దేశంలో ఉండటం లేదని పవన్ కల్యాణ్ చెప్పారు.

తొలిసారి ఈ-క్యాబినెట్

మంత్రివర్గ సమావేశం తొలిసారి పేపర్ రహితంగా ఈ-క్యాబినెట్ విధానంలో జరిగింది. మంత్రివర్గ ఎజెండా, వారి పరిశీలనకు పంపిన పత్రాలు అన్నీ వారికి అందచేసిన ట్యాబ్‌లోనే ఉన్నాయి. ఒక్క పేపర్ కూడా వాడలేదు. దీనికోసం మంత్రులను 20 నిమిషాల ముందే సమావేశానికి రావాలని సూచించారు. ఈ-క్యాబినెట్‌పై వారికి కొందరు సాంకేతిక నిపుణులు వివరించారు. మంత్రి సవిత ఒక్కరే ఆలస్యంగా వచ్చారు. ప్రతి మంత్రికీ ఎంబీఏ పూర్తి చేసిన ఒక ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌ను ఇవ్వడంపై మంత్రివర్గం చర్చించింది. శాఖాపరంగా మంత్రులకు సహాయపడేలా వీరిని నియమించాలని భావిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రతి శాఖ ప్రచారం పెరిగేలా చూడటానికి ఒక ఉద్యోగిని ఇచ్చే విషయంపైనా చర్చించారు.

ఎంత ఉదారత 'బాబూ'!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించలేదు. కానీ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన సొంత నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లందరికీ చంద్రబాబు ప్రభుత్వం బిల్లులు విడుదల చేసింది. పులివెందులలో బిల్లుల కోసం జగన్‌ను నిలదీసినంత పనిచేసిన కాంట్రాక్టర్లతో పాటు కడప, రాజంపేట, రాయలసీమలోని ఇతర ప్రాంతాల్లో పనులకు సంబంధించి దాదాపు రూ.100 కోట్ల బిల్లులను ఈ నెల 23వ తేదీన చెల్లించేశారు. పాత బిల్లులు చెల్లిస్తే ఆర్డర్‌లో ఇవ్వాలి. ఎప్పుడో గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఇప్పటికీ కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. అయితే గత ఎన్నికల ముందు పనులు చేసిన వారికి ఆగమేఘాలపై బిల్లులు చెల్లించడంపై చంద్రబాబుకు ఎంత ఉదారత అంటూ టీడీపీ కేడర్ నుంచే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ హయాంలో బిల్లుల కోసం ఆర్థిక శాఖ చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగినా న్యాయం జరగని బాధితులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

జగన్ కళ్లలో ఆనందం కోసమేనా?

పులివెందుల ఎమ్మెల్యే జగన్ కళ్లలో ఆనందం కోసం ఆర్థిక శాఖ అధికారులు ఆగమేఘాలపై కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో జగన్‌ను నిలదీసిన వారి బిల్లులన్నీ ఆర్థిక శాఖ అధికారి చకచకా చెల్లించేశారు. ఈ బిల్లులు చెల్లించాలంటే అంతకంటే ముందు బకాయి పడ్డ బిల్లులన్నీ చెల్లించాలి. పెండింగ్ బిల్లులన్నీ దాదాపు రూ.లక్షన్నర కోట్లకు పైగా ఉన్నాయి. వాటిని పక్కనబెట్టి ఈ బిల్లులు చెల్లించారు. వైసీపీ హయాంలో బిల్లులు రాక ఇబ్బందులు పడ్డవారిలో టీడీపీ సానుభూతిపరులే ఎక్కువమంది ఉన్నారు. వారి బిల్లులు త్వరగా చెల్లించాలని ప్రస్తుతం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నారు. కానీ ఒక్క బిల్లు చెల్లింపు కూడా జరగలేదు. అలాంటిది ఎవరు సిఫారసు చేస్తే పులివెందుల, రాజంపేట, కడపకు చెందిన వారి బిల్లులు చెల్లించారు? జగన్ కళ్లలో ఆనందం కోసమే చెల్లింపులు చేశారా? ఫిఫో ఉల్లంఘించి మరీ చెల్లించాల్సిన అవసరమేంటి? ఈ ప్రశ్నలకు ఆర్థిక శాఖ సమాధానాలు చెప్పాలి.

గతంలో టీడీపీ గగ్గోలు

గత ఐదేళ్ల జగన్ పాలనలో బిల్లుల చెల్లింపుల్లో ఫిఫో పాటించడం లేదంటూ గగ్గోలు పెట్టింది టీడీపీ. ఇప్పుడు టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అయినా అదే తప్పును కొనసాగిస్తున్నారు. ఇప్పుడు ఆర్థిక శాఖా మంత్రిగా ఉన్న పయ్యావుల కేశవ్... గతంలో పీఏసీ చైర్మన్ హోదాలో పెండింగ్ బిల్లుల్లో ఫిఫో పాటించడం లేదని అనేకసార్లు జగన్ సర్కార్‌ను విమర్శించారు. ఇప్పుడు ఆయనే ఆర్థిక మంత్రిగా ఉన్నారు. అయినప్పటికీ తప్పును సరిచేయకపోగా అదేదో తప్పనిసరి సంప్రదాయమైనట్టు ఫిఫో ఉల్లంఘనలను కొనసాగిస్తున్నారు.

పీయూష్ వద్దే బిల్లుల చెల్లింపులు

ప్రస్తుతం ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ బిల్లుల చెల్లింపు వ్యవహారాలు చూస్తున్నారు. మొదట్లో వినయ్ చంద్‌ను ఆర్థిక కార్యదర్శిగా నియమించినప్పుడు బిల్లుల వ్యవహారాలు ఆయనకు అప్పజెప్పారు. వినయ్ చంద్‌ను ఆర్థిక శాఖ నుంచి అకస్మాత్తుగా బదిలీ చేశారు. సాయంత్రం బదిలీ ఆదేశాలు వస్తాయనగా ఆ రోజు ఉదయమే బిల్లుల చెల్లింపు బాధ్యతలను వినయ్ చంద్ నుంచి తప్పించి పీయూష్ కుమార్ తన వద్దే ఉంచుకున్నారు.

ఇదేం విధానం?

ఉద్యోగుల బిల్లులు రూ.25,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వైసీపీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. తమ బిల్లులు రూ.32,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఉద్యోగులు చెప్తున్నారు. బిల్లు చెల్లింపుల కోసం కోర్టులో వేలకొద్దీ పిటిషన్లు పడ్డాయి. రూ.10 లక్షల్లోపు బిల్లులు పెండింగ్‌లో ఉన్నవారు చాలామంది ఉన్నారు. ఏడేళ్ల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్న బాధితులు ఉన్నారు. వీరందరినీ పక్కన పెట్టి జగన్ మనుషులకు బిల్లులు చేయడంలో ఆర్థిక శాఖ అంతర్యం ఏమిటి? పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో ఒక విధానమంటూ ఉందా?

ప్రాణం ఖరీదు 17 కోట్లు!



చిన్నారి అక్షయతో తల్లిదండ్రులు

రెండేళ్ల చిన్నారికి స్పైనల్ మస్కులర్ అట్రోఫీ

జోల్‌జెన్‌స్మా ఇంజెక్షన్ ఖరీదు రూ.17 కోట్లు

దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

గోనెగండ్ల, ఆగస్టు 28: బుడిబుడి నడకలతో నట్టింట ఆడుకోవాల్సిన రెండేళ్ల చిన్నారి స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే అరుదైన వ్యాధి బారిన పడి ప్రాణాలతో పోరాడుతోంది. ఇది నయం కావాలంటే రూ.17 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఇవ్వాలి. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి అంత స్థోమత లేదు. అందుకే దాతలు ముందుకొచ్చి తమ పాప ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన బొగ్గుల నరేష్, మరియమ్మలది నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబం. వీరికి ముగ్గురు కుమార్తెలు. రెండో అమ్మాయి అక్షయ వయస్సు రెండేళ్లు. ఆమెకు అంతుచిక్కని వ్యాధి సోకింది. నెల రోజుల క్రితం ఆ చిన్నారిని ఆదోనిలోని న్యూరోసర్జన్ వద్దకు అక్షయను తీసుకెళ్లారు. అక్కడ పాపను పరీక్షించిన వైద్యులు వ్యాధి లక్షణాలను బట్టి ఆమె బ్లడ్ శ్యాంపిల్‌ను హైదరాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబ్‌కు పంపగా స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అని తేలింది. ఈ వ్యాధి నయమై పాప ప్రాణాలు దక్కాలంటే జోల్‌జెన్‌స్మా అనే ఖరీదైన ఇంజెక్షన్ చేయించాలని, దాని ఖరీదు రూ.17 కోట్లు ఉంటుందని వైద్యులు చెప్పారు. కూలి పనులు చేసుకుని బతికే వారికి అంత స్థోమత లేదు. దీంతో దాతలు, ప్రభుత్వం స్పందించి తమ బిడ్డకు ప్రాణదానం చేయాలని చిన్నారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాయం చేయదలచిన వారు బొగ్గుల మరియమ్మ బ్యాంకు ఖాతా (గోనెగంట్ల ఎస్‌బీఐ బ్రాంచ్ అకౌంట్ నంబరు 37835985315, IFSC code SBIN0003733)కు నగదు బదిలీ చేయాలని వేడుకుంటున్నారు. మరిన్ని వివరాలకు నాగేష్ ఫోన్ నంబర్ 9110519554ను సంప్రదించవచ్చని చెప్పారు.

అబద్ధాల పునాదులపై జగన్ రాజకీయం

- ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు
- మంత్రి సత్యకుమార్ బహిరంగ లేఖ



అమరావతి(ఆంధ్రజ్యోతి), విడపనకల్లు, ఆగస్టు 28: 'జగన్మోహన్ రెడ్డి అబద్ధాల పునాదులపై ప్రజా వ్యతిరేక రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు తర్వాత కూడా గుణపాఠం నేర్చుకోలేదు' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 27న జగన్ ఎక్స్‌లో... 'నేను ఆరోగ్య రంగాన్ని సమూలంగా మార్చాను. ఇప్పుడు వాటన్నింటినీ రద్దు చేస్తున్నారు' అంటూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ... తాజా అబద్ధాల్లో ఇదొకటని విమర్శించారు. బుధవారం మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి ఆయన బహిరంగ లేఖ రాశారు. దానిలో 2019-24మధ్య కాలంలో ఏపీలో ఆరోగ్య పరిస్థితులకు సంబంధించిన కొన్ని వాస్తవాలను సత్యకుమార్ వివరించారు. 'అబద్ధాల పునాదిపై ఆధారపడి మీరు మీ బ్రాండ్ రాజకీయాలను కొనసాగిస్తున్నారు. ఆగస్టు 27న రాష్ట్రంలో కాలానుగుణ వ్యాధులపై సమీక్షించాం. 2022 కంటే 2023లో మలేరియా వ్యాధి 250శాతం పెరిగిందని దానిలో వెల్లడయింది. ఆ క్రెడిట్ మీ (జగన్) సర్కారుకే చెందుతుంది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ఆస్పత్రులకు దాదాపు రూ.2,000 కోట్లు బకాయిలు పెట్టారు. సరైన నిర్వహణ లేకపోవడం వల్ల 104, 108 వాహనాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వైసీపీ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందంటూ మీరు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవాలు అత్యంత దయనీయంగా ఉన్నాయి. 2024-25 ఏడాదికి మొదటి బ్యాచ్‌లో అడ్మిషన్లు జరిగాయి. కాని ఇప్పటికీ వాటిలో ఫ్యాకల్టీ, మౌలిక సదుపాయాల కొరత ఉంది. రాష్ట్రంలో గాడి తప్పిన ప్రజారోగ్య నిర్వహణను మళ్లీ పట్టాలపైకి తీసుకురావడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. కాగా, అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామంలోని మారెమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తన ఐదేళ్ల పాలనలో జగన్ భ్రష్టు పట్టించిన వ్యవస్థలను, రాష్ట్రాన్ని గాడీలో పెట్టడానికే కనీసం 10 సంవత్సరాల సమయం పడుతుందని అన్నారు.

'వైపీఎస్'లపై ఎఫ్ఐఆర్‌లు?

(మొదటి పేజీ తరువాయి)



అన్బురాజన్



ఫక్కీరప్ప



విజయారావు

ఈ వ్యవహారం పార్లమెంటులో చర్చకు దారితీసింది. అయినా జగన్ ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదు. ఇటీవల ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే రఘురామ గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 2021లో సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్, ఇంటెలిజెన్స్ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు తనను అంతమొందించే కుట్ర చేశారని పేర్కొన్నారు. దీంతో గుంటూరు పోలీసులు ఇద్దరు సీనియర్ ఐపీఎస్‌లపై హత్యాయత్నం కుట్ర కేసు నమోదు చేశారు. ఈ ఇద్దరితో పాటు ప్రతిపక్షాలను హింసించడమే పనిగా వ్యవహరించిన విజయ్ పాల్ అనే అడిషనల్ ఎస్పీని సైతం నిందితుల జాబితాలో చేర్చారు. శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడి నుంచి అనంతపురంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడి వరకూ ఎవరినీ వదలకుండా పీఎస్ఆర్ ఆంజనేయులు జైలుకు పంపారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద రావు జీవితం అర్ధాంతరంగా ముగిసి పోవడానికి ఈ ఐపీఎస్ అధికారి వేధింపులే కారణమని అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు కోడైకూశాయి. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ ధనదాహం కోసం పలువురు ఐఏఎస్ అధికారులు జైలు పాలయ్యారు. జగన్ పాలనలో నిబంధనలకు భిన్నంగా వ్యవహరించిన ఐపీఎస్‌లను ఇప్పుడు కేసులు వెంటాడుతున్నాయి.

కాంతి రాణా, విశాల్ గున్నీపై...

అధికార పార్టీ మెప్పు పొందడం, కీలక పోస్టింగ్‌లు దక్కించుకోవడం కోసం ఐజీ ర్యాంకు అధికారి కాంతి రాణా, డీఐజీ ర్యాంకు ఐపీఎస్ విశాల్ గున్నీ చేయని అక్రమాల్లేవు. దేశానికి సేవ చేయాల్సిన ఐపీఎస్‌లమనే విషయాన్ని పూర్తిగా పక్కన బెట్టి వైసీపీ నేతల సేవలో తరించారు. అసెంబ్లీ సాక్షిగా విశాల్ గున్నీ రాజధాని రైతులపై ఎత్తిన లాఠీ ఎంతమంది ఒంటిపై వాతలు పెట్టిందో లెక్కలేదు. అమరావతికి జై అన్నందుకు దళిత రైతులపై అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన ఘనత గుంటూరు ఎస్పీగా ఆయనకే దక్కుతుంది. విజయవాడ డీసీపీగా ముంబై నటిని ఇక్కడికి తీసుకొచ్చి మొత్తం కుటుంబాన్నే బెదిరించిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇందులో పూర్తిగా సహకారం అందించిన అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాకు ఇబ్బందులు తప్పేలా లేవు. బాధితులు, కుటుంబ సభ్యులు ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే చర్య తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సీబీఐతోనే అన్బురాజన్, ఫక్కీరప్ప ఢీ

కడప ఎస్పీగా చరిత్రలో ఎవరూ చేయనంతగా సుదీర్ఘకాలం పనిచేసిన కేకేఎన్ అన్బురాజన్, అనంతపురం ఎస్పీగా పనిచేసిన ఫక్కీరప్ప కాగినెల్లి ఏకంగా సీబీఐతోనే పెట్టుకున్నారు. జగన్ చిన్నాన్న వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసు దర్యాప్తు చేసేందుకు సీబీఐ నియమించిన అధికారుల బృందం గత ప్రభుత్వంలో అసలు హంతకుల వైపు మళ్లింది. వెనకున్న పెద్దల్ని బయటికి లాగేదాకా వెళ్లడంతో వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి కోర్టు హాల్లోనే సీబీఐ అధికారుల బృందానికి నాయకత్వం వహిస్తున్న ఎస్పీ రామ్‌సింగ్‌పై చిందులేశారు. ఆ వెంటనే కడప ఎస్పీ అన్బురాజన్‌కు అవినాశ్ అనుచరుడు గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి (వివేకా హత్య కేసు నిందితుడు) ఫిర్యాదు చేయడంతో రిమ్స్ పోలీసు స్టేషన్లో సీబీఐ అధికారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ రాష్ట్రంతో కానీ, ఇక్కడి రాజకీయాలతో కానీ సంబంధం లేని ఉత్తరాదికి చెందిన సీబీఐ అధికారిపై కేసు నమోదుచేయడం అప్పట్లో జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఆ తర్వాత తాడిపత్రిలో ఉంటున్న మరో వ్యక్తిని ఈ కేసులో ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు నోటీసు ఇవ్వగా.. తనను బెదిరిస్తున్నారంటూ ఆయనతో అనంతపురం ఎస్పీ ఫక్కీరప్పకు వైసీపీ పెద్దలు ఫిర్యాదు చేయించారు. ఇంకేముంది ఫక్కీరప్ప వెంటనే తాడిపత్రి పోలీసులతో కేసు నమోదు చేయించారు. దీంతో రామ్‌సింగ్ బృందం ఢిల్లీలోని సీబీఐ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లి జగన్ పార్టీ కుట్రల్ని వివరించింది. అంతకన్నా పై స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించిన సీబీఐ వివేకా కేసులో సంబంధం ఉన్న ఒక్కొక్కరినీ అరెస్టు చేసింది. అందులో గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం.

డీజీపీకి సీబీఐ డైరెక్టర్ లేఖ

వైసీపీ ప్రభుత్వంలో ఐపీఎస్ అధికారులు చేసిన తప్పులు ఇప్పుడు వారి మెడకు చుట్టుకొంటున్నాయి. పది రోజుల క్రితం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఢిల్లీలోని సీబీఐ డైరెక్టర్ నుంచి లేఖ వచ్చింది. సంచలనం సృష్టించిన ఒక హత్య కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపైనే కేసులు నమోదు చేయించిన ఏపీ పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ముఖ్యంగా అప్పటి కడప ఎస్పీ అన్బురాజన్, అనంతపురం ఎస్పీ ఫక్కీరప్ప దర్యాప్తునకు అడ్డుపడ్డారంటూ వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశించినట్లు తెలిసింది. నెల్లూరులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిపై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కేసులో ఏకపక్షంగా వ్యవహరించిన అప్పటి నెల్లూరు ఎస్పీ విజయా రావుపైనా చట్టపరమైన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది.

జ్వర పీడ నుంచి రాష్ట్రాన్ని రక్షించండి: వైఎస్ షర్మిల



అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విష జ్వరాల పీడ నుంచి రాష్ట్రాన్ని రక్షించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎక్స్‌లో ఆమె స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో పెరుగుతున్న విష జ్వరాలను నివారించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. గ్రామీణ, పట్టణ, అటవీ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. మందుల కొరత లేకుండా చూడాలి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలాయి. వీటిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి' అని షర్మిల కోరారు.

పోలవరానికి రూ.12 వేల కోట్లు

- కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.12 వేల కోట్లకు కేంద్రం ఆమోదం తెలిపిందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. గత టీడీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 74శాతం పూర్తయిందని, జగన్ పాలనలో పూర్తిగా పడకేసిందని విమర్శించారు. పోలవరం పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించే బాధ్యతను తాము కూడా తీసుకుంటామన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తి స్మార్ట్ సిటీల అభివృద్ధితో కొత్తగా దాదాపు లక్ష ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఓర్వకల్లులో 45 వేలు, కొప్పర్తిలో 54,500 ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ రెండు స్మార్ట్ సిటీల అభివృద్ధికి మొత్తం రూ.4,923 కోట్లు ఖర్చు పెట్టనున్నట్లు తెలిపారు. ఓర్వకల్లు నోడ్‌లో ఫుడ్, బేవరేజెస్, టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్ తదితర కంపెనీలు వస్తాయన్నారు. కొప్పర్తి నోడ్‌లో పునరుత్పాదక ఇంధనం, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్ తదితర కంపెనీలు వస్తాయని తెలిపారు. కాగా, నాయకులు ఏ పార్టీ నుంచి వచ్చినా తమ పదవులకు రాజీనామా చేసి రావాలని అన్నారు. ఇలా వచ్చే వారిని తమతో కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు.

పోలవరం ముంపుపై తక్షణమే సంయుక్త సర్వే

- ఏపీ, తెలంగాణకు సీడబ్ల్యూసీ చైర్మన్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో 150అడుగుల గరిష్ఠ నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) మేరకు నీళ్లను నిల్వచేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో తక్షణమే సంయుక్త సర్వే నిర్వహించాలని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోహ్రా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని, ముర్రేడువాగుకు ఏర్పడనున్న ముంపుపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు ఇప్పటికే సంయుక్త సర్వే జరిగినా ముంపు ప్రాంతాలను గుర్తించలేదు. దీనిపై రెండు రాష్ట్రాలతో తక్షణమే సంయుక్త సర్వే చేపట్టి, డీ మార్కింగ్ చేసే ప్రక్రియను సైతం పూర్తి చేయాలని నిర్దేశించారు. బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాల అభ్యంతరాలపై బుధవారం ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో వోహ్రా అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. కమిటీలో సభ్యులైన ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు. గత సమావేశాల నిర్ణయాల మేరకు సంయుక్త సర్వేకు ఏపీ ప్రభుత్వం రావడం లేదని తెలంగాణ అధికారులు తెలియజేశారు. అయితే రెండు వాగులకే సర్వే పరిమితం చేయాల్సి ఉండగా, ఏడు వాగుల ముంపుపై సర్వే చేయాలని తెలంగాణ కోరుతోందని ఏపీ తరఫున సీఈ శ్రీనివాసరావు బదులిచ్చారు.

జగన్‌కు బిగ్ షాక్!

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరూ గురువారం ఢిల్లీలో రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా సమర్పించబోతున్నట్లు వైసీపీ వర్గాలు కూడా వెల్లడించాయి. రాజ్యసభ ఎంపీలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేడా రఘునాథరెడ్డి, ఆర్.కృష్ణయ్య, గొల్ల బాబూరావుతో పాటు మరికొందరు కీలక నేతలు పార్టీని వీడబోతున్నారని ప్రచారం సాగుతోంది. రాజ్యసభలో ఆ పార్టీకి 11 మంది ఎంపీలు ఉండగా.. ఇక అక్కడ మిగిలేది జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, నిరంజన్ రెడ్డి మాత్రమేనని అంటున్నారు. ఎన్నికల్లో ఓడినంత మాత్రాన తమను తక్కువ అంచనా వేయొద్దని.. రాజ్యసభలో తమ పార్టీకి 11 మంది సభ్యులు ఉన్నారని.. లోక్‌సభలో నలుగురు ఎంపీలు ఉన్నారని.. ఉభయసభల్లో పెద్దగా మెజారిటీ లేని బీజేపీ.. తమపై ఆధారపడాల్సిందేనని జగన్, విజయసాయిరెడ్డి ఇటీవలి పదే పదే అంటున్నారు. ఇప్పుడు ఆ బలమే తరిగిపోతుండడం గమనార్హం.

టీడీపీలోకి వెళ్తున్నా: మోపిదేవి

వైసీపీకి రాజీనామా చేసి.. తెలుగుదేశం పార్టీలో చేరాలని తాను నిర్ణయం తీసుకున్నట్లు మోపిదేవి బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గురువారం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానన్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన ఆయన వాస్తవానికి కాంగ్రెస్‌లో జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో సన్నిహితంగా మెలిగారు. ఆయన మంత్రివర్గంలో కూడా పనిచేశారు. జగన్ కాంగ్రెస్‌ను వీడి వైసీపీని ఏర్పాటు చేశాక మోపిదేవి రాజకీయంగా ఆయన వెంట అడుగులు వేశారు. ఆయనకు అత్యంత సన్నిహితుడిగా మారారు. 2019లో ఆయన రేపల్లె నుంచి పోటీచేసి ఓడినప్పటికీ జగన్ తన కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఎమ్మెల్సీని చేశారు. తర్వాత రాజ్యసభకు పంపి కేబినెట్ నుంచి తప్పించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె నుంచి ఎమ్మెల్యేగా పోటీచేయాలని మోపిదేవి భావించారు. సర్వేలో ఆయన ఓడిపోతారని తేలిందంటూ.. జగన్ వైసీపీ టికెట్‌ను డాక్టర్ ఈవూరు గణేశ్‌కు ఇచ్చారు. అయితే టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆయనపై దాదాపు 40 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నిజానికి రేపల్లె టికెట్ తనదేననే ధీమాతో మోపిదేవి అక్కడ పనిచేసుకుంటూ వచ్చారు. తీరా గణేశ్‌కు ఇవ్వడంతో ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు అప్పట్లో తీవ్ర నిరసన వెలిబుచ్చారు. మూకుమ్మడి రాజీనామాలకు సైతం సిద్ధపడ్డారు. కానీ జగన్ దిగిరాలేదు. గణేశ్ విజయానికి పని చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. మోపిదేవి అవమానభారంతో కుంగిపోయారు. ఎన్నికలకు ముందు నుంచే వైసీపీ అధిష్ఠానంతో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. పరాజయం తర్వాత కూడా తన విషయంలో జగన్ అదే వైఖరితో ఉండడం.. పార్టీ కీలక సమావేశాలకు సైతం ఆహ్వానించకపోవడం.. తదితర పరిణామాలు ఆయన పార్టీని వీడేందుకు పురిగొల్పాయి. ఆయన నిష్క్రమణతో వైసీపీకి బలమైన మత్స్యకార సామాజిక వర్గం పూర్తిగా దూరమైనట్లయిందని ఆ పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి.

పోతుల సునీత దారెటో...

ఎమ్మెల్సీ పదవితో పాటు వైసీపీకి కూడా పోతుల సునీత రాజీనామా చేశారు. శాసనమండలి చైర్మన్‌కు, పార్టీ అధినేత జగన్‌కు బుధవారమే ఆమె లేఖలు పంపారు. సునీత 2014లో చీరాల నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూశారు. ఆ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. తర్వాత నెలకొన్న రాజకీయ పరిణామాలతో సునీత వైసీపీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా, ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ఇటీవల వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా వరుదు కల్యాణికి ఆ పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో సునీత తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సునీత తన భవిష్యత్ ప్రణాళికను త్వరలో వెల్లడిస్తారని ఆమె సన్నిహితులు తెలిపారు. ఆమె బీజేపీలో చేరనున్నట్లు అనుచరులు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి పెత్తందారీ పోకడలు పోతున్న జగన్‌తో విభేదించి ఇద్దరు బీసీ నేతలు గుడ్‌బై చెప్పడం పార్టీపై తీవ్రప్రభావం చూపుతుందని వైసీపీ వర్గాలు అంగీకరిస్తున్నాయి.

ఏపీకి పారిశ్రామిక మణిహారం


(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో భేటీ అయిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించింది. ఆయా వివరాలను.. కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్, అశ్వినీ వైష్ణవ్‌లు మీడియాకు వివరించారు. దేశంలో రూ.28,602 కోట్ల పెట్టుబడితో 12 కొత్త పారిశ్రామిక స్మార్ట్ సిటీలను నెలకొల్పనున్నట్టు చెప్పారు. వీటికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ పూర్తయిందని, పర్యావరణ అనుమతులు కూడా తీసుకున్నామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో ఈ ప్రాజెక్టులను శరవేగంతో పూర్తి చేస్తామన్నారు. ఏపీలో కొత్తగా ఏర్పడిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని, ఆయన హయాంలో ఈ స్మార్ట్ సిటీలు వేగంగా అభివృద్ధి చెందుతాయని మంత్రులు తెలిపారు. విభజనతో ఇబ్బందుల్లో ఉన్న ఏపీకి ఈ స్మార్ట్ సిటీలు వరంగా మారుతాయన్నారు. ముఖ్యంగా సీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వివరించారు.

మరిన్ని వివరాలు..

- ఉత్తరాది, దక్షిణాది, తూర్పు, పశ్చిమ రాష్ట్రాల్లో నెలకొల్పే ఈ స్మార్ట్ సిటీలు దేశానికి మణిహారంగా ఉండనున్నాయి. జాతీయ పారిశ్రామిక కారిడార్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వీటిని నిర్మించనున్నారు.
- ఈ స్మార్ట్ సిటీలకోసం స్పెషల్ పర్పస్ వెహికల్స్‌ను ఏర్పాటు చేస్తారు. దీనిలో రాష్ట్రాల వాటా భూమి రూపంలో ఉంటుంది. మాచింగ్ నిధులు కేటాయించనవసరం లేదు.
- కేంద్ర, రాష్ట్రాల వాటా పోగా అయ్యే అదనపు ఖర్చుకు తక్కువ వడ్డీకి దీర్ఘకాలం చెల్లింపు ప్రాతిపదికన రుణ సౌకర్యం కల్పిస్తారు. ఈ పారిశ్రామిక నగరాల వల్ల దేశ వ్యాప్తంగా మొత్తం 10 లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 30 లక్షలమందికి పరోక్ష ఉపాధి లభిస్తుంది.
- చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ఇప్పటికే కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతం, తుముకూరు పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి కేంద్రం ఆమోద ముద్ర వేసింది.
- దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ సిటీలతో పారిశ్రామిక రంగం స్వరూపం పూర్తిగా మారనుంది. ఉత్పాదక సామర్థ్యం పెరగడంతో పాటు నగరాలు, పారిశ్రామిక కేంద్రాలు కలగలిపి పెద్ద ఎత్తున ఆర్థిక ప్రగతి జరుగుతుంది. ఇది 'ఆత్మ నిర్భర్ భారత్'కు దోహదం చేయనుంది.
- ఈ పారిశ్రామిక నగరాలు గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీలుగా, అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతాయి. పారిశ్రామిక వేత్తలు స్వేచ్ఛగా ప్రవేశించి వెంటనే ఉత్పత్తి ప్రారంభించేందుకు అనువుగా అన్ని రకాల ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తారు.
- 'ప్రధానమంత్రి గతిశక్తి' జాతీయ మాస్టర్ ప్లాన్‌లో ఈ నగరాలు రూపొందుతాయి. పని ప్రాంతాలకు సమీపంలోనే నివాస వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తారు.
- తెలంగాణలోని జహీరాబాద్‌కు ఉత్తరాన 9 కిలోమీటర్ల దూరంలో 3,245 ఎకరాల్లో రూ.2,361 కోట్ల వ్యయంతో పారిశ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. దీనిలో రూ.10 వేల కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంటుంది.

కొప్పర్తి ప్రత్యేకతలు




ఉత్పత్తి: పునరుత్పాదక ఇంధనం, ఆటో పరికరాలు, లోహ ఖనిజ వనరులు, లోహేతర ఖనిజ వనరులు, రసాయనాలు, జౌళి, ఇంజనీరింగ్ వస్తువులు.

ప్రయాణం ఈజీ: కొప్పర్తి.. కడప విమానాశ్రయానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. 40వ నెంబర్ జాతీయ రహదారికి 5 కిలో మీటర్ల దూరంలో తిరుపతి విమానాశ్రయం, నాలుగు జాతీయ రహదారులు, రెండు రేవులు, రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

ఓర్వకల్లు ప్రత్యేకతలు



ఉత్పత్తి: ఎయిరో స్పేస్, రక్షణ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్, ముత్యాలు, నగలు, జౌళి, వస్త్ర పరిశ్రమతో పాటు ఇతర ఉత్పత్తులు. ఈ క్రమంలో విశాఖ-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు కారిడార్ల అభివృద్ధి జరుగుతుంది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

కమర్షియల్ ట్యాక్స్ జేసీగా ప్రశాంత్ కుమార్

విజయవాడ: కమర్షియల్ ట్యాక్స్ విజయవాడ జాయింట్ కమిషనర్‌గా ప్రశాంత్ కుమార్ నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా ఉన్న ఆయనను ఇక్కడికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు బుధవారం రాత్రి ఇచ్చింది.

ఏడీసీపీగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ



విజయవాడ: నగర శాంతిభద్రతల విభాగం ఏడీసీపీ-2గా గుణ్ణం రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురం జిల్లా ఎస్ఈబీలో అదనపు ఎస్పీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. లోగడ ఈయన నగరంలో పశ్చిమ డివిజన్ ఏసీపీగా పనిచేశారు. రామకృష్ణ స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా కొనసాగుతారు. కొంతకాలంగా శాంతిభద్రతల విభాగం ఏడీసీపీ-2 స్పెషల్ బ్రాంచ్ విభాగానికి ఏడీసీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సీపీ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

హెచ్‌ఎంను బాధ్యురాలిని చేయడం సరికాదు

కంకిపాడు : పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపావాణిపై పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు పర్వతనేని వెంకట శ్రీనివాస్ అన్నారు. స్థానిక విలేక రులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. అయితే పాఠశాల హెచ్‌ఎం రూపావాణిపై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రూపావాణి ఇటీవలే ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా రావడం జరిగిందన్నారు. మండవ శ్రీనివాస్ వ్యవహార శైలిపై విద్యార్థినులు పిర్యాదు చేయడంతో ఆమె శ్రీనివాస్‌ను మందలించారన్నారు. హెచ్‌ఎం రూపావాణిపై పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని, హెచ్‌ఎంను విచారించాల్సిన అవసరం ఎమైనా ఉంటే విద్యాశాఖ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు.



వీనుల విందుగా కార్తీక్ వీణావాదనం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నెలవారీ సంగీత కార్యక్రమాల్లో భా గంగా బుధవారం స్టార్ హా స్పిటల్స్, శ్రీ శివరామకృష్ణ క్షే త్రం సౌజన్యంతో రామకోటి లో చిట్టా కార్తీక్ వీణావాద నం శ్రోతలను సమ్మోహనపరిచింది. ప్రతి కృతినాద పోషణ చేస్తూ శృతిలయల సమ్మిళితంగా జరిగిన వీణా వాద్య కచేరీ వీనుల విందు చేసింది. నవరాగ మాలిక వ ర్ణంతో ప్రారంభించి వరుసగా సావేరి రాగంలో ఎంతనేర్చి నా, షణ్ముఖప్రి య రాగంలో మరి వేరే దిక్కు, ప్రధానాంశంగా వాగదీశ్వరి రాగంలో పరమాత్ముడు, నారాయణతే నమో నమో అన్నమయ్య సంకీర్తన, అరుణాచల శివ వం టి అంశాలను రాగం, నెరవు, తానం, కల్పనా స్వరంలో త నదైన బాణీని కనబరుస్తూ వాయించి వినిపించారు. ఈ కచేరీ కార్తీక్ కృషిని ప్రతిభను ప్రకటితం చేసింది. వీరికి కె.సుబ్రహ్మణ్య రాజు వయోలిన్, బీరక సురేష్‌బాబు మృదంగంతో సమ వాయిద్య సహకారం అందించారు. ప్రారంభంలో సూర్యశాంకరి, సాయిహర్షిణి, వీరుభట్ల సోదరీ మణుల వీణావాద్య లహరి ఆహుతుల అభినందనలు అందుకుంటూ సాగింది. సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీ రావు పర్యవేక్షించగా ముఖ్య అతిథులుగా సుప్రసిద్ధ గాత్ర సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, సివిల్ సప్లైస్ కమిషనర్ సిద్ధార్థ జైన్ పాల్గొని విద్వాంసులను అభినందిస్తూ ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గన్నవరం: విజయవాడ వైపు వెళుతున్న పల్సర్ బైక్ ఎదురుగా వెళుతున్న స్కూటీని ఢీకొనడంతో బుధవారం రాత్రి ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక అంజనేయస్వామి గుడి ఎదురుగా జరిగింది. జంక్షన్ వైపు నుంచి గన్నవరం వస్తున్న బండారుగూడెంకు చెందిన వినోద్ పల్సర్ బైక్‌పై వస్తూ ఎదురు వెళుతున్న వాహనాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. అతనిని చిన అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. తలకు బలమైన గాయం అయిందని పోలీసులు చెప్పారు.

ఓపెన్ షూటింగ్‌లో నాగ భువన సత్తా



విజయవాడ స్పోర్ట్సు: జాతీయ రైఫిల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 28 వరకు గోవాలో జరిగిన జాతీయ ఓపెన్ షూటింగ్ పోటీల్లో కానూరు తాడిగడపలోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్సుకు చెందిన షూటర్ కర్రి నాగ భువన ఐఎస్ఎఫ్ 10 మీటర్ల పిస్టల్ ఉమెన్స్ జూనియర్ విభాగంలో 571 పాయింట్స్ సాధించి బంగారు పతకం, సీనియర్ విభాగంలో రజత పతకం వశం చేసుకుంది. భువన పతకాలను సాధించడంపై అకాడమీ డైరెక్టర్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.



ఉత్సాహంగా క్రీడా పోటీలు

విజయవాడ స్పోర్ట్సు: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో మూడో రోజు బుధవారం ఉత్సాహంగా క్రీడా పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌తో పాటు ఫుట్ బాల్, కబడ్డీ, యోగా, జల క్రీడల్లో మొత్తం 400 మంది క్రీడాకారులు తలపడ్డారని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ నెల 29 విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

ఏటీపీ అధ్యక్షుడిగా మరోసారి బాబ్జీ

● గంధం కొండపై 872 భారీ మెజార్టీతో గెలుపు

ఆటోనగర్, ఆగస్టు 28: ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీపీ) అధ్యక్షుడిగా రాజనాల వెంకట రమణారావు (బాబ్జీ) తన ప్రత్యర్థి గంధం వెంకటేశ్వరరావు (కొండ)పై 872 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆటోనగర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీపీ) ఎన్నికలు బుధవారం హోరాహోరీగా సాగాయి. మొత్తం 14 అనుబంధ సంఘాలకు చెందిన 2వేల మందికి పైగా ఓటర్లున్న ఈ ఎన్నికల్లో పదేళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న రాజనాల వెంకట రమణారావు (బాబ్జీ), తొలిసారిగా పోటీలోకి దిగిన గంధం వెంకటేశ్వరరావు (కొండ) పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2061 ఓట్లు పోలవగా గంధం కొండకు కేవలం 595 ఓట్లు మాత్రమే దక్కాయి. ఎన్నికల్లో నెగ్గిన రాజనాల బాబ్జీని పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.



ఏటీపీ ఎన్నికల్లో గెలిచిన బాబ్జీని అభినందిస్తున్న అనుబంధ సంఘాల నేతలు

అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి

● విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి ● విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభలో వక్తలు

గవర్నర్‌పేట, ఆగస్టు 28: ప్రభుత్వం, ప్రైవేట్ వ్యక్తులతో చేసుకున్న అడ్డగోలు ఒప్పందాల కారణంగా ప్రజలకు విద్యుత్ షాక్ తగులుతోందని, ఈ ఒప్పందాలను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, ప్రజలను విద్యుత్ షాకుల నుంచి తేరుకునేలా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ హైదరాబాద్ బషీరాబాద్‌లో విద్యుత్ ఆందోళన జరిగి 25ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా నాటి ఉద్యమం సమయంలో పోలీసు కాల్పులకు బలైన అమరవీరులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డి చిత్రపటాలనకు వామ పక్ష నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 25ఏళ్లలో విద్యుత్ రంగంలో వచ్చిన అనుభవాలు, సంస్కరణలు సమీక్షించుకుని ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టడం అవసరమన్నారు. ప్రస్తుతం ప్రజలకు విద్యుత్ వినియోగం అనివార్యంగా మారిందని, దీన్ని ఆసరాగా చేసుకుని కార్పొరేట్ కంపెనీలు తమ దోపిడీని తీవ్రతరం చేశాయని, విద్యుత్ రంగాన్ని కబళించే ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా ఈ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. విద్యుత్ వాడకం షాక్ కంటే ఇతర చార్జీల పేరుతో పాలకులు, అదానీ వంటి కార్పొరేట్లు ప్రజలకిస్తున్న షాక్ ఎక్కువైందన్నారు. పదేళ్లలోనే అనేక భారాలు వేశారు. అసలు కంటే కొసరు చార్జీలు, సర్దుబాటు చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. అదనపు చార్జీలు రూ.8వేల కోట్ల పైనే వైసీపీ వేసిందని ధ్వజమెత్తారు.



సభలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

2014 నుంచి వాడిన కరెంట్‌కు రూ.17వేలు కోట్లు అదనపు చార్జీలు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 2019 నుంచి చంద్రబాబు బాదుడు పోయి జగన్ బాదుడు వచ్చిందని, ఇప్పుడు చంద్రబాబు, మోడీ బాదుడు వచ్చాయని, విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పడం కాదని, తగ్గించి చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, మన ఇంట్లో పెట్టే ఆటంబాంబులాంటిదని, వాటిని తొలగించాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వానిదేనన్నారు. మీటర్ల పేరుతో అదనపు భారం వేస్తున్నారని, ఉచిత విద్యుత్ ఎత్తివేసేందుకు మీటర్లు పెడుతున్నారన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు పెట్టిన మీటర్లు తొలగించాలన్నారు. స్మార్ట్ మీటర్లు ఇళ్లకు పెట్టడం మొదలు పెడుతున్నారని, 1.40 కోట్ల స్మార్ట్ మీటర్లు బిగించనున్నారన్నారు. మొదటి దశంలో 20 కోట్ల మీటర్లు బిగించాలనే ఆదేశాలు వచ్చాయని, వీటిని కూడా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తారన్నారు. పంపిణీని ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్రం ఆదేశించనుందని, దీనిపై పోరాటం చేయాల్సింది ప్రజలేనని, వారికి వామపక్షాలు మద్దతుగా ఉంటాయన్నారు. అమరవీరుల సంస్మరణ సభ వేదికగా పోరాటాలు సాగాలన్నారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమ అమరవీరుల ఉద్యమ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ప్రభుత్వ విద్యుత్ విధానాలతో అనేక రంగాలు కుదేలౌతున్నాయిని, ఈ విధానాలను ఎండగడుతూ ఉద్యమాలు చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ రంగం, దానిపై ఆధారపడిన వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతోందని, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారన్నారు. వర్గ ప్రయోజనాలు కాపాడుతున్న ప్రభుత్వ విధానాల మార్పునకు ప్రజల్ని చైతన్యం చేయాల్సి ఉందన్నారు. సీపీఎం సీనియర్ నేత వై వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించి ఉద్యమ చరిత్రను వివరించారు.

వర్గీకరణపై త్వరలో సీఎంను కలిసేందుకు సన్నాహాలు

● వర్ల రామయ్య నివాసంలో మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్యేల భేటీ



వర్ల నివాసంలో భేటీ అయిన కృష్ణమాదిగ, ఎమ్మెల్యేలు

వన్‌టౌన్, ఆగస్టు 28: ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వర్గీకరణ విషయంలో రాష్ట్రాలకున్న అధికారాలను వినియోగించుకుని ఆ మేరకు అమలు చేయాలని కోరేందుకు ఎస్సీ సామాజిక వర్గం నేతలు త్వరలో సీఎం చంద్రబాబును కలిసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంలో నగరంలోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నివాసంలో బుధవారం వర్గీకరణ ఉద్యమ నేత మంద కృష్ణమాదిగ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరామరాజు తదితరులు సమావేశమయ్యారు. సుప్రీంకోర్టు తీర్పు పర్యవసానం తదితర అంశాలపై సుమారు 2 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. మాదిగలంతా తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించారని, దీంతో కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. మాదిగల వర్గీకరణపై ఏ విధంగా ముందుకు వెళ్లాన్న దానిపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్టు వర్ల రామయ్య తెలిపారు. ఇదే సమయంలో పదవులను కూడా సముచిత రీతిలో మాదిగలకు ఇవ్వాలన్న దానిపై సీఎంను కోరాలని నిర్ణయించారు. మాదిగ నేతలు, ముఖ్య నేతలు త్వరలో సీఎంను కలిసేందుకు నిర్ణయించారు. ఇదే సందర్భంలో వర్గీకరణకు గతంలోనే ఆమోదం తెలిపిన చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఆగస్టు 28: నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంచి నీరు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఫ్రైజర్‌పేట ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మంచినీటి సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే సైడ్ డ్రెయిన్‌లో మురుగునీటి పారుదలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూసుకోవడంతోపాటు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు శానిటరీ అధికారులు వీధులు, రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు ఉన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు జడ్జి



జ్యోతిర్మయికి దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న అధికారులు

వన్‌టౌన్, ఆగస్టు 28: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను బుధవారం హైకోర్టు జడ్జి వి జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం అధికారులు ఆమెకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గా వైభవంపై ప్రవచనం

దుర్గా వైభవంపై తెనాలికి చెందిన ములుకుట్ల విశ్వనాథ శర్మ బుధవారం దుర్గగుడిలో ధర్మపథం వేదికపై ప్రవచనం చేశారు. కనకదుర్గమ్మ లీలా విశేషాలను హృద్యంగా వినిపించారు.

నైట్‌డ్యూటీ అలవెన్సులు పునరుద్ధరించాలి

● ప్రజా రవాణా ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్



ట్రెజరీ జేడీకి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరాజు

బస్టేషన్, ఆగస్టు 28: కండక్టర్లు, డ్రైవర్లకు నైట్‌డ్యూటీ అలవెన్సులను పునరుద్ధరించాలని కోరుతూ ప్రజా రవాణా ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, విజయనగరం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, ఎంవీఆర్ మూర్తి బుధవారం ట్రెజరీ శాఖ జాయింట్ డైరెక్టర్ పూజారి శ్రీనివాసులు నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజా రవాణా ఉద్యోగుల పట్ల ట్రెజరీశాఖ వైఖరిని నిరసిస్తూ ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో నల్లబ్యాడ్జీలు ధరించి గేట్ మీట్‌లో నిరసనలు వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. గతంలో చెప్పిన హామీ మేరకు పీఆర్‌సీజీవో 114 మేరకు ప్రజా రవాణాలో కండక్టర్లు, డ్రైవర్లకు డ్యూటీ బెస్ట్ అలవెన్సులను ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి వేతన బిల్లులో కలిపి ఆగస్టు 1న ఇస్తామని తెలిపారని, అయితే ఆ మేరకు కలిపినా 58 డిపోలకు అమలు కాలేదన్నారు. అలవెన్సులను జీతం బిల్లులో కలిపి ఇవ్వొద్దని విజయవాడ ట్రెజరీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీంతో నిలిపేసిన అలవెన్సులను పునరుద్ధరించాలని కోరుతున్నామన్నారు. ఉద్యోగుల రావాల్సిన బకాయిల బిల్లులు, సీక్ లీవుల జీతాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సకాలంలో సెటిల్మెంట్ చేయకపోవడం వంటివాటితో పాటు రవాణాశాఖ ఉద్యోగులను, వేతనాలు బిల్లులు వేసే కార్యాలయ సిబ్బందిని ట్రెజరీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆర్టీసీ ఎండీకి కూడా వినతి పత్రం పంపించామని, ఈనెల 30న నిరసన తెలియజేస్తామన్నారు.

పర్వతారోహకురాలు అన్నపూర్ణకు అభినందన

విజయవాడ కల్చరల్, ఆగస్టు 28: యూరప్ లోనే ఎతైన పర్వతమైన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి దేశానికి, ప్రత్యేకించి మన రాష్ట్రానికి కీర్తిని తెచ్చిపెట్టిన పర్వతారోహకురాలు బండారు అన్నపూర్ణ అభినందన సభ మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ పర్వతారోహణలో తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకొన్నారు. తమ ప్రయత్నాలను ఏనాడూ విడువకూడదనే అంశాన్ని తన మదిలో ఎప్పుడూ గుర్తుకు పెట్టుకొంటానన్నారు. చిన్నప్పటి నుంచే (2వ తరగతి) స్కూలుకు నడిచే వెళ్లేదానినన్నారు. 2015లో వీపీబీ స్కూల్‌లో ఉద్యోగం చేసే సమయంలోనే నాతోటి ఉపాధ్యాయులు, మిత్రులు ప్రోత్సాహంతో ఏదో ఒకటి సాధించాలనే కోరిక, భర్త ప్రోత్సాహంతో మంగళవారం పానకాలస్వామి కొండను రోజుకు 2సార్లు ఎక్కి దిగడం పట్టునిచ్చిందన్నారు. 'విజయవాడ ఎడ్వంచర్ క్లబ్' ద్వారా ట్రెకింగ్‌కు వెళ్లేదానినన్నారు. ఈ అనుభవం ద్వారా 18,510 అడుగుల ఎత్తులో ఉన్న ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహణను పెద్ద సవాల్‌గా తీసుకొన్నానన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎ.స్వరూపారాణి మాట్లాడుతూ బండారు అన్నపూర్ణ ఈనాటి నారీలోకానికి ఎంతో ఆదర్శవంతమైందన్నారు. ఆమె పయనంలో తోడుగా ఉంటూ ప్రోత్సహించడమే కాకుండా రూ.10 లక్షల వరకు ఖర్చుచేసిన భర్త మహేష్‌రెడ్డి, తల్లి వెంకటేశ్వరమ్మను అభినందించారు. ఎంబీవీకే కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ అన్నపూర్ణ సంకల్పానికి, పట్టుదలను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి వారికి ప్రోత్సాహమిస్తే మన దేశ ప్రతిష్టను మరింత ముందుకు తీసుకెళతారని కొనియాడారు. ఎంబీవీకే నుంచి రూ.25 వేల ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు. జాతీయ క్రీడాకారిణి విజయశ్రీ గుప్తా, అన్నపూర్ణకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. వన్‌ఎర్త్ వన్‌లైఫ్ లీలాకుమారి తమ సంస్థ నుంచి రూ.10వేల ప్రోతాహక బహుమతిని ప్రకటించారు. సేఫ్ అధ్యక్షురాలు జి.జ్యోత్స్న, ఫోరం ఫర్ ఆ లలితా సౌజన్య, స్ఫూర్తి శ్రీనివాస్, ఎంబీవీకే మహిళా విభాగం బాధ్యులు పి.విజయ పాల్గొని సత్కరించారు.



అన్నపూర్ణను సత్కరిస్తున్న ఎంబీవీకే ప్రతినిధులు

మతిస్థిమితం లేని బాలికపై పదినెలలుగా అత్యాచారం

» యువకుడి దుశ్చర్య

» వీడియోలు, ఫొటోలు తీసి మరో ఇద్దరి లైంగిక వేధింపులు

» ముగ్గురు నిందితుల అరెస్టు.. నంద్యాల జిల్లాలో ఘోరం

నంద్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని బాలికపై కన్నేసిన ఓ యువకుడు మాయమాటలు చెప్పి పదినెలలుగా అత్యాచారం చేస్తున్నాడు. ఇతనికి మరో ఇద్దరు స్నేహితులు తోడై బాలికను లైంగికవేధింపులకు గురిచేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల జిల్లాలో ఈ ఘోరం చోటుచేసుకుంది. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ తెలిపిన వివరాలు.... నంద్యాల జిల్లా కోయిలకుంట్లకు చెందిన బాలిక(16)కు మతిస్థిమితం లేదు. తండ్రి అనారోగ్యంతో మంచాన పడ్డాడు. తల్లి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. తల్లి బయటకు వెళ్లే సమయంలో సంతోష్‌నాయక్ అనే యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి దగ్గరలోని ఓ పాత భవనంలోకి తీసుకువెళ్లి అత్యాచారం జరిపేవాడు. ఇలా దాదాపు పది నెలలుగా అత్యాచారం చేస్తున్నాడు. ఈ విషయం తన స్నేహితులు అజయ్, సుభాష్‌లకు చెప్పి వారిని కూడా వెంట తీసుకువెళ్లేవాడు. బాలికపై అత్యాచారం జరిపే సమయంలో అతడి స్నేహితులు వీడియోలు, ఫొటోలు తీయటమే కాకుండా లైగికంగా వేధించేవారు. అజయ్ ఈ నెల 24వ తేదీన బాలికను లైంగికంగా వేధిస్తుండటంతో కాలనీలోని మరో వ్యక్తి చూసి మందలించాడు. ఈ విషయం పోలీసు స్టేషన్‌కు చేరడంతో అజయ్‌ని పిలిపించి విచారించారు. అయితే తాను సుభాష్‌తో కలిసి వేధింపులు మాత్రమే చేశానని, అసలు అత్యాచారం చేసిన వ్యక్తి వేరే ఉన్నాడని, సంతోష్ జరిపిన అత్యాచార వీడియోలను పోలీసులకు చూపించాడు. దీంతో ఈ నెల 27న ముగ్గురినీ స్టేషనుకు తీసుకువచ్చారు. ఆళ్లగడ్డ ఎస్డీపీవో రవికుమార్ బుధవారం కేసును విచారణ చేసి పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను రిమాండుకు తరలించారు.

ఇచ్ఛాపురంలో స్వల్ప భూప్రకంపనలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 28: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పట్టణంలో బుధవారం వేకువజామున 3.45 గంటల ప్రాంతంలో సెకను పాటు భూమి కంపించింది. దీంతో వేకువజామున నిద్రలేచిన వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఆసమయంలో గాఢనిద్రలో వారు మాత్రం శబ్దాలు గుర్తించలేకపోయారు. అయితే ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఏపీలోనూ అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి

» ఎమ్మెల్సీ కవిత ఆవేశం తగ్గించుకోవాలి: టీజీ వెంకటేశ్

తిరుపతి అర్బన్, ఆగస్టు 28: చెరువులు, రోడ్లు, పార్కులు, క్రీడా మైదానాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా కూల్చివేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కోరారు. బుధవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'అక్రమ నిర్మాణాలను గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. అక్రమ నిర్మాణాలను తొలగించే విషయంలో న్యాయస్థానాలు కూడా జోక్యం చేసుకోకుంటే సబబుగా ఉంటుంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తుండడాన్ని స్వాగతిస్తున్నాం. చెరువుల్లో నిర్మాణాలు చేపట్టిన ఏ ఒక్కరినీ ఆయన వదలడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో చెరువులను కాపాడుకుంటే నీటి సమస్యను అధిగమించవచ్చు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడే భాష మంచిది కాదు. ఆమె ఆవేశం తగ్గించుకోవాలి. కూటమి ప్రభుత్వం రాగానే టీటీడీలో ప్రక్షాళన మొదలైంది. అన్ని విభాగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తరువాత పారిశ్రామికవేత్తలు ఆంధ్రవైపు చూస్తున్నారు' అని వెంకటేశ్ అన్నారు.



సీపీ రాజశేఖరబాబును కలిసిన బెజవాడ బార్ న్యాయవాదులు

సిటీ సివిల్ కోర్టు వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించండి

● సీపీకి బెజవాడ బార్ న్యాయవాదుల వినతి

విజయవాడ లీగల్, ఆగస్టు 28: బెజవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బుధవారం పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్ (రాజా) ఆయనతో మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి, కోర్టు పనివేళల్లో సిటీ సివిల్ కోర్టు వద్ద 5వ నెంబర్ రోడ్డుపై ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్య గురించి వివరించారు. ఈ సందర్భంగా సీపీ న్యాయవాదులతో మాట్లాడుతూ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొంటానని, న్యాయవాదులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీపీని కలిసిన వారిలో బార్ కార్యవర్గసభ్యులు గండూరి వెంకట రామశర్మ, నిడుమోలు సుబ్రహ్మణ్యం, కలతోటి క్రాంతి కుమార్, సిహెచ్.రవికుమార్, ఎస్.రాజ్యలక్ష్మి తదితరులున్నారు.



సైతియోహబ్, ఈవీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంటున్న పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ ఈఈఈ విభాగం

ముగిసిన ఎలక్ట్రికల్ వాహనాల సాంకేతిక వర్క్‌షాప్

వన్‌టౌన్, ఆగస్టు 28: పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఆరురోజులపాటు నిర్వహించిన ఎలక్ట్రికల్ వాహనాల సాంకేతిక వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ డైరెక్టర్, ఎస్ఆర్ఎం వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌కే వైద్యనాథన్ పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు వక్తలు విద్యుత్ వాహనాల సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ల పనితీరును వివరించారు. విద్యుత్ వాహనాల విషయంలో ఇంకా నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు అవసరమన్నారు. ఇంధన ధరల కారణంగా విద్యుత్ వాహనాలకు డిమాండ్ పెరుగుతున్న తీరు, చార్జింగ్ కేంద్రాలు, వాహనాల నిర్వహణ తదితరాలను గురించి వక్తలు వివరించారు. ఈ సందర్భంగా సైతియోహబ్, ఈవీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఈఈఈ విభాగం ఒప్పందం చేసుకుంది. సంస్థ టెక్నికల్ హెడ్ లక్కిరెడ్డి గోపాలరెడ్డి, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ చిట్టా అమర్ సుధీర్, సంయుక్త కార్యదర్శి గ్రంధి పవన్ కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగస్తులు

ప్రక్షాళన తర్వాతే బదిలీలు చేపట్టాలి

● వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల డిమాండ్

పెనమలూరు, ఆగస్టు 28: వాణిజ్య పన్నుల శాఖ ప్రక్షాళన తర్వాతే ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కోరుతూ జరుగుతున్న ఉద్యోగుల సమ్మె బుధవారం కూడా నిర్వహించారు. శాఖాపరమైన సమస్యలను పరిష్కరించి బదిలీలు చేపట్టాలని కోరుతూ శాఖ డివిజన్-2 కార్యాలయం వద్ద రెండో రోజూ ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేశారు. విజువల్ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు, 1,3 డివిజన్ అధ్యక్షులు భాస్కరరావు, ప్రసాద్‌బాబు, గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

కోనోకార్పస్‌పై ప్రభుత్వాలు నిషేధం విధిస్తున్నాయిగా!

- ఏ కారణం లేకుండా అలా ఎందుకు చేస్తాయి?: హైకోర్టు
- చెట్ల నరికివేతకు ఏమైనా ఉత్తర్వులు ఇచ్చారా?.. వివరాలివ్వండి
- రాష్ట్ర ప్రభుత్వం, కాకినాడ, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): 'కోనోకార్పస్ చెట్ల పెంపకంపై గుజరాత్, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధిస్తున్నాయి కదా? ఏ కారణం లేకుంటే అలా ఎందుకు చేస్తాయి?' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. చెట్ల నరికివేతకు ఉత్తర్వులు ఏమైనా ఇచ్చారా? అని రాష్ట్ర ప్రభుత్వం, కాకినాడ, నెల్లూరు జిల్లాల కలెక్టర్లను ఆరా తీసింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 4కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. మానవాళికి, పర్యావరణానికి హానికరమని శాస్త్రీయంగా నిరూపితమయ్యేవరకు కోనోకార్పస్ చెట్ల నరికివేతను నిలుపుదల చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గుంటూరుకు చెందిన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మరో ఇద్దరు ప్రొఫెసర్లు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్లలో బోటనీ ప్రొఫెసర్లు ఉన్నారు. కోనోకార్పస్ చెట్లపై నాలుగేళ్లు అధ్యయనం చేశారు. వాటి వల్ల హాని లేదని నిర్ధారించారు. నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సైతం సమర్పించారు. కాకినాడ, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు ఈ చెట్లు నరికివేయాలని ఆదేశించినట్లు సమాచారం ఉంది. వాల్టా చట్టాన్ని అనుసరించి చెట్లను నరికివేస్తున్నవారి నుంచి నష్టపరిహారం వసూలు చేయాలి' అని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది టి.విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ... వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు.

వైసీపీలోకి మారలేదని భూమి కబ్జా చేశారు

- రాష్ట్రం నలుమూలల నుంచీ టీడీపీ ఆఫీస్‌కు క్యూకట్టిన బాధితులు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): 'వైసీపీలోకి మారలేదని టీడీపీ కార్యకర్తల భూముల్ని కబ్జా చేశా రు... మామిడి తోటలో మొక్కలు పీకేసి, రాత్రికి రాత్రే ఆటోనగర్ పేరుతో బోర్డులు పెట్టారు... మాజీ మంత్రి బుగ్గనతో మాట్లాడాలంటూ తహసీల్దార్ బ్రోకర్ పను లు చేస్తున్నాడు... వైసీపీ నేతల అండతో గుడిని కూల్చి, స్థలాన్ని కబ్జా చేశారు... భూమిని కబ్జా చేసి, మహిళపై దాడి చేశారు...' రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వైసీపీ పాలకుల బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మంత్రి ఫరూఖ్, ఎమ్మెల్సీ అశోక్‌బా బు ఫిర్యాదులు స్వీకరించారు. 'తాటిగుంటిపల్లె పంచాయతీలో అక్కదేవతల ఆలయం ఉంది. ఆ గుడికి కోనేరుంది. అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం మూరేవాండ్లపల్లెలో వైసీపీ నేత అండతో గుండూరు వెంకటరమణ, ఆయన కుమారుడు సుబ్రహ్మణ్యం కోనేరును ఆక్రమించి జేసీబీతో దున్నేశారు. వారిపై చర్యలు తీసుకోవాలి' అని గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. డోన్ నియోజకవర్గం బేతంచర్లకు చెంది న మేకల నాగరాజు 1995 నుంచి టీడీపీలో పనిచేస్తున్నారు. 'నేను వైసీపీలోకి మారలేదని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆయన అనుచరులు కక్షకట్టా రు. నా అనుచరులకు చెందిన 4.26 ఎకరాల భూమిలో మామిడి మొక్కలు పీకేసి, ఆటోనగర్ పేరుతో బోర్డు పెట్టేశారు. ఇదేంటని తహసీల్దార్‌ను అడిగితే... బుగ్గనను కలవాలని, వైసీపీ కండువా వేసుకోవాలని బెదిరించాడు. మళ్లీ మాట్లాడితే కేసు పెట్టి, జైలుకు పంపుతామని భయపెడుతున్నాడు' అని వాపోయారు.

పెద్దిరెడ్డి భద్రతపై కౌంటర్ దాఖలు చేయండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి భద్రత కుదింపు కేసులో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తనకు ఎలాంటి ప్రాణహాని లేదని భద్రతా పర్యవేక్షణ కమిటీ (ఎస్ఆర్‌సీ) ఇచ్చిన నివేదిక ఆధారంగా తనకున్న 5 ప్లస్ 5 సెక్యూరిటీని 1 ప్లస్ 1కు కుదిస్తూ చిత్తూరు జిల్లా ఎస్పీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఎస్ఆర్‌సీ నివేదిక ఆధారంగా పిటిషనర్‌కు భద్రతను 1 ప్లస్ 1కు కుదించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, కొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి విచారణను 2వారాలకు వాయిదా వేశారు.

పత్తి కొనుగోలులో మార్గదర్శకాలు అనుసరించట్లేదు

- హైకోర్టులో పిల్.. విచారణ 3 నెలలు వాయిదా

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి పత్తి కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించకుండా.. జిన్నింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియను నిర్వహిస్తూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూరుస్తోందంటూ దాఖలైన పిల్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. సీసీఐ తరఫు న్యాయవాది కృష్ణారావు వాదిస్తూ.. సీసీఐ తరఫున బుధవారమే వకాలత్ వేశానని, వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం విచారణను మూడు నెలలకు వాయిదా వేసింది. హైదరాబాద్‌కు చెందిన వి.పద్మ ఈ పిల్ దాఖలు చేశారు.

'ఎర్ర కూలీల ఎన్‌కౌంటర్ కేసు'పై నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం... విచారణ వాయిదా

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో ఎర్రచందనం కూలీల ఎన్‌కౌంటర్ విషయంలో దిగువ కోర్టులో దాఖలైన చార్జ్‌షీట్‌పై బాధిత మహిళ వేసిన ప్రొటెస్ట్ పిటిషన్ విచారణ ఏ దశలో ఉందో స్థాయి నివేదికను కోర్టు ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బాధ్యులైన పోలీసులపై ఇప్పటికే దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేశారని గుర్తు చేసింది. కేసుపై తాము విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఎన్‌హెచ్ఆర్‌సీలో విచారణ అవసరమో, కాదో తెలుసుకొని అభిప్రాయం చెప్పాలని కమిషన్ తరఫు న్యాయవాదికి సూచించింది. విచారణను నవంబరు 20కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

దసరా, దీపావళి పండగలకు 48 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న దసరా, దీపావళి, ఛాత్ పండగల సందర్భంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 48 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలియజేశారు. అక్టోబరు 9 నుంచి నవంబరు 25 మధ్య ప్రతి ఆదివారం తిరుపతి- మచిలీపట్నం (07121), ప్రతి సోమవారం మచిలీపట్నం- తిరుపతి (07122), కాకినాడ టౌన్- సికింద్రాబాద్ (07187), ప్రతి మంగళవారం సికింద్రాబాద్- కాకినాడ టౌన్ (07188), ప్రతి బుధవారం సికింద్రాబాద్- నాగర్‌సోల్ (07517), ప్రతి గురువారం నాగర్‌సోల్- సికింద్రాబాద్ (07518), కాచిగూడ- తిరుపతి (07653), ప్రతి శుక్రవారం తిరుపతి- కాచిగూడ (07654) ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు అధికారులు తెలియజేశారు.

రిజిస్ట్రేషన్ ఆఫీసులకు మెరుగులద్దే టెండర్ రద్దు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మెరుగులద్దడానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ గతేడాది పిలిచిన టెండర్లను ప్రభుత్వం తాజాగా రద్దు చేసింది. 10 కార్యాలయాలకు మెరుగులద్దడం కోసం రూ.99 కోట్లతో టెండర్ వేసిన వైసీపీ అస్మదీయ కంపెనీ రామ్ ఇన్ఫోను ఎల్1గా చేశారు. ఇందుకోసం అర్హత ఉన్న కంపెనీలను వెనక్కి నెట్టి, ఆ కంపెనీయే ఎల్1గా వచ్చేలా టెండర్ నిబంధనలు కూడా మార్చారు. ఈలోగా ఎన్నికలు రావడంతో ఆ పనులు ఆగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడినా మళ్లీ ఆ కంపెనీనే తెరపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. దీనిపై 'హేరామ్ ఇదేం పని' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. టెండర్లలో గోల్‌మాల్ జరిగినట్టు నిర్ధారించుకుని తాజాగా ఆ టెండర్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ముందుగా రామ్ ఇన్ఫో రూ.127 కోట్లతో టెండర్ వేసింది. రూ.100 కోట్లు దాటిన టెండర్లన్నీ న్యాయసమీక్షకు వెళ్లాలన్న నిబంధన ఉండడంతో దాన్ని సవరించి రూ.99.7 కోట్లకు పరిమితం చేశారు. దీంతో న్యాయసమీక్ష లేకుండానే ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాలనుకున్నారు.

ఇసుక మాఫియాను అరికట్టండి

- అనంత ఎస్పీకి ఎమ్మెల్యే అశ్మిత్ వినతి
- అక్రమ ఇసుక లారీలను వదిలేసి దాడి చేసిన వారికే సీఐ వత్తాసు
- అందుకే నిరసన తెలిపానని వెల్లడి

అనంతపురం అర్బన్/క్రైం, ఆగస్టు 28: తాడిపత్రి నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అనంతపురం జిల్లా ఎస్పీ జగదీ‌ష్‌ను కోరారు. బుధవారం అనంతపురంలోని ఎస్పీ కార్యాలయానికి ఎమ్మెల్యే వచ్చారు. తాడిపత్రి నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక దందా, సీఐ లక్ష్మీకాంతరెడ్డి వ్యవహారం గురించి ఎస్పీకి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టేందుకు అవసరమైతే సీఐ స్థాయి అధికారితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. ఇసుక మాఫియా ఆగడాలు అరికట్టాలని నెల రోజుల నుంచి లేఖలు రాస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలను తమ కార్యకర్తలు అడ్డుకున్నారని, వారిపై మాఫియా రాళ్లదాడికి పాల్పడిందని తెలిపారు. సీఐ లక్ష్మీకాంతరెడ్డికి ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఇసుక లారీలను వదిలేసి, దాడి చేసిన వారికే వత్తాసు పలికారని, అందుకే పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలిపామన్నారు. 5గంటలు తనను వర్షంలో నిలబెట్టారని తెలిపారు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ ఒకరిద్దరు పోలీసులు వైసీపీ జెండా కప్పుకొని పనిచేస్తున్నారని విమర్శించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే ప్రజలు ఆపాలని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని అన్నారు. తరువాత కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిశారు.


అనంతపురంలో మీడియాతో మాట్లాడుతున్న తాడిపత్రి ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి

ఎస్పీని కలిసిన సీఐ

తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి ఎస్పీ జగదీ‌ష్‌ను కలిశారు. ఇసుక అక్రమ రవాణా వివాదం తదితరాలను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేతో దురుసుగా మాట్లాడలేదన్నారు. ఉన్నతాధికారులు చెప్పడంతోనే ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు.

సచివాలయాల శాఖలో.. ఇంకా వైసీపీ నీలినీడలు!

- పై నుంచి దిగువ దాకా జగన్ వీరాభిమానులే!!
- వైసీపీ కార్యకర్తలకు, రిటైర్డ్ అధికారులకు అందలం
- ప్రభుత్వం మారినా వారంతా అక్కడే తిష్ఠ
- కీలక సమాచారమంతా వారి గుప్పిట్లోనే
- సజ్జల కనుసన్నల్లోనే పనిచేస్తున్న వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా పలు శాఖల్లో భారీగా అవినీతి జరిగింది. ఆ కుంభకోణాలు కప్పిపుచ్చుకునేందుకు అక్కడక్కడా రికార్డులు, ఫైళ్లు తగలబెట్టేస్తున్నారు. కంప్యూటర్ హార్డ్‌డిస్కులను మాయం చేస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల శాఖలో కూడా పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుందని, జగన్ కోసం పనిచేసిన ఐ-ప్యాక్ సంస్థను పోషించింది ఈ శాఖేనని విమర్శలు గుప్పుమంటున్నాయి. వలంటీర్లకు శిక్షణ పేరుతో ఏటా రూ.68 కోట్లు ఈ శాఖ నుంచే డ్రా చేసి ఐ-ప్యాక్‌కు సమర్పించారు. ఆ సంస్థ వైసీపీ బలోపేతానికి కార్యకర్తలకు జీతాలిచ్చి పోషించింది. నాలుగేళ్లపాటు సుమారు రూ.300 కోట్ల ప్రభుత్వ నిధులను పార్టీ కార్యక్రమాల కోసం వాడుకున్నారు. దానిపై సమగ్ర విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ శాఖ వైసీపీ హయాంలో ఏర్పాటు చేసింది కావడంతో.. ఆ పార్టీకి అనుకూలంగా ఉండే అధికారులనే ఎక్కువగా నియమించుకున్నారు. మొన్నటి వరకు అజయ్ జైన్ ఈ శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. తాజాగా సురేశ్‌కుమార్‌ను నియమించారు. అయితే జీపీడీ (పొలిటికల్) కార్యదర్శిగా కూడా విధులు నిర్వహిస్తున్న ఆయన.. ఈ శాఖను పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామ/వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఐఎఫ్ఎస్ అధికారి అయిన ఈయన్ను జగన్ ప్రభుత్వం ఏరికోరి నియమించుకుంది. వీరితో పాటు ఈ శాఖలో అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిజిటల్ సర్వీసెస్ కన్సల్టెంట్ కూడా వైసీపీకి వీరాభిమానే. డీపీవో స్థాయి అధికారిని తీసుకొచ్చి అదనపు కమిషనర్ స్థాయి పోస్టు కట్టబెట్టారు. ఆయన పరిధిలోనే డిజిటల్ సర్వీసులు నడుస్తున్నాయి. డిజిటల్ సర్వీసుకు అన్నీ తానై వ్యవహరించే మరో ప్రైవేటు ఉద్యోగి కీలకంగా ఉన్నారు. ఆయన చేతిలో మొత్తం శాఖ సమాచారం నిక్షిప్తమై ఉంది. ఆయనకు నెలకు రూ.1.50 లక్షలు జీతమిచ్చి కొనసాగిస్తున్నారు. వీరందరి పరిధిలో మరికొందరు కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరంతా జగన్ వీరాభిమానులు. మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లోనే ఇప్పటికీ పనిచేస్తున్నారు. మొత్తం వ్యవస్థంతా వారి అధీనంలోనే ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి 75 రోజులవుతున్నా.. ఇంకా ఆ అధికారులు, ఉద్యోగులే కొనసాగుతుండడంతో ఈ శాఖ సమాచారం భద్రతపై ఆందోళన నెలకొంది.

కన్సల్టెంట్లకు 200 కోట్లు

గ్రామ/వార్డు సచివాలయాల శాఖ ద్వారా డిజిటల్ సేవల పేరుతో భారీగా కన్సల్టెంట్లను నియమించారు. ప్రతి నెలా సుమారు రూ.4 కోట్లు వారికి జీతాలుగా అందిస్తున్నారు. గత నాలుగేళ్లలో సుమారు రూ.200 కోట్లు వారికి చెల్లించారు. ఇప్పుడు వాస్తవానికి రాష్ట్రంలో ఎలాంటి ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) పథకాలు అమలు కావడం లేదు. గతంలో అమలు చేసిన ఒక్క డీబీటీ కూడా అమల్లో లేదు. వారంతా పని లేకుండా ఖాళీగా ఉంటున్నారు. వైసీపీ హయాంలో చేసిన అక్రమాలను కప్పిపుచ్చేందుకు వారు యథాశక్తి ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ శాఖలోని అన్ని విభాగాల్లో అధికారులను, సిబ్బందిని, కన్సల్టెంట్లను పూర్తిగా మార్చేస్తే తప్ప సమగ్ర విచారణకు అవకాశమే లేదంటున్నారు. అసలు సచివాలయాల శాఖ ఆవిర్భావం నుంచే దానిపై అనుమానాలున్నాయి. గతంలో పలు దఫాలు ఈ శాఖల్లో డీబీటీకి సంబంధించి లబ్ధిదారుల జాబితాపై సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా కూడా సమాచారం పొందలేని పరిస్థితి. వివరాలన్నీ అత్యంత గోప్యంగా ఉంచారు. దీంతో పాటు వలంటీర్ల శిక్షణ కోసం ఐ-ప్యాక్‌ను ఎంపిక చేయడం, పలు సాఫ్ట్‌వేర్ల రూపకల్పనకు టెండర్లు నిర్వహించకుండా బిడ్డర్లను ఎంపిక చేయడం వంటి అక్రమాలు జరిగాయి. ఒకవేళ విచారణ జరిగినా.. వైసీపీ వీరాభిమానులైన అధికారులు, వైసీపీ కార్యకర్తలే ఉద్యోగులుగా ఉండడంతో అవినీతి బట్టబయలు కాకుండా అడ్డుకుంటారన్న అనుమానాలు ఏర్పడుతున్నాయి. మొన్నటి ఎన్నికల్లో సచివాలయాల శాఖ డైరెక్టర్ కార్యాలయం అధికారులు ఏకపక్షంగా వైసీపీకి పనిచేశారు. వలంటీర్లకు ఇచ్చిన ఫోన్ సిమ్‌లు బ్లాక్ చేయాలని ఎన్నికల కమిషన్ ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారులు ఖాతరు చేయలేదు. చివరకు పోలింగ్ ముందు రోజు సిమ్‌లను బ్లాక్ చేశారు.

సర్వీసు చార్జీల నిధులెక్కడ?

రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిజిటల్ సేవలకు సంబంధించి ఆయా శాఖల నుంచి గ్రామ/వార్డు సచివాలయాల శాఖకు వచ్చిన సర్వీసు చార్జీల నిధులు ఏమయ్యాయో తెలియడం లేదు. ఈ విషయంలో అక్కడ పనిచేసే అధికారులపై పలు అనుమానాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ కార్యకర్తలు డైరెక్టర్ కార్యాలయంలోనే వేళ్లానుకుని ఉండడంతో.. అవినీతిపై విచారణకు ఆదేశించేలోపే హార్డ్‌డిస్కులు, రికార్డులను మాయం చేస్తారేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి అధికారులను అక్కడే కొనసాగించడం, రిటైరైన వారిని మళ్లీ అక్కడే ఎలాంటి ఆదేశాలు లేకుండా కొనసాగించడం వంటివి భవిష్యత్‌లో విచారణకు అడ్డంకులుగా పరిణమించవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైల దేవస్థానానికి సమాంతరంగా ప్రైవేటు ట్రస్ట్ దేవాలయ నిర్మాణమా?

- ట్రస్ట్‌కు అప్పటి ఈవో సహకరించినట్లుంది
- ఈ మొత్తం వ్యవహారంపై అనుమానాలు ఉన్నాయి
- లోతుగా పరిశీలించి మెరుగైన అఫిడవిట్ వేయండి
- రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖకు హైకోర్టు ఆదేశం
- విచారణ సెప్టెంబరు 18కి వాయిదా



అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానానికి చెందిన ఏనుగుల చెరువు స్థలంలో ఆలయం నిర్మాణానికి సేనాని సుబ్రహ్మణ్యం స్వామి ట్రస్ట్‌కు అప్పటి దేవస్థానం ఈవో సహకరించినట్లుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మొత్తం వ్యవహారంపై తమకు అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. శ్రీశైలం దేవస్థానానికి సమాంతరంగా ప్రైవేటు ట్రస్ట్ సుబ్రహ్మణ్యం స్వామి దేవస్థానం నిర్మిస్తున్నట్లుగా ఉందని పేర్కొంది. ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలించి మెరుగైన అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయశాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఏనుగుల చెరువు స్వభావాన్ని మార్చవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విచారణను సెప్టెంబరు 18కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. శ్రీశైలం దేవస్థానానికి చెందిన ఏనుగుల చెరువు స్థలంలో దేవాలయం నిర్మాణం, ల్యాండ్ స్కేపింగ్ చేసేందుకు ఈవో ప్రొసీడింగ్స్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ అఖిల భారత వీర శైవ ధార్మిక ఆగమ పరిషత్ ఛైర్మన్ సంగాల సాగర్ 2020లో పిల్ దాఖలు చేశారు. మాజీ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం ఫౌండర్ ఛైర్మన్‌గా ఉన్న సేనాని సుబ్రహ్మణ్యం స్వామి ట్రస్ట్‌తో దేవాలయం నిర్మాణానికి వీబీ టెక్నోక్రాఫ్ట్స్ ఒప్పందం చేసుకొందని తెలిపారు. అప్పట్లో ఈ పిల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. ఏనుగుల చెరువు స్వభావాన్ని మార్చవద్దని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వీవీ సతీశ్ వాదనలు వినిపించారు. దేవాలయం నిర్మాణం, ల్యాండ్ స్కేప్ కోసం ట్రస్ట్‌కు కేటాయించిన 28 ఎకరాల భూమిలో ఏనుగుల చెరువు 9ఎకరాలు కూడా ఉందని తెలిపారు.

పళ్లు పీకి.. 18 కోట్లు నొక్కేశారు!

- దంత చికిత్సల పేరిట భారీ స్కాం
- 385 ఆస్పతులకు అదనంగా చెల్లింపులు
- క్లెయిమ్‌లను రెండింతలు పెంచేసిన వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో జరిగిన అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. క్యాన్సర్ రోగుల చికిత్స పేరిట ట్రస్ట్ ఉద్యోగులు కొందరు కోట్ల రూపాయిలు కాజేసిన స్కాంను ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. తాజాగా డెంటల్ విభాగం స్కామ్ వెలుగులోకి వచ్చింది. డెంటల్ విభాగంలో పనిచేసే ఏడుగురు సిబ్బంది అవినీతికి పాల్పడి దాదాపు రూ.18 కోట్లు పక్కదారి పట్టించారు. వారం రోజులుగా అత్యంత రహస్యంగా దీనిపై విచారణ జరుపుతున్న ట్రస్ట్ అధికారులు రూ.18 కోట్ల అవినీతి జరిగినట్లు ఇప్పటి వరకూ గుర్తించారు. 2019-2024 మధ్యలో దాదాపు రూ.250 కోట్ల విలువైన డెంటల్ చికిత్సలను ట్రస్ట్ ద్వారా నిర్వహించారు. ట్రస్ట్ పరిధిలో దాదాపు 400 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. కేవలం 94 డెంటల్ ప్రొసీజర్స్‌కే ట్రస్ట్ అనుమతి ఉంది. అవినీతికి ఇదే ప్రధాన కారణంగా మారింది. నెట్‌వర్క్ ఆస్పత్రులు తక్కువ, ప్రొసీజర్లు తక్కువ, ప్రొసీజర్ రేట్లు కూడా ఇంకా తక్కువ కాబట్టి ఎంత అవినీతి చేసినా ఎవ్వరికీ తెలియదనే ధైర్యంతో ఉద్యోగులు భారీ అవినీతికి పాల్పడ్డారు. డెంటల్ విభాగంలో ఎంత శస్త్ర చికిత్స చేసినా రూ.30 వేలకు మించి బిల్లు అవ్వదు. ఒక చిన్న ఆస్పత్రి ఫిర్యాదు చేయడంతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తీగలాగితే డొంక కదిలినట్లు మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

ఎలా చేశారంటే...



రాష్ట్రంలో ఉన్న 400 నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి శస్త్ర చికిత్సలకు ప్రీఆర్థను ట్రస్ట్‌కు పంపిస్తారు. సాధారణంగా డెంటల్ చికిత్సల్లో పన్ను పీకడం, పళ్లు శుభ్రం చేయడం, పళ్లు సరిచేయడం తదితర చిన్న చిన్న ప్రొసీజర్లే ఉంటాయి. ఒక్కో పన్నుకు చేసిన చికిత్స ఆధారంగా ధర ఉంటుంది. రూట్‌కెనాల్‌కు ఒక్కో పన్నుకు ట్రస్ట్ రూ.700 చెల్లిస్తుంది. అలాగే టూత్ కలరింగ్‌కు రూ.545, ప్యాబ్రికేషన్ అండ్ సిమెంట్ చికిత్సకు రూ.1,630 చెల్లిస్తుంది. ఎవరైనా రోగి పళ్లు బాగా పాడైపోయ్యాయని, ప్యాబ్రికేషన్ అండ్ సిమెంట్ పెట్టమని ఆస్పత్రికి వస్తే, వెంటనే అతని వద్ద ఉన్న కార్డు ఆధారంగా ట్రస్ట్‌కు ఆస్పత్రి యాజమాన్యం ప్రీ ఆర్థ ఇవ్వాలని కోరుతున్నారు. ఆ తర్వాత ట్రస్ట్ పరిధిలో ఉండే ప్యానల్ డాక్టర్లు ప్రీఆర్థకు అనుమతి ఇస్తారు. ప్యాబ్రికేషన్ అండ్ సిమెంట్ అనేది ఒక పన్నుకా లేదా రెండు పళ్లుకా.. ఎన్ని పళ్లకు అనేది ప్రీ ఆర్థలోనే ఆస్పత్రి సిబ్బంది నమోదు చేయాలి. దాని ఆధారంగా ప్యానల్ డాక్టర్లు అనుమతిస్తారు. చికిత్స అయిన తర్వాత ఆస్పత్రి యాజమాన్యం ఆ శస్త్ర చికిత్సకు సంబంధించిన క్లెయిమ్‌ను ట్రస్ట్‌కు పంపిస్తారు. ట్రస్ట్ నుంచి ఆ క్లెయిమ్‌లు మొత్తం ప్యానల్ డాక్టర్‌కు వెళ్లాయి. ప్యానల్ డాక్టర్ పరిశీలించి ఆ శస్త్రచికిత్సకు కొంత మొత్తాన్ని నిర్ధారిస్తారు. ప్యానల్ డాక్టర్ ఎంత నిర్ణయిస్తే అంతే ఇవ్వాలి. కానీ,ట్రస్ట్‌లో ప్యానల్ డాక్టర్ ఆమోదించిన క్లెయిమ్‌లు ట్రస్ట్ డాక్టర్‌కు, అక్కడి నుంచి డెంటల్ జేఈవోకు వెళ్తాయి. అక్కడే అధికారులు భారీగా అవినీతికి పాల్పడ్డారు. ఆ బిల్లులను ట్రస్ట్ డాక్టర్, డెంటల్ జేఈవో భారీగా పెంచేశారు. ఉదాహరణకు ఒక ఆస్పత్రి ఒక శస్త్ర చికిత్స నివిౣత్తం రూ.20 వేల క్లెయిమ్‌ను ట్రస్ట్‌కు పంపిస్తే, ప్యానల్ డాక్టర్ ఆ క్లెయిమ్‌ను పరిశీలించి దీనికి రూ.10 వేలు చాలు అని నిర్ణయించారు. ఆ తర్వాత ట్రస్ట్ డాక్టర్ ఆ బిల్లును రూ.15 వేలు లేదా రూ.20 వేలకు పెంచేశారు. అదే క్లెయిమ్‌ను డెంటల్ జేఈవో రూ.25 వేలకు లేదా రూ.30 వేలకు పెంచేశారు. డెంటల్ జేఈవో ఆమోదించిన వెంటనే క్లెయిమ్ సీఈవోకు అక్కడి నుంచి సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లిపోతుంది. ఇలా కొన్ని వేల కేసుల్లో కోట్ల రూపాయిల స్కామ్‌కు పాల్పడ్డారు.

385 ఆస్పత్రుల పాత్ర...

2019-24 మధ్య జరిగిన డెంటల్ స్కామ్‌లో 385 నెట్‌వర్క్ ఆస్పత్రుల పాత్ర ఉన్నట్లు ట్రస్ట్ నిర్ధారించింది. ప్రతి ఆస్పత్రీ చేసిన శస్త్రచికిత్సలకు ట్రస్ట్ నుంచి తీసుకున్న బిల్లులకు పొంతన లేదు. కొన్ని ఆస్పత్రులు రూ.20 లక్షల విలువైన శస్త్ర చికిత్సలు చేసి రూ.40 లక్షల బిల్లులు తీసుకున్నాయి. ట్రస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ముందే ఆస్పత్రులతో బేరాలు మాట్లాడుకున్నారు. ఇలా గత ఐదేళ్లల్లో రూ.290 కోట్ల విలువైన డెంటల్ శస్త్ర చికిత్సలు జరిగాయి. ట్రస్ట్‌లోని సిబ్బందికి అందులో దాదాపు 10 శాతం ముట్టినట్లు తెలుస్తోంది. మరింత సమాచారం సేకరించిన తర్వాత ఈ స్కామ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయాలనే ఆలోచనలో ట్రస్ట్ అధికారులు ఉన్నారు.

ఆస్పత్రుల్లో రాత్రి గస్తీ

- భద్రత తనిఖీలు.. సీసీ కెమెరాల పర్యవేక్షణ
- వైద్య సిబ్బంది రక్షణకు కేంద్రం సూచనలు

న్యూఢిల్లీ, ఆగస్టు28: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో విధి నిర్వహణలో ఉన్న వైద్యుల భద్రత కోసం పలు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. జిల్లా ఆస్పత్రుల్లో ఎప్పటికప్పుడు భద్రతను తనిఖీ చేయాలని, రాత్రిపూట గస్తీ నిర్వహించాలని సూచించింది. వైద్య సిబ్బంది రక్షణకు ఉన్న చట్టాలు, వారిపై దాడులకు పాల్పడిన వారికి విధించే శిక్షల వివరాలను ఆస్పత్రి ప్రాంగణంలో స్పష్టం గా కనిపించేలా నోటీసులు అంటించాలని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, డీజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర లేఖ రాశారు. అన్ని జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల ఆవరణలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ఇక్కడి సిబ్బంది నిత్యం సీసీ కెమెరాలను పర్యవేక్షించాలని, ఆ డేటాను భద్రపరచాలని సూచించారు. అన్ని ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో రాత్రిపూట సాధారణ గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో సాధారణ ప్రజలు, రోగుల బంధువుల కదలికలపై నియంత్రణ ఉండాలని.. ఆస్పత్రుల్లో హింసాత్మక ఘటనల నియంత్రణ, వైద్యుల భద్రతకు అమలు చేయాల్సిన వ్యూహాల కోసం సీనియర్ వైద్యులు, పాలనాధికారులతో కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల యాజమాన్యాలు సంయుక్తంగా భద్ర తా పరమైన అంశాలను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లలో లోటుపాట్లు ఉంటే సమీక్షించి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతి మూలా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని సూచించారు.

రవాణాలో ఐదేళ్లు దాటితేనే బదిలీ

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వ మార్గదర్శకాలే పాటించాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఐదేళ్లు దాటిన వారినే బదిలీ చేయాలని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఆదేశాలిచ్చారు. రెండేళ్లకే బదిలీలపై రవాణాశాఖ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదం కావడంతో కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా ఆ నిర్ణయాన్ని ఆపేయాలని భావించారు. గత ప్రభుత్వ హయాంలో బదిలీల సందర్భంగా వివాదాలు, రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్టు వార్తలు రావడంతో పునరాలోచనలో పడ్డారు. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ జీవో అమలుకే కమిషనర్ మొగ్గు చూపారు. దీంతో రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి తాజా ఉత్తర్వులిచ్చారు.

జీఎంసీ అధ్యాపకులకు న్యాయం చేయాలి

- యూజీసీ స్కేల్ 2016ను అమలు చేయండి
- సీఎం చంద్రబాబుకు లక్ష్మీనారాయణ లేఖ

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల(జీఎంసీ) అధ్యాపకులను జగన్ సర్కారు దగా చేసిందని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ విమర్శించారు. గత ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరుతూ ఆయన బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. 'ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా సవరించిన యూజీసీ స్కేల్స్-2016ను అమలు చేయడానికి మార్గదర్శకాలను సూచించమని 2019, ఫిబ్రవరి 25న అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవోఎంఎస్ నం.138 ద్వారా ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక సమర్పించేలోపే శాసనసభ ఎన్నికలు రావడంతో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా సవరించిన యూజీసీ స్కేల్స్-2016ను అమలు చేస్తే 5 సంవత్సరాల 2 నెలలకు వేతన బకాయిలు చెల్లించాల్సి వస్తుంది. వాటిని ఎగ్గొట్టాలన్న దివాలాకోరు ఆలోచనతో 'ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ రివైజ్డ్ పే స్కేల్స్-2020'ని అమలులోకి తెస్తూ 2021, మార్చి 1న జీవోఎంఎస్ నం.22 జారీ చేసింది. జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయంపై న్యాయ పోరాటానికి సిద్ధమైన వివిధ జీఎంసీ అధ్యాపకులు 27 మంది 2022లో దాఖలు చేసిన రిట్ పిటిషన్ హైకోర్టులో విచారణలో ఉంది. వారికి సవరించిన యూజీసీ స్కేల్స్-2016ను అమలు చేసి, చెల్లించాల్సిన వేతన బకాయిలను చెల్లించాలి' అని లక్ష్మీనారాయణ సీఎంకు రాసిన లేఖలో కోరారు.

డీజీపీ ఆదేశాలనూ లెక్కచేయరా?

- రోజూ కార్యాలయానికి రావాలంటూ మెమో
- అయినా రోజుల తరబడి కనిపించని 'వైపీఎస్'లు
- వారి తీరుపై పోలీసు వర్గాల్లో విస్మయం
- కిందిస్థాయి సిబ్బంది ఇలా చేస్తే ఊరుకుంటారా!

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డీజీపీ... రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిఫామ్ విభాగాలకు అధిపతి. ఇక్కడ పనిచేసే ఐపీఎస్‌ల నుంచి కానిస్టేబుల్ వరకూ ప్రతి ఒక్కరూ పోలీస్ బాస్ ఆదేశాలు పాటించాల్సిందే. కానీ ఏపీలోని కొందరు 'వైపీఎస్' అధికారులు మాత్రం బాస్ మాటను లెక్క చేయడం లేదు. ఐపీసీని పక్కన బెట్టి వైసీపీకి జై కొట్టిన పలువురు ఐపీఎస్ అధికారులను ఎన్నికల సమయంలో ఈసీ పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వమూ వారికి ఎలాంటి బాధ్యతలనూ అప్పగించలేదు. అందులో 16 మంది రోజూ కార్యాలయానికి రాకుండా ఇతరత్రా కార్యక్రమాలకు పాల్పడుతున్నారని పోలీస్ బాస్‌కు సమాచారం అందింది. దీంతో వారందరూ ప్రతి రోజూ పోలీస్ ప్రధాన కార్యాలయానికి ఉదయం పదింటికి వచ్చి సంతకాలు చేయాలంటూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం ఐదింటికి ఇంటికి వెళ్లే ముందు రిజిస్టర్‌లో సంతకం చేసి సమయం నమోదు చేయాలని అందులో పేర్కొన్నారు. డీజీ ర్యాంకులో ఉన్న నిఘా విభాగం మాజీ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, అగ్నిమాపక శాఖ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్, డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీలు అన్బురాజన్, తిరుమలేశ్వర్ రెడ్డి, సిద్ధార్థ కౌశల్, మేరీ ప్రశాంతి, జీఆర్ రాధిక పోలీస్ బాస్ ఆదేశాల్ని లెక్కచేయడం లేదు. పీఎస్ఆర్ ఆంజనేయులు ఈ నెల 25 వరకూ, పీవీ సునీల్ కుమార్ 20 వరకూ సెలవులో ఉన్నారు. డీఐజీ విశాల్ గున్ని మొదట్లో కొన్ని రోజులు సంతకాలు చేసినా ఆగస్టు 20 నుంచి రావట్లేదు. తిరుమలేశ్వర్ రెడ్డి సుమారు నెల రోజులుగా రావట్లేదు. అన్బురాజన్ వారం రోజులుగా డీజీపీ కార్యాలయం వైపు చూడటం లేదు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం బదిలీ చేసిన సిద్ధార్థ కౌశల్, మేరీ ప్రశాంతి, జీఆర్ రాధిక కొన్ని రోజులుగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు రావడమే లేదు. దీంతో వారి తీరు పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కింది స్థాయి సిబ్బంది ఇలా చేస్తే ఊరుకుంటారా? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. కొల్లి రఘురామిరెడ్డి, కాంతి రాణా, పాలరాజు, రిశాంత్‌రెడ్డి, విజయారావు, రవిశంకర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా వస్తున్నా ఉదయం ఏదో ఒక టైముకి వచ్చి కాసేపట్లోనే వెళ్లిపోతున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 29 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com



కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** సెప్టెంబరు 2న
- **ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** సెప్టెంబరు 5
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

అడ్మిషన్స్

ఏసీఎస్ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ), పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

● మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్ఆర్ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత


గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in



రిలయన్స్ ఫౌండేషన్ పీజీ స్కాలర్‌షిప్

రిలయన్స్ ఫౌండేషన్- ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఎనర్జీ అండ్ లైఫ్ సైన్సెస్ విభాగాల్లో పీజీ చేస్తున్న అభ్యర్థుల కోసం ఉద్దేశించిన 'పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్స్ 2024-25' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, వర్చువల్ ఇంటర్వ్యూ ఆధారంగా మొత్తం 100 మందిని ఎంపిక చేస్తారు. స్కాలర్‌షిప్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి ఆరు లక్షలు ఇస్తారు. ఏటా నిర్దేశించిన మొత్తంలో 80 శాతాన్ని సంవత్సర ప్రారంభంలోనే చెల్లిస్తారు. మిగిలిన 20 శాతం మొత్తాన్ని ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ చార్జీలు, కాన్ఫరెన్స్‌లు, ఇతర అకడమిక్ ఖర్చుల నిమిత్తం అందిస్తారు. ఇంటర్న్‌షిప్, వర్క్‌షాప్‌లలో పాల్గొనే అవకాశాలు కల్పిస్తారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/కంప్యూటర్ సైన్సెస్/మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్/కెమికల్ ఇంజనీరింగ్/రెన్యూవబుల్ అండ్ న్యూ ఎనర్జీ/మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ఫుల్ టైమ్ పీజీ(ఎంఈ/ఎమ్మెస్సీ రీసెర్చ్/ఎమ్మెస్సీ/ఎంటెక్ రీసెర్చ్/ఎంటెక్/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్) మొదటి సంవత్సర ప్రవేశం పొంది ఉండాలి. గేట్ 2023 ఎగ్జామ్‌లో 550-1000 మధ్య స్కోర్ సాధించి ఉండాలి. డిగ్రీలో కనీసం 7.5 సీజీపీఏ సాధించి గేట్ రాయనివారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ ఎగ్జామ్‌లో 550 కన్నా తక్కువ స్కోర్ ఉంటే డిగ్రీలో 7.5కి పైగా సీజీపీఏ ఉన్నప్పటికీ దరఖాస్తుకు అనర్హులు. పీజీ రెండో సంవత్సరం చదువుతున్నవారు; ఆన్‌లైన్, డిస్టెన్స్, నాన్ రెగ్యులర్ మోడ్‌లో చదువుతున్నవారు; విదేశాల్లో పీజీ చేస్తున్నవారు కూడా అప్లయ్ చేయడానికి వీలు లేదు.

ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఇందులో వెర్బల్ ఎబిలిటీ, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం గంట. అభ్యర్థి సాధించిన స్కోర్‌ను వెంటనే సంస్థకు పంపుతారు. అభ్యర్థులకు తెలపరు. ఈ టెస్ట్ రాస్తేనే దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటారు. ప్రాక్టీస్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 6
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, అడ్రస్ ప్రూఫ్, రెజ్యూమె, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, పీజీ కాలేజీ బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు రిఫరెన్స్ లెటర్స్, అనుభవం లేదా ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు, వైకల్యానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం, గేట్ స్కోర్ కార్డ్, పర్సనల్ స్టేట్‌మెంట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్.
- **వెబ్‌సైట్:** www.scholarships.reliancefoundation.org/



జాబ్ కార్నర్

సీఎస్‌బీలో సైంటిస్టులు

బెంగళూరులోని భారత ప్రభుత్వ జౌళీ మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ సిల్క్ బోర్డ్(సీఎస్‌బీ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది

ఖాళీలు: 122

1. క్రాప్ సైన్సెస్-1, 2, 3
2. వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్
3. నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్-1, 2
4. అగ్రికల్చర్ ఎకనామిక్స్ అండ్ అగ్రి- బిజినెస్ మేనేజ్‌మెంట్ 5. అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్
6. అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్
7. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ

విభాగాలు: ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, ఫాం మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, యానిమల్ న్యూట్రిషన్, ప్లాంట్ పాథాలజీ, సెరీకల్చర్, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. ఐసీఏఆర్ ఏఐసీఎఫ్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ (పీహెచ్‌డీ)-2024 స్కోరు తప్పనిసరి

జీతం: నెలకు రూ.56,000- రూ.1,77,500

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబర్ 9

వెబ్‌సైట్: https://csb.gov.in/

ఆర్‌వీఎన్ఎల్‌లో మేనేజర్లు

ఢిల్లీలోని రైల్వే వికాస్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్)... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల సంఖ్య: 24

1. డిప్యూటీ జనరల్ మేనేజర్
2. సీనియర్ మేనేజర్ 3. అసిస్టెంట్ మేనేజర్
4. సీనియర్ ఎగ్జిక్యూటివ్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, బీకామ్, ఎంబీఏ(ఫైనాన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డీజీఎం పోస్టుకు 45 ఏళ్లు, సీనియర్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు

ఎంపిక: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్ట్ క్రాంతి భవన్, భికాజీ కామా, ఆర్కే పురం, న్యూ ఢిల్లీ చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 5

వెబ్‌సైట్: https://rvnl.org/job

ఐసర్‌లో ఫ్యాకల్టీ

బరంపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల సంఖ్య: 5

1. **ప్రొఫెసర్(కెమికల్ సైన్సెస్):** 1 పోస్టు
2. **అసిస్టెంట్ ప్రొఫెసర్ జి-1(ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కంప్యూటర్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్):** 4 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

విభాగాలు: సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, స్ట్రక్చరల్ బయాలజీ, న్యూరో బయాలజీ తదితరాలు

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్:https://iiserbpr.ac.in/

ఈఐఎల్‌లో పోస్టులు

ఢిల్లీలోని ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 77

పోస్టుల వివరాలు

1. ఇంజనీర్
2. ఆఫీసర్
3. సైంటిఫిక్ ఆఫీసర్
4. ఆర్కిటెక్ట్ 3. సైంటిఫిక్ ఆఫీసర్
5. డిప్యూటీ మేనేజర్
6. మేనేజర్
7. సీనియర్ మేనేజర్
8. డిప్యూటీ జనరల్ మేనేజర్

విభాగాలు: కెమికల్, మెకానికల్, సివిల్, లైబ్రరీ, ఫైనాన్స్, ఆర్కిటెక్చర్, ఎలక్ట్రికల్, మెటలర్జీ తదితరాలు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, బీఈ/బీటెక్ (మెటలర్జికల్/ మెకానికల్/ఎలక్ట్రికల్/సివిల్), పీజీ(బీఎస్సీ), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఆఫీసర్ పోస్టుకు 28 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 47 ఏళ్లు, మిగతా పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు మేనేజీరియల్ పోస్టులకు రూ.70,000 - రూ.2,80,000; మిగతా పోస్టులకు రూ.60,000- రూ.1,80,000.

పని ప్రదేశాలు: ఢిల్లీ, గురుగ్రామ్, ముంబయి, చెన్నై, వడోదర, కోల్‌కతా

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్:https://www.bemlindia.in/

ఎయిమ్స్ నాగపూర్‌లో సీనియర్ రెసిడెంట్‌లు

మహారాష్ట్ర, నాగపూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఖాళీలు: 60

విభాగాలు: అనస్తీషియాలజీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ హెమటాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిక్స్ సర్జరీ, న్యూరాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ మొదలైనవి.

అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం కూడా ఉండాలి.

జీతం: నెలకు రూ.67,700

వయసు: 45 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రూ.250; దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: సెప్టెంబరు 9

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 11

వేదిక: అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎయిమ్స్ క్యాంపస్, మిహాన్, నాగపూర్

వెబ్‌సైట్: https://aiimsnagpur.edu.in/



లిటిల్స్



చెడుపనులకు సాయపడితే...

రామాపురంలో ఉండే ఒక వ్యాపారికి తనది కాకున్నా ఉచితంగా వచ్చే ఏ సొమ్ము లేదా వస్తువుఅన్నా చాలా ప్రీతి.


ఒక రోజు రాత్రి అతను తన కొట్టు మూసే సమయానికి ఒక వ్యక్తి పరిగెడుతూవచ్చి, కొట్టులోకి దూరి వ్యాపారితో ఇలా అన్నాడు.' శెట్టి గారూ నేను ఈ ఊరి జమీందారు ఇంటిలో దొంగతనం చేసి, చాలా బంగారం, డబ్బు దోచుకుని వస్తున్నాను. నన్ను రాజ భటులు వెంబడిస్తున్నారు. నా అదృష్టం బాగుండి ఎలాగో మీరు కనబడ్డారు. నేను మీ కొట్టులో దాక్కున్న విషయం వారికి చెప్పకుండాఉంటే,నేను దోచుకున్న సొమ్ములో సగం మీకు ఇస్తాను దయచేసి నాకు ఈ సాయం చేయండి'అన్నాడు.

ఉచితంగా డబ్బుబంగారం దొరుకుతున్నాయి కదా అనే ఆశతో దానికి అంగీకరించాడు వ్యాపారి. అటుగా రాజభటులు వచ్చి, దొంగను గురించి అడిగితే,నేను కొట్టు కట్టేసి చాలా సేపయింది.ఈ వైపు అసలు ఎవరూ రాలేదు' అని చెప్పి, వారిని పంపివేశాడు వ్యాపారి. వారంతా దూరంగా వెళ్లిపోయారు అని తెలియగానే వ్యాపారి కొట్టులోపలికి వచ్చి,అక్కడ దాక్కున్న దొంగను'ఏదీనాకు నువ్వు ఇస్తానుఅన్న వాటా ఇవ్వు. నేను ఇచ్చిన మాట ప్రకారం నిన్ను భటులనుంచి కాపాడాను కదా' అన్నాడు. ఆ మాటలు విన్న దొంగ ఇక్కడే ఆగండిమీ వాటా సంచిలోనుండి బయటకు తీయాలి అని చెప్పి, సంచీలో నుంచి ఒక కత్తి, తాడు బయటకు తీసి, కత్తిని వ్యాపారి మెడకు పెట్టి బెదిరించి, అతన్ని ఒక ఆ తాడుతో కట్టేశాడు, అపుడు నెమ్మదిగా వ్యాపారి కొట్టులో ఉన్న డబ్బు ఇంకా ఇతర విలువైన వస్తువులన్నీ మూటకట్టితన సంచీలో వేసుకుని అక్కడినుండి వెళ్లిపోయాడు ఆ మర్నాడు వ్యాపారి తన కొట్టుచూసుకుని బాధతో బావురుమన్నాడు,, అత్యాశకుపోయి, దొంగచేసిన చెడుపనికి సాయం చేసినందుకు అనవసరంగా తన సొమ్ము కూడా పోయిందేఅని బాధపడ్డాడు. అందుకే ఇతరులుచెడుపనులుచేస్తున్నారని తెలిసినపుడు సాయపడటం సంగతి అటుంచి, వారికి దూరంగా ఉండటం మంచిది.


7 తేడాలను కనిపెట్టండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 396

					5		4	6
	1				8			
		5		1				7
	7					9		4
1			5		2			8
4		2					5	
7				5		8		
			3				7	
9	8		6					

సుడోకు - 395 సమాధానం

1	9	4	2	8	5	7	3	6
8	6	2	1	3	7	4	9	5
7	3	5	9	4	6	1	2	8
6	2	9	7	5	8	3	4	1
3	5	8	4	2	1	9	6	7
4	7	1	6	9	3	5	8	2
5	8	6	3	7	9	2	1	4
9	4	7	8	1	2	6	5	3
2	1	3	5	6	4	8	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.